1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

సంపుటి : 6
సంచిక : 6
పుటలు : 52
రు. 20 లు
తెనాలి

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

నవంబరు 2020



**అమ్మనుడి** కి
'యు.జి.సి-కేర్' గుర్తింపు

కనుమరుగైన నాట్యతపస్వి
## శోభానాయుడు

అమ్మనుడులే బడినుడులుగా ఉండాలి

తెలుగుజాతి పత్రిక
అమ్మనుడి
నుడి నాడు నెనరు

# **అమ్మనుడి** పత్రికకు యూజీసీ-కేర్ గుర్తింపు

University Grants Commission
Consortium for Academic and Research Ethics (UGC-CARE)

ज्ञान-विज्ञान विमुक्तये
UGC
University Grants Commission

| Sr.No. | Print Journals (Included in UGC-CARE List) |
|---|---|
| 5 | Title- *Ammanudi*<br>Language: Telugu<br>Publisher: Samala Ramesh Babu<br>ISSN: NA<br>URL : https://www.ammanudi.org |

పరిశోధనలలో నాణ్యతను పెంచి తద్వారా ప్రపంచ ప్రమాణాలతో సరిపోల్చేందుకు వీలుగా, దాని పరిధిలోని అన్ని విద్యా విభాగాలలో, విశ్వవిద్యాలయాల విరాళాల సంఘం (యుజిసి) కొన్ని "నాణ్యతా నియమాలను" ప్రతిపాదించి తద్వారా భారతీయ విద్యారంగాన్ని ఉత్తేజపరిచేందుకూ శక్తిమంతం చేయడానికీ ఉపక్రమించింది. ఈ నిర్ణయాన్ని నెరవేర్చడానికి ప్రత్యేకమైన కన్సార్టియం ఫర్ అకాడెమిక్ అండ్ రీసెర్చ్ ఎథిక్స్ (CARE)ను ప్రకటించింది (2018). దీని లక్ష్యాలలో కొన్ని, భారతీయ విశ్వవిద్యాలయాలలో నాణ్యమైన పరిశోధనలతో కూడిన ప్రామాణిక రచనలనూ వాటి ప్రచురణలనూ ప్రోత్సహించడం, ప్రపంచంలో అత్యున్నత స్థాయి(ర్యాంకు)లను సాధించడంలో సహాయపడేందుకు వీలుగా ప్రసిద్ధ పత్రికలలో నాణ్యత గల ప్రచురణలను ప్రోత్సహించడం. అలాగే, మంచి నాణ్యమైన పత్రికలను గుర్తించడానికి ఒక విధానాన్నీ పద్ధతినీ అభివృద్ధి చేయడం. దోపిడీ, సందేహాస్పద లేక అప్రామాణిక పత్రికలలో ప్రచురణలను నిరోధించడానికీ ఇది పనిచేస్తుంది. అన్ని విద్యా ప్రయోజనాల కోసం "యుజిసి-కేర్ నాణ్యమైన పత్రికల జాబితాను" (యుజిసి-కేర్ లిస్ట్)ను తయారుచేయడం నిర్వహించడం పరిశోధనా ప్రచురణల విశ్వసనీయతకోసం చాలా ముఖ్యం. ఎందుకంటే సంస్థాగత ర్యాంకింగ్, నియామకాలు, అధ్యాపక సభ్యుల పదోన్నతులు, విద్యాకమిటీల సభ్యత్వం, పరిశోధనా డిగ్రీల పురస్కారం వంటి వివిధ విద్యా ప్రయోజనాల కోసం పరిగణించబడే ప్రపంచవ్యాప్తంగా ఆమోదించబడిన సూచికలలో ప్రసిద్ధ పత్రికలలో ప్రచురించబడిన పరిశోధనా వ్యాసాల సంఖ్యే ప్రమాణం.

భారతీయ పత్రికల జాబితా, ముఖ్యంగా ఆర్ట్స్, హ్యూమానిటీస్, లాంగ్వేజెస్, కల్చర్ ఇంకా భారతీయ జ్ఞాన వ్యవస్థల విభాగాల నుండి (యుజిసి-కేర్ గ్రూప్) వడపోసి తయారు చేసి, ప్రతి మూడు నెలలకూ ఒకసారి నవీకరించబడుతుంది.

ఈ జాబితాలోకి **అమ్మనుడి** పత్రిక చేరిందని తెలియజేయడానికి సంతోషిస్తున్నాం.

-సంపాదకుడు

◆ తెలుగు అభివృద్ధి, సాధికారతల కోసం...
◆ తెలుగు భాషోద్యమ నిర్మాణం కోసం...
◆ ఆంధ్ర, తెలంగాణ, ఇతర రాష్ట్రాలు, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారి కోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు 9848016136

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి





నవంబరు 2020


## రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట –రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి.

2. రచనలను యూనికోడ్‌లో గాని, అనుఫాంట్స్‌లో గాని టైప్ చేసి పి.డి.ఎఫ్ మరియు వి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్‌చేసి *editorammanudi@gmail. com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంపవచ్చు.

3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ–మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకోలేము.

4. రచన స్వంతమేనని, ఇతర పత్రికల కుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంపలేదని, ఇంతవరకు ఎక్కడా ప్రచురణ కాలేదని హామీ పత్రాన్ని తప్పనిసరిగ రచనతో జోడించాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచనలను ప్రచురణకు స్వీకరించలేము.

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **ఆచార్యుని పలుకులు:** | అమ్మనుడులే..... | **ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు** | **07** |
| **శతజయంతి నివాళి:** | చిరస్మణీయుడు తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు | | **09** |
| **ఇతర రాష్ట్రాల్లో....:** | మహారాష్ట్రలోని ప్రభుత్వ ఎయిడెడ్.... | **అరవింద్ సర్దానా** | **10** |
| **అమ్మనుడితోనే అందలం:** | దేశ సంపదకు ప్రాంతీయ భాషలే.... | **జె.డి.ప్రభాకర్** | **15** |
| **కనుమరుగు:** | నాట్యతపస్వి శోభానాయుడు | **డా॥ మండలి బుద్ధప్రసాద్** | **19** |
| **తెలుగు బోధన:** | చదవడం అంటే ఏమిటి? | **సి.వి. క్రిష్ణయ్య** | **21** |
| **పీవీ శతజయంతి:** | పీవీ గారి సాహిత్యాభినివేశం | **డా॥ గంధం సుబ్బారావు** | **23** |
| **సంప్రదాయం–సాధికారత:** | కనుమరుగౌతున్న అమ్మ... | **డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'** | **28** |
| **సాహిత్యరంగం:** | నిరుడు వెలిగిన 'పత్రిక' | **డా॥ మధురాంతకం నరేంద్ర** | **46** |
| **యాత్రాసాహిత్యం:** | ఆమె లేఖలు | **డా॥ కాళిదాసు పురుషోత్తం** | **48** |
| **మాటల నిర్మాణం:** | పదనిష్పాదనకళ | **వాచస్పతి** | **30** |
| **నవల :** | జగమునేలిన తెలుగు– 12 | **డి.పి.అనూరాధ** | **42** |
| **ధారావాహికలు:** | పడమటి గాలితో... | **ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి** | **35** |
| | అడుగుజాడల్లో ఆనవాళ్లు–3 | **ఈమని శివనాగిరెడ్డి** | **38** |
| **కవితలు :** | మన బాసే మన గురించి సెప్తది... | **జె.డి.ప్రభాకర్** | **34** |
| | మీకేమైనా తెలుసా | **సుభాషిణి ప్రత్తిపాటి** | **41** |
| | సాక్ష్యం...!! | **డా॥ కె.ఎల్.వి.ప్రసాద్** | **41** |



| కార్టూన్లు | ఫోటోలు | కంప్యూటర్ |
|---|---|---|
| **సరసి** | **తమ్మా శ్రీనివాసరెడ్డి** | **బండారు రఘురాం** |


'అమ్మనుడి'లో ప్రచురణకై వార్తలు, ఫోటోలు, రచనలను కొందరు వాట్సాప్ (WhatsApp) లో పంపుతున్నారు. వాటిని ప్రచురణకు స్వీకరించలేము. దయచేసి కొరియర్‌లో / రిజిస్టర్డ్ పోస్టులో, లేదా **editorammanudi@gmail.com** కు పంపించండి. – సంపాదకుడు


రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి**, జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ–520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* *e-mail* : editorammanudi@gmail.com



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

## రచయితలకు విన్నపం

❖ ప్రచురణ కోసం పంపే రచనలను, వార్తలను ప్రతి నెల 15వ తేదీలోపుగా మాకు చేరునట్లు పంపి సహకరించండి. 20వ తేదీ దాటిన తరువాత చేరే వాటిని పరిశీలించడం ఇబ్బంది అవుతుందని గమనించండి.

❖ రచయితలు సరళమైన తెలుగు మాటలతో వ్రాయాలని మా విన్నపం. అచ్చతెలుగులోనే వ్రాయాలని మేము కోరడం లేదు. ఇతర నుడుల మాటలను తప్పనిసరైతేనే, వీలైనంత తక్కువగా వాడండి. మీ ప్రాంత తెలుగు మాండలికాల్ని, నుడికారాల్ని ఉపయోగించడానికి వెనుకంజ వేయవద్దు. తాపీ ధర్మారావు గారు చెప్పిన మాటలను ఇక్కడ గుర్తుకు తెచ్చుకొందాం:

'చదివిన విన్నా జనులందరికీ – చక్కగ తెలిస్తె రాతా/
మెదడు చించుకొని నిఘంటులన్నీ – వెదికించేదే రోతా'

'వాడుక మాటల వల్లనె భావాల్ – ప్రకటించిందే రాతా/
పాడు ముష్టితో పెద్ద సమాసాల్–వాడిందైతే రోతా'

'చిన్న మాటలనె గొప్పభావములు – చెప్పగలిగితే రాతా/
మిన్ను విరిగినట్టు ధ్వనించి – భావం సున్నచుట్టితే రోతా'

## చదువరులకు విన్నపం

❖ 'అమ్మనుడి' పత్రికను చందాదారులకు నేరుగా పోస్టులో పంపిస్తున్నాము. బయట ఎక్కడా అంగళ్లలో అమ్మకమునకు పెట్టడంలేదు. కనుక పత్రిక కావలసినవారు దయచేసి చందాదారులుగా చేరవలసిందిగా కోరుతున్నాము. వివరాలు ఈ పుటలోనే గలవు. దయచేసి ఆ సూచనలను అనుసరించ ప్రార్థన.

❖ అన్‌లైన్‌లో చందాను పంపినప్పుడు చందాదారుని పేరు, చిరునామా, ఫోన్ నెంబరు, తదితర వివరాలు బ్యాంకు వారి ద్వారా మాకు చేరవు. అందువల్ల మా కార్యాలయంలో ఆ వివరాలు నమోదు కావు. ఈ కారణంగా ఆ చందాదారుకు పత్రికను పంపే అవకాశం లేదు. దయతో ఈ ఇబ్బంది కలుగకుండా చూడండి. పైకం బ్యాంకుకు జమచేసిన వివరాలను కూడా తెలుపడం మరచిపోవద్దు. ఫోన్‌లో/ వాట్స్‌యాప్‌లో లేదా మెయిల్‌లో తెలుపండి.

❖ 'అమ్మనుడి' పత్రికను నడుపడం ఆర్థికంగా ఎంతో ఇబ్బందిగా ఉంది. చందాలే ఆధారం కనుక – మీ మిత్రులను, సంస్థలను ప్రోత్సహించి వారిని కూడా చందా దారులుగా చేర్పించగోరుతున్నాము.


తెలుగుజాతి పత్రిక
**అమ్మనుడి**
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు


## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ – పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**–యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.

**AMMA NUDI - AXIS BANK, TENALI**

అక్కౌంట్ నెం. **915020010550189**

**IFSC Code : UTIB0000556**

ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే చెల్లింపు వివరాలను, చందాదారుని పేరు, పూర్తి చిరునామా, ఫోన్‌నెంబరు, పిన్‌కోడ్ తదితర వివరాలను జాబు ద్వారాగాని, ఫోన్ ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా


**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8–386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా – 522 211. ఫోన్ : 9440448244
ఇ–మెయిల్ : ammanudi2015@gmail.com


**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**


**అమెరికా ఎన్నికల్లో భాషాప్రజాస్వామ్యం**

# అమెరికాలో తెలుగులో ఎన్నికల సామగ్రి!

‘బహుభాషా బ్యాలెట్లు ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక దశ.
అమెరికన్ ప్రజాస్వామ్యంలో పూర్తిస్థాయిలో పాల్గొనడానికి ఒక వంతెన’

**ఈమధ్య, తెలుగును యునైటెడ్ స్టేట్స్ అధికారిక భాషగా గుర్తించారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. దీనికి ప్రధాన కారణం, డొనాల్డ్ ట్రంప్ ఇంకా జో-బిడెన్ ఇద్దరూ తమ ఎన్నికల ప్రచారంలో, ప్రవాస భారతీయులు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో, వారిని ఆకర్షించే ప్రయత్నంలో భాగంగా భారతీయ భాషలను వాడుతున్నారు.**

ఎనిమిది రాష్ట్రాల్లో, ఒక అధికార పరిధిలో మాత్రమే ఆంగ్లేతర బ్యాలెట్లను అందించటం జరుగుతోంది (కొన్నిచోట్ల ఒకటి కంటే ఎక్కువ భాషలలో): అవి జార్జియా, హవాయి, ఇడాహో, మేరీల్యాండ్, నెవాడా, ఓక్లహోమా, ఉటా, వర్జీనియా. మరో మూడు రాష్ట్రాలలో - కాలిఫోర్నియా, ఫ్లోరిడా మరియు టెక్సాస్‌లలో మాత్రం రాష్ట్రవ్యాప్తంగా జారీ చేయబడిన ఏదైనా ఎన్నికల విషయాలను స్పానిష్ అనువాదాలను కూడా అందించాలి.




“ది హన్స్ ఇండియా” లో “యుఎస్ఎలో తెలుగు భాష అధికారిక భాషగా గుర్తించబడి అమెరికన్ బ్యాలెట్ పెట్టెలో చోటు సంపాదించింది”. అని ఆంగ్ల శీర్షికతో ప్రచురించిన వ్యాసం ఆధారంగా అనేక మంది సామాజిక మాధ్యమాలలో రాస్తున్నారు. ఐతే, అమెరికా ఇంతవరకూ ఇంగ్లీషును గానీ మరే ఇతర భాషనూ అధికారిక భాషగా గుర్తించలేదు. కానీ అమెరికాలో అతి వేగంగా అభివృద్ధి చెందుతున్న భాషలలో తెలుగు ఒకటి అనేదీ, అమెరికా రాష్ట్రపతి ఎన్నికలకు బ్యాలెట్లు తెలుగులో, కొన్ని రాష్ట్రాల్లో కొన్ని విదేశీ భాషలలో కూడా ముద్రించబడుతున్నాయి అనేది మాత్రం నిజం.

అమెరికాలో ఇప్పటివరకూ ఒక అధికారిక భాష అంటూ లేదు. ఐతే ఈ మధ్యన అనేక సందర్భాల్లో, అమెరికా పార్లమెంటు లేక కాంగ్రెస్ సభ్యులు ఇంగ్లీషును అధికారిక భాషగా గుర్తించడానికి ఒక బిల్లును ప్రవేశపెట్టడానికి ప్రయత్నించారు, కానీ ఫలించలేదు. ఇంగ్లీష్, వాస్తవానికి, యుఎస్‌లో అత్యధికుల వాడుక భాషే, కానీ దాన్ని రాజ్యాంగంలో లేదా సమాఖ్య చట్టాలలో అధికారిక భాషగా గుర్తింపు ఇవ్వనవసరం రాలేదు.

“ఆ దేశ వ్యవస్థాపక నేతలకు ఎవ్వరికీ అలా ఒక భాషను ఒకదాన్ని అధికారక భాషగా ప్రకటించాల్సిన అవసరం కనిపించలేదు”. అప్పటికి అమెరికాలో ఆ సమయంలో ఇంగ్లీషు ఒక ఆధిపత్య భాష, కాబట్టి దాన్ని రక్షించాల్సిన అవసరం కనిపించలేదు. యుఎస్‌లో మాట్లాడే 350 భాషల్లో తెలుగు వేగంగా అభివృద్ధి చెందుతోందని “బిబిసి వార్త” ప్రకటించడం అందరికీ తెలిసిందే. 2018లో ఒక అమెరికన్ గణాంక అధ్యయనాల ప్రకారం, 2010-2017 మధ్య తెలుగు మాట్లాడేవారి

సంఖ్య 86 శాతం పెరిగిందనేది కూడా వాస్తవమే.

ప్రతిసారీ, అ.సం.రా.లలో, ఆంగ్ల ప్రావీణ్యం పరిమితంగా ఉన్న ఓటర్లకు సహాయపడేందుకు వీలుగా ఎన్నికలలో బ్యాలెట్ పేపర్లు బహుళ భాషలలో ముద్రించబడతాయి. వర్జీనియా, టెక్సాస్, ఇల్లినాయిస్ ఇంకా కాలిఫోర్నియా వంటి రాష్ట్రాల్లో, తెలుగువారు గణనీయంగా ఉన్నప్రాంతాలు కాబట్టి ఈ రాష్ట్రాల్లో కొన్నింటిలో బ్యాలెట్లు తెలుగులోనూ, ఇతర విదేశీ భాషలలో కూడా అందుబాటులో ఉన్నాయి.

1975 లో, "భాషా అల్పసంఖ్యాక వర్గాలకు" ప్రత్యేక రక్షణలను చేర్చడం ద్వారా ఓటింగ్ హక్కుల చట్టపు మౌలిక ఉద్దేశ్యాన్ని కాంగ్రెస్ బాగా విస్తృతపరిచింది. ఆ చట్టంలో 203 అధికరణం కింద రక్షణ కోసం భాషా అల్పసంఖ్యాక వర్గాలు, అంటే అమెరికన్ ఇండియన్లు (రెడ్ఇండియన్లు), ఆసియా అమెరికన్లు, అలాస్కా స్థానికులు ఇంకా స్పానిష్ వారసత్వ పౌరులు మొదలైనవారు ఉన్నారు. అమెరికా చరిత్రలో మొట్టమొదటిసారిగా 1975నుంచి ఈ రక్షిత భాషా అల్పసంఖ్యాక వర్గాలు గణనీయంగా ఉన్న రాష్ట్రాలూ జిల్లాలలో ఇంగ్లీష్ తోపాటు ఇతర భాషలలో బ్యాలెట్ ఇంకా ఎన్నికల సామగ్రిని అందించాల్సిన అవసరం ఉందని నిర్ణయించారు. మొదట్లో వీటిని తాత్కాలిక నివారణలుగా ఉద్దేశించినప్పటికీ, అవి 1982 లోనూ, 1992లోనూ పునరుద్ధరింపబడి 2006లో మరో 25 సంవత్సరాలపాటు ఉండేట్లుగా నిర్ణయించారు.

ఇతర భాషలలో బ్యాలెట్లూ ఓటింగ్ సామగ్రిని తప్పనిసరి చేయడానికి ఏకైక తార్కిక కారణం ఇంగ్లీషు అంతగా రానివారికి ఓటింగ్‌ను సులభతరం చేయడం ఇంకా ప్రోత్సహించడం కోసమే -అయితే కొంతమంది ఆంగ్ల ఆధిపత్య భాషావాదులు ఇది సమాఖ్య చట్టం ఉల్లంఘన అనే ప్రతిపాదనను ముందుకు తీసుకువస్తున్నారు. ఎందుకంటే, ద్విభాషా బ్యాలెట్లు అమెరికా పౌరసత్వం అర్థాన్ని తక్కువ చేస్తాయట, ఓటర్ల మోసాలను ప్రోత్సహిస్తాయట ఇంకా అక్కడున్న ప్రవాసులూ వలసదారులూ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు కావలసిన ప్రోత్సాహాన్ని తగ్గించడం తద్వారా సహజీకరణ ప్రక్రియనూ సమగ్రతనూ దెబ్బతీస్తాయట. అందుకనే ఈ మధ్యనే మా పిల్లలకోసం ఇంగ్లీషును కాపాడండి, ఇంగ్లీషును అధికారికంగా చేయడానికి మాకు సహాయపడండి! అంటూ తదుపరి ఎన్నికల్లో బహుభాషా బ్యాలెట్లను ఆపడానికి ప్రోఇంగ్లీషు వాదులు పోటీపడుతున్నారు. అమెరికాలో ఉమ్మడి, ఏకీకృత భాషగా ఇంగ్లీష్ యొక్క చారిత్రాత్మక పాత్రను రక్షించడానికి ప్రభుత్వంలోని అన్ని స్థాయిలలో ఇంగ్లీషును అధికారిక భాషగా స్వీకరించడానికి చట్టసభ సభ్యులను ఒప్పించడానికీ న్యాయస్థానాల ద్వారానూ ఇంకా ప్రజాభిప్రాయాన్ని సేకరించి ఒప్పించేందుకూ పనిచేస్తామని ప్రోఇంగ్లీషు వాదులు బలంగా వాదిస్తున్నారు.

**ఐతే, ఓటింగ్ ప్రజాస్వామ్యానికి ఒక ముఖ్యమైన మూలస్తంభం. యునైటెడ్ స్టేట్స్‌లో, పరిమిత ఆంగ్ల ప్రావీణ్యం ఉన్న ఓటర్లకు తమ నాయకులను ఎన్నుకోవటానికీ సమస్యలపై లోతుగా ఆలోచించేందుకు వీలు కలిగించడానికీ బ్యాలెట్లు బహుళ భాషలలో కనిపించాలని భాషా అల్పసంఖ్యాక వర్గాల అనుకూలుర వాదన.**

**పౌర పరికల్పనా కేంద్ర నిర్దేశకుడైన విట్నీ క్యూసెన్‌బరీ బహుభాషా బ్యాలెట్లను ప్రజాస్వామ్యంలో ఒక ప్రాథమిక దశగానూ, అమెరికన్ ప్రజాస్వామ్యంలో పూర్తిస్థాయిలో పాల్గొనడానికి ఒక వంతెనగా వర్ణిస్తున్నారు. మొదటిసారి-ఓటర్లకు వారు బ్యాలెట్‌ను సరిగ్గా నింపుతున్నారనే నమ్మకాన్ని ఇవ్వడానికి బ్యాలెట్లు సహాయపడతాయి. "ఎన్నిక యంత్రాంగాన్ని అర్థం చేసుకోవడానికి ప్రజలకు మనం ఎంత ఎక్కువగా సహాయపడతామో ... మన సమాజంలో వారు పూర్తి సభ్యులుగా మారడానికి అంత సులభతరం అవుతుందని" అని క్యూసెన్‌బెర్రీ అంటున్నారు.**

కొంతమంది అలాస్కా స్థానికులూ, స్థానిక రెడ్ ఇండియన్ అమెరికన్, ఆసియన్ అమెరికన్ ఇంకా స్పానిష్ అమెరికన్ల-వారసత్వ పౌరులు ఎదుర్కొంటున్న ఎన్నికలలో అడ్డంకులను తొలగించడానికి, యు.ఎస్. కాంగ్రెస్ 1965 లో ఓటింగ్ హక్కుల చట్టానికి సవరణలుగా 1975 లో భాషా ప్రాప్యత నిబంధనలను జోడించింది.

ఆ సవరించిన చట్టంలో 203వ అధికరణం ప్రకారం, 10,000 లేదా 5% కంటే ఎక్కువ ఓటింగ్-వయస్సు ఉన్న పౌరులు ఒక భాషా అల్పసంఖ్యాకవర్గానికి చెందినవారైతే, అక్షరాస్యత రేటును తగ్గించి, ఇంగ్లీష్ బాగా మాట్లాడకపోతే న్యాయ పరమైన మినహాయింపులతో భాషా సహాయాన్ని అందించాలి అనేది సారాంశం

**ఇంగ్లీషూ, తెలుగుతోపాటు స్పానిష్, చైనీస్, హిందీ, కొరియన్, తెగలోగ్, అరబిక్, గుజరాతీ, పోలిష్, రష్యన్, ఉక్రేనియన్ ఇంకా ఉర్దూ భాషలలో ప్రాంతీయ అవసరాలకు అనుగుణంగా బహుభాషా బ్యాలెట్లు వాడుకలో ఉన్నాయి.ప్రో ఇంగ్లీషు వాదుల బలం పెరిగి సమీప భవిష్యత్తులో ఇంగ్లీషు తప్ప, మరే భాషకూ చోటుదొరకని కాలం రావచ్చు. అలాంటి వాదనలకు బలం చేకూర్చేదే 'ఇంటగెలిచి గదా రచ్చ గెలవాలనే వాదన'! అందుకనే, ముందుగా భారతీయ భాషలు బడి భాషలుగా మారాలి.**

(**అమ్మనుడి** ప్రతినిధి)

## 'ఎక్స్‌రే' అవార్డుకు కవితలు ఆహ్వానం

తెలుగు కవిత్వం అనేక ప్రాపంచిక పరిమాణాలకు స్పందిస్తూనే ఉంది. నాలుగు దశాబ్దాలుగా తెలుగు వచన కవితా రంగంలో విశిష్ఠ స్థానాన్ని పొంది, నిరంతర సాహిత్య పాఠశాలగా వెలుగొందుతున్న "ఎక్స్‌రే" జాతీయస్థాయి అవార్డుకు కవితలను ఆహ్వానిస్తున్నది. ప్రధాన అవార్డుకు ఎంపికైన కవితకు పదివేలు రూపాయల నగదుతో పాటు జ్ఞాపిక, సత్కారము, మరో పది కవితలకు ఉత్తమ కవితా పురస్కారాలు ఇవ్వబడతాయి. చారిత్రక వికాసాన్ని క్రమపద్ధతిలో పదిలపరిచే ఈ ప్రయత్నంలో కవులు పాల్గొని సహకరించగలరు. కవితా వస్తువు, పరిధి విషయాల్లో కవికి స్వేచ్ఛ ఉంటుంది. ఈ సంవత్సరం డిశెంబరు 25వ తేదీన విజయవాడలో జరిగే సభలో ఈ అవార్డులు బహూకరించబడతాయి.

కవితలు నవంబరు 30వ తేదీలోగా ఎక్స్‌రే, డోర్ నెం. 20-15-2, దాసువారి వీధి, అరండల్‌పేట, విజయవాడ - 2 చిరునామాకు పంపవలెను. వివరాలకు :98484 48763

**కొల్లూరి** ఎక్స్‌రే అధ్యక్షులు

సంపుటి : 6 సంచిక : 6
అమ్మనుడి
నవంబరు 2020

# అమ్మనుడులే బడినుడులుగా ఉండాలి

**జీవ** పరిణామ క్రమంలో భాష పుట్టుక ఒక విప్లవం. మానవుణ్ణి మహోన్నతుణ్ణి చేసినది తను మాట్లాడే భాషే. ఈ నేలపై పుట్టి పెరిగిన జీవులలో మనిషిదే ఉన్నత స్థానమని అందరికీ తెలుసు. అయితే ఆ మనిషి ఎందుకు అంతగా ఇతర జీవులపై పైచేయి సాధించి కనీ వినీ ఎరుగనటువంటి నాగరికతను సృష్టిస్తున్నాడంటేదానికి జవాబుగా – భాషే దానికి మూలం అని మానవశాస్త్రవేత్తలు అందరూ చెబుతారు. అంటే స్థూలంగా ఈ ప్రకృతిలో మానవుడు సాధించిన అన్ని విజయాలకూ మూలం భాషే. మరి, పరిణామ క్రమంలో ఆ భాష మనిషికే ఎందుకు సొంతం ఐనట్టు, ఇన్ని కోట్ల జీవరాసులు ఉండగా. దీనికి జవాబుగా 'మానవ మేధస్సే' కారణం అని అటు మేధావులూ ఇటు జీవశాస్త్రజ్ఞులూ కూడా అంటారు. మానవ మేధస్సు ఇంతగా పరిణితి చెందడానికి కారణం మనిషి మెదడు పరిమాణమే.

మెదడు బరువును బట్టే మనిషి తెలివిగలవాడు అయ్యాడు అంటారు. అయితే పరిణామ క్రమంలో అతి స్థూలకాయం కలిగిన జీవులలో మెదడు కూడా పెద్దదిగానే ఉంటుంది. కానీ ఆ మెదడులో ఎక్కువ భాగం ఆ స్థూలకాయాన్ని సజావుగా నడిపేందుకు పనిచేస్తుంది. జీవశాస్త్రజ్ఞులు జీవులలో తెలివికి కొలమానంగా జీవుల మెదడు బరువుకీ శరీర బరువుకీ మధ్యనున్న నిష్పత్తిని ప్రమాణంగా చెబుతారు.(మనుషులలోనూ ఎలుకల్లోనూ ఇది 1: 40 అయితే, చింపాంజీలలో 1: 110, ఏనుగులలో 1: 560గా ఉంది.) అయితే ఈ నిష్పత్తుల సాపేక్షతలో ఎలుకలు మనిషితో పోటీపడుతున్నాయంటారు. మళ్లీ దీనికి జవాబుగా మనిషి తెలివికి కారణం, మెదడుకు ఉన్న అనేక లోతైన ముడతలు ఉన్న పైపొరలే అంటారు. అంటే ఈ లోతైన ముడతల పొరలవలన ఉపరితల వైశాల్యం విపరీతంగా పెరుగుతుంది. ఇట్లా పెరిగిన ఈ ఉపరితల ముడతల పొరలలో ఉండే న్యూరాన్లు అనే కణజాలమే (కార్టెక్స్) మనిషి ఇంత తెలివిగా ప్రవర్తించడానికీ పరిణామ క్రమంలో భాషా వికాసం సాధ్యపడటానికీ మూలం అంటారు. ఈ న్యూరాన్‌లే సమాచారాన్ని అందుకోవడమూ పంపిణీ, బైటి నుంచి వచ్చే ప్రేరణలకు స్పందించడం మొదలైన కార్యక్రమాలను నిర్వహిస్తుంటాయి.

మనుషుల్లో గూడా శరీరక బరువూ మెదడు బరువుల నిష్పత్తిలో చాలా తేడాలు ఉన్నా శరీర బరువు ఎక్కువ ఉన్నవారికంటే శరీర బరువు తక్కువ ఉన్నవారు ఎంతో కొంత తెలివిగా ప్రవర్తిస్తారట. ఈ వరవడిలోనే పసిబిడ్డల్లో, చిన్నపిల్లల్లో మెదడు బరువు శరీర బరువుకంటే నిష్పత్తిలో (సుమారుగా 1:10)చాలాఎక్కువగా ఉండడం వల్ల ఆ వయసులో వారు పెద్దవారి కంటే తెలివిగా ఉంటారు. అందుచేతనే అతి సంక్లిష్టమైన భాషను ఎవరూ ప్రత్యేకంగా నేర్పకుండానే సులువుగా నేర్చుకోగలుగుతున్నారు.అమ్మ కడుపులో ఉండగానే అమ్మ మాటలకు స్పందిస్తూ అమ్మ నుడికి నేపథ్యాన్ని ఆలకిస్తూ, ఈ ప్రపంచంలోకి అడుగుపెట్టగానే తల్లిదండ్రుల నుంచీ చుట్టూ ఉన్నవారి నుంచీ అమ్మనుడిలో నేర్పును సాధిస్తాడు. భాష అంటే ఏవో నాలుగు పడికట్టుపదాలతో మాట్లాడగలగటం కాదు. ఆ చిన్న వయసుకే (ఆరేళ్లు) పిల్లలు భాషను అంతర్గతీకరించుకుంటారు. అంటే అమ్మనుడికి తమ మెదళ్లలో వ్యాకరణ నిర్మాణం చేసుకుంటారు. ఈ అమ్మనుడి పునాది పైనే, ఆ తరువాత నేర్చే ఇతర భాషా వ్యాకరణాల నిర్మాణం తేలికఅవుతుందంటారు భాషాశాస్త్రజ్ఞులు. ఈ ఉపోద్ఘాతం అంతా ఎందుకంటే, పిల్లల్లో భాషను నేర్చే శక్తి సామర్థ్యాలు సమస్త జీవరాసులలో కంటే ఎక్కువ. పిల్లలు భాషలను పుట్టక ముందు నుంచే మొదలుపెట్టి పుట్టిన ఆరు సంవత్సరాలకే అవసరమైన భాషనంతా నేర్చుకొంటున్నారు. ఇట్లా నేర్చిన భాషా పునాదిమీద మరో భాషను నేర్చుకోవడం సులువవుతుంది. ఆ అమ్మనుడే ఆ తరువాత తరగతి గదిలో నేర్చిన

కొత్త విషయాల అవగాహనతో విస్తృతమౌతుంది. ఈ పరిణామంలో పిల్లలకు ఎటువంటి బెరుకూ భయాందోళనలూ కలుగవు. ఈ క్రమాన్ని తల్లకిందులు చేసి తరగతిగదిలో అమ్మనుడికి బదులు పర నుడులను వాడితే పిల్లల మానసిక ప్రవర్తనలో అనూహ్యామైన మార్పులు చోటుచేసుకుంటాయి. తరగతిగదిలో భాష పరాయిది అయితే, పిల్లల మనస్సులో బెరుకూ, భయం, ఆందోళనా మొదలై, వారు చదువులో వెనకబడిపోవటమూ, చివరికి బడిమానేసెయ్యడమూ జరుగుతుంది. అందుకనే ప్రపంచమంతటా జరిగిన పరిశోధనలలో పిల్లల చదువులకు ఇంటి భాషే బడి భాష కావాలనే విషయం తేటతెల్లమైంది.


అమ్మభాషే బడి భాషగా కూడా ఉండాలనడానికి ఇప్పుడు చెప్పుకున్న విషయాలే కాకుండా ఇంకా ఎన్నో సామాజిక ఆర్థిక విషయాలూ సాంస్కృతిక అవసరాలూ ఉన్నై. భాషకు జాతి, మతం, కులం, ప్రాంతాల తేడాలు లేవు. అమ్మభాష పుట్టుకతోనే వస్తుంది. పర నుడులను ప్రత్యేకంగా నేర్చుకోవాలి. అది వ్యయప్రయాసలతో కూడినది. ఆ చిన్న వయసులో వారి శక్తియుక్తులూ డబ్బూ సమయమంతా పర భాష నేర్చుకోవడంతో సరిపెట్టగూడదు. ఒకే సమాజంలో కొందరి బడి భాష అమ్మనుడిగానూ మరికొందరి బడి భాష పరాయి భాష కావడంతో చిన్న వయసులో భేద భావాలు ఏర్పడతాయి. సమాన అవకాశాలు కల్పించే సమాజాన్ని నిర్మించాలనుకున్న నాయకులూ మేధావులూ ఎవ్వరూ బడి భాషగా పరాయి భాషలను ఆమోదించరు. అవి ప్రభుత్వ బడులైనా, ప్రైవేటు, కార్పోరేటు స్కూళ్లైనా అన్నింటా అమ్మనుడే బడిభాషగా ఉండాలనేది పైన చెప్పిన జీవభౌతిక సామాజిక కారణాల వలననే. అమ్మభాషే బడి భాష కావాలనేందుకు ఆర్థిక కోణం కూడా ఉంది. ఏ సమాజంలోనైనా, స్థూల జాతీయోత్పత్తి సాధన ఎలా సాగుతుందో పరిశీలించండి. వ్యవసాయం చేసే రైతులూ రైతుకూలీలు, పల్లెల్లోనూ పట్టణాలలోనూ ఉండి సాంప్రదాయక వృత్తుల ద్వారా వస్తూత్పత్తి చేస్తూ జీవనం సాగించేవారూ, పట్టణాలలోనూ బస్తీలలోనూ ఉంటూ గనుల తవ్వకం, కట్టడాల నిర్మాణం, రవాణా సౌకర్యాల కల్పనా నిర్వహణా, వస్తూత్పాదనా బాగుసేతల పరిశ్రమలలో పాల్గొనేవారూ, విద్యా వైద్య, వ్యాపార పాలనా రంగాలలాంటి సేవల వినియోగంలో పాల్గొనే సమస్త శ్రామికశక్తీ సమాచార వినియోగానికి వాడే భాషలలో ఎక్కువగా స్థానిక భాషలే ఉంటాయి. కొన్ని సంస్థలలో కొన్ని సందర్భాలలో మాత్రమే పరభాషలను వాడవలసిన అవసరం ఉండొచ్చు. వీరందరూ సృష్టించే సంపద భారత సాలుసరి ఆర్థిక గణాంకాల ప్రకారం చూసినా ఏడాదికి 85 శాతం స్థానిక భాషల ద్వారానే జరుగుతోందని తెలుస్తోంది. ఈ గణాంకాలు మన దేశ భాషల ఆర్థిక పరిపుష్టికి నిదర్శనం. ఈ విషయమే ఇంకొంచెం విడమరిచి చెప్పితే మన మాతృభాషలు అమ్మనుడులు మాత్రమే కాదు; మన సమాజాల ఆర్థిక సామర్థ్యానికి ఆధారాలు కూడా.

ఈ సమాజం సమాచార, వస్తూత్పత్తుల వినిమయం మీద ఆధారపడి నడుస్తోంది. మన సమాజపు ఆర్థిక శక్తి సామర్థ్యాలు పెరగాలంటే, అందరికీ ఉపాధి ఉద్యోగావకాశాలు అందుబాటులోకి రావాలంటే సమాచారం ముందుగా ఆ సమాజపు అమ్మ భాషలో ఉండాలి. ఒకే ప్రదేశంలో అనేక భాషా సమూహాలు ఉండవచ్చు. ఐనా ప్రతి భాషా సమూహమూ ఒక భాషా సమాజమే. ఆ సమాజానికి ఆ భాషలోనే వీలైనంతవరకు అవకాశాలు కల్పించాలి. అప్పుడే సమాచారం అందరికీ సులువుగా అందుబాటులోకి వస్తుంది. ఇట్లా అందుబాటులోకి వచ్చిన సమాచారమే ఆ సమాజంలోని పరిశ్రమలలో వస్తూత్పత్తికి ఆధారం ఔతుంది. అప్పుడే ఆ సమాజం వస్తూత్పత్తిలోనూ సమాచార వినిమయంలోనూ మరొకరి మీద ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. స్థానిక పరిశ్రమలు నిలదొక్కుకుంటాయి. సమాజం అభివృద్ధి పథంలో నడుస్తుంది. ఇదంతా జరగాలంటే మొత్తం సమాజంలో చదువులు అమ్మనుడిలోనే సాగాలి అనేది కుతర్కం కాదుగదా. ఈ విషయంపై ఈ సమాజంలోని పెద్దలూ, మేధావులూ, రాజకీయనేతలూ సావధానంగా ఆలోచించాలి.

– ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు
హైదరాబాదు విశ్వవిద్యాలయం
98661 28846

**శతజయంతి నివాళి**

# చిరస్మరణీయుడు, తెలుగు భాషోద్యమకారుడు
# తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారు



**1920 – 2020**

**2013**లో తనువు చాలించిన తమ్మారెడ్డి కృష్ణమూర్తిగారికి ఈ ఏడు సెప్టెంబరు16కు వందేళ్ల పండుగ జరగాల్సి ఉంది. అయితే ఆయన 93 ఏళ్లకే సెలవు తీసుకొన్నారు. ఆయన కనుమరుగుకు ఐదేళ్ల ముందు 'నేనూ నా జ్ఞాపకాలు' అనే 116 పుటల పుస్తకాన్ని ప్రచురించారు. అందులో తన అనుభవాలనూ, అభిప్రాయాలనూ, ఆశలనూ, ఆకాంక్షలనూ వెల్లడించారు. తన మధుర స్మృతులను నెమరు వేసుకొన్నారు.

ఆ పుస్తకాన్నంతా చదివివేసరికి నాకు ఆపెద్దాయన పూర్ణవ్యక్తిత్వం కళ్లకు కట్టినట్లనిపించింది. నాకు ఆయన పరిచయం 2003లో– తెలుగు భాషోద్యమ సమాఖ్యను అందరం కలిసి స్థాపించడానికి కొద్ది నెలల ముందు నుంచే. కలిసి పనిచేయడంతో నాకు ఆయన అంటే ఎంతో గౌరవం ఏర్పడింది. వారి సినిమాలను చూసినపుడు సమాజానికి పనికొచ్చే మంచి సినిమాల నిర్మాతగా ఆయన పట్ల నాలో ఏర్పడిన గౌరవం ఎన్నోరెట్లు పెరిగి, ఆయనతో సాన్నిహిత్యానికి దారి తీసింది. ఎంతో ఆలోచనతో, ప్రేమతో మాట్లాడే తీరు, అంత పెద్ద వయస్సులో ఆయనలో కనిపించే ఉద్యమ స్ఫూర్తి, ఆచరణా నాకెంతో స్ఫూర్తిదాయకంగా ఉండేది. కృష్ణమూర్తిగారి కంటే నేను 25 ఏళ్లు చిన్నవాణ్ణి.

తన పుస్తకం మొదటిలోనే 'మనసులో మాట' అంటూ ఇలా వ్రాసుకొన్నారు: "ఒక సామాన్య రైతు కుటుంబంలో పుట్టి, ఎవరి ఆసరా లేకుండా చిన్నప్పట్నుంచీ అంటే విద్యార్థి దశనుండీ, స్వయంకృషితో యెన్నెన్నో ఆటుపోట్లను యెదుర్కొని, మృత్యుముఖం చేరి, అదృష్టవశాత్తు తప్పించుకొని, మద్రాసు మహానగరంచేరి, సినీరంగ ప్రవేశం చేసి దాదాపు ఒక పుష్కరకాలం సినీరంగానికి చెందిన పలు అంశాలను అధ్యయనం చేసి ఆకళింపు చేసుకొని, శ్రేయోభిలాషుల ఉత్సాహప్రోత్సాహాలతో సుమారు ఓ డజను చిత్రాలు నిర్మించి, తెలుగు చలనచిత్ర చరిత్రలో నాకో సముచిత స్థానాన్ని సంపాదించుకొన్నాను అన్న తృప్తి నాకుంది."

ఆ పుస్తకంలో కృష్ణమూర్తి గారు వ్రాసుకొన్న 'మాతృభాషాసమితి'అనే వ్యాసాన్ని తెలుగు భాషోద్యమం పట్ల ఆసక్తి ఉన్నవారంతా తప్పక చదవాలి.

అందులోని కొన్ని మాటల్ని ఇక్కడ ఉటంకిస్తాను. "నా జీవితానుభవంలో అగ్రస్థానంలోనిది అని నేను భావించుకొని, ఆనందించే మధుర స్మృతులలో తెలుగుపట్ల ఏదో తెలియని మమకారంతో దాని వ్యాప్తి కోసం సేవ చేసే భాగ్యం కలగడం ఒకటి. నాకు అభిరుచి ఉన్న అంశాలలో ముఖ్యమైనది సామాజిక ఉద్యమాలలో పాల్గొనడం.... ఇవన్నీ ఒక ఎత్తు అయితే తెలుగు భాషా చైతన్యోద్యమంలో పాల్గొనడం ఒక్కటీ ఒక ఎత్తు.

"ఆ ఉద్యమంలో నేను ముందుండటానని ప్రకటించాను. అప్పటి నుంచి నేను మాతృభాషా సమితి కార్యక్రమాలలో నిమగ్నమైపోయాను. ప్రొఫెసర్ ఎన్.ఎస్.రాజు గారు 'తెలుగును కాపాడుకొందాం, అది మనల్ని కాపాడుతుంది' అనే చిన్న రచన ద్వారా ఇప్పటి తెలుగుస్థితి, తెలుగు వాడకం తగ్గడం వల్ల సమాజానికి భాషా ఉద్యమానికి ఒక శాస్త్రీయ ప్రతిపాదనలను ప్రకటించారు. అది నన్నెంతో ఆకర్షించింది. ఆ నేపథ్యంతోనే ఇప్పటి తెలుగు భాషా చైతన్యోద్యమం పుట్టింది. వివిధ పత్రాలను, ప్రభుత్వానికి ప్రతిపాదనలను రాజుగారు తయారు చేశారు. వాటిలో ప్రభుత్వ కర్తవ్యాన్ని సూచించారు. ఈ భూమిక మీద మేం అప్పటి విద్యామంత్రికీ ముఖ్యమంత్రికీ విజ్ఞప్తులు చేశాం. రాజకీయ పక్షాల ప్రతినిధులతో కలసి అప్పటి ముఖ్యమంత్రికి తెలుగును అధికార భాషగా అమలుచేయాలని, పాఠశాల విద్యలో తెలుగు మాధ్యమాన్ని ప్రోత్సహించాలని, తెలుగుభాషకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చెయ్యాలని, సుప్రసిద్ధ భాషావేత్త గిడుగు రామమూర్తిగారి జయంతిని తెలుగుభాషా దినోత్సవంగా జరపాలని విజ్ఞప్తి చేశాం. తెలుగు భాషా చైతన్య సమితి సుమారు పదేళ్ళ పాటు చేసిన కృషి ఇప్పుడు మన రాష్ట్రంలో తెలుగు భాషా వాతావరణం పెరగడానికి పునాది అయింది. దాని నిర్మాణంలో నేను ఒకడిని అయినందుకు చాలా సంతోషంగా ఉంది. 'తెలుగు భాషాచైతన్య సమితి గౌరవాధ్యక్షునిగా పనిచేయడం, తెలుగు భాషోద్యమ సమాఖ్యకు సలహాదారుగా వుండటం'నాజీవితంలోని కొన్ని ముఖ్యఘట్టాలు". అని ఆయన ప్రకటించారు.

తమ్మారెడ్డి కృష్ణమూర్తిగా ఆయన ప్రఖ్యాతులైనా ఆయన పూర్తిపేరు 'తమ్మారెడ్డి గోపాలకృష్ణమూర్తి'. తెలుగు చిత్ర నిర్మాణ రంగంలో ఆయన వారసత్వాన్ని, ఆ గౌరవాన్ని కాపాడుతూ ఆయన పెద్ద కుమారుడు భరద్వాజ గారు నిరంతరం కృషిచేస్తూ ప్రతిష్ఠను సంపాదించారు.

తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారితో కలిసి అత్యంత సన్నిహితంగా భాషోద్యమ రంగంలో పనిచేసిన తెలుగు సినీరంగ ప్రముఖులు కె.బి. తిలక్ గారూ, కీ.శే ఎంఎస్ రెడ్డి గారు, వారితో పాటు అండగా నిలబడ్డ మరో మరపురాని వ్యక్తి ముద్రణారంగంలో ప్రఖ్యాతులైన కీ.శే పరుచూరి హనుమంతరావు గారు.

తమ్మారెడ్డి కృష్ణమూర్తి గారి శతజయంతి సంవత్సరం సందర్భంగా ఆయనకు తెలుగు భాషోద్యమ సమాఖ్య తరఫునా భాషోద్యమంలో పాలు పంచుకొంటున్న అందరి తరఫునా అంజలి ఘటిస్తున్నాను.

– సామల రమేష్‌బాబు

ఇతర రాష్ట్రాల్లో
పాఠశాల విద్య

అరవింద్ సర్దానా
arvindewas@gmail.com

# మహారాష్ట్రలోని ప్రభుత్వ ఎయిడెడ్ సెమీ-ఇంగ్లీష్ పాఠశాలల నుండి మనం ఏమి నేర్చుకోవచ్చు?

**ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వమే పూనుకొని పాఠశాల విద్యను పూర్తిగా ఆంగ్లమాధ్యమంలోకి మార్చివేయడానికి ఉత్తర్వులనివ్వడమూ, చివరకు ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడమూ- ఇదంతా చదువరులకు తెలిసిందే. దీనిపై 'అమ్మనుడి'లో ఎంతో సమాచారాన్నిస్తూనే ఉన్నాము. పొరుగునున్న తమిళనాడులో ఆంగ్ల మాధ్యమం ఎలా ఎదురుదెబ్బలు తింటున్నదీ నవంబరు సంచికలో ఇచ్చాము. ఆ వ్యాస రచయిత్రి- అంజలీ మోదీ. ఈ పేరుకు బదులుగా పొరపాటున అరవింద్ సర్దానా అని ముద్రితమైంది. ఇప్పుడు అరవింద్ సర్దానా పరిశోధనాత్మక రచనను ప్రచురిస్తున్నాము. ఇందులో మహారాష్ట్ర, మధ్యప్రదేశ్‌లలో పరిస్థితులను ఆయన వివరంగా చర్చించారు. చదవండి, చర్చించండి.**

**శ్రీ అరవింద్ సర్దానా 'ఏకలవ్య సోషల్ సైన్స్' బృందంలో మూడు దశాబ్దాలుగా ఉన్నారు. మధ్యప్రదేశ్‌లోని కార్యక్రమాలతోపాటు ఎన్.సి.ఇ.ఆర్.టి (జాతీయ విద్యాపరిశోధన, శిక్షణ సంస్థ)లో 2006-09లలో సామాజికశాస్త్రంలో కొత్త పాఠ్యపుస్తకాలను అభివృద్ధి పరచడంలో సన్నిహితంగా పనిచేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోను, ఇతర రాష్ట్రాల్లోను, 2005 జాతీయ కరిక్యులం ఫ్రేంవర్క్ (ఎన్‌సియఫ్- జాతీయ పాఠ్యప్రణాళిక రూపకల్పన) తర్వాత కొత్త పాఠ్యపుస్తకాల నిర్మాణంలో భాగం పంచుకొన్నారు.**

**చాలా** ప్రభుత్వాలు ఆంగ్ల విద్య పట్ల తమ విధానాన్ని ప్రకటిస్తుండగా మరికొన్ని ప్రభుత్వాలు తమదైన మార్గాలను ఎంచుకున్నాయి. తల్లిదండ్రుల పేరిట చేసిన ఎంపికలో అస్పష్ట, అనర్థదాయక ఆలోచనా పరిష్కారాలు ఉన్నాయి. అన్ని తెలుగు మీడియం పాఠశాలలనూ ఇంగ్లీష్ మాధ్యమంలోకి మార్చాలన్న ప్రభుత్వ ఉత్తర్వులను ఇటీవల ఏ.పి. హైకోర్టు రద్దు చేసింది. ఏ.పి. ప్రభుత్వమూ ఇతరులూ దీనిని సుప్రీంకోర్టుకు తీసుకెళ్లడం కంటే ప్రత్యామ్నాయాలను పరిగణనలోకి తీసుకొని మధ్యే మార్గాన్ని ఎన్నుకోవాలి. ప్రజా ప్రయోజనాలకు అనుగుణంగా ఉండే విధానపరమైన సహేతుకమైన ఎంపికలను పరిగణనలోకి తీసుకొనే సామర్థ్యాన్ని కార్యనిర్వాహకులు కోల్పోకూడదు. మహారాష్ట్రలోని సెమీ-ఇంగ్లీష్ పాఠశాలల మధ్యేమార్గ విధానాన్ని బోధనా అవగాహన ఇంకా బహుభాషా వనరులతో స్వీకరించవచ్చు. సరైన భాషా విధానానికీ దాని ఆచరణకూ మధ్య ఇతర వారధులు ఉండవచ్చు.

**మహారాష్ట్రలో సెమీ-ఇంగ్లీష్ మాధ్యమ తీరుతెన్నులు**

మహారాష్ట్రలోని చాలా పాఠశాలలు చాలా కాలంగా 'సెమీ ఇంగ్లీష్' అనే ప్రమాణాన్ని పాటిస్తున్నాయి. ఈ పాఠశాలలు మరాఠీ మాధ్యమం అయినా పాఠశాల మధ్య స్థాయిలో సైన్స్ మరియు మ్యాథమెటిక్స్ కోసం ఇంగ్లీషులో పాఠ్యపుస్తకాలను ప్రవేశ పెడుతుంటాయి. మొదట్లో ఆ ప్రభుత్వ సహాయంతో నడిచే (ఎయిడెడ్) పాఠశాలలు, తాలూకా, పట్టణ, పట్టణాలకానుకొన్న ప్రాంతాలకు పరిమితం చేయబడ్డాయి. ఈ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలను స్థానిక ట్రస్టులు నిర్వహిస్తున్నాయి. ఇటీవలే 2005 తరువాత రాష్ట్రంలోని అనేక ప్రభుత్వ పాఠశాలలకు ఈ సెమీ ఇంగ్లీష్ విధానాన్ని అనుసరించడానికి అనుమతి ఇవ్వబడింది. ఈ ప్రమాణం నేడు గ్రామీణ పాఠశాలలకు వ్యాపించి, ప్రభుత్వ పాఠశాలల నుండి నిష్క్రమణను కొంతవరకు ఆపగలిగింది. రెండు దశాబ్దాల క్రితం మహారాష్ట్రలో కొంత దూరంగా ఉన్న తాలూకా ప్రాంతాలలో, అక్కడ ఉండే తల్లిదండ్రులకు ఇంగ్లీషు సహాయాన్ని అందించగల నేపథ్యం లేదు. ఇంగ్లీషులో పుస్తకాలు లేవు. ఇక్కడ ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలో 'సెమీ ఇంగ్లీష్' ఏమి సూచిస్తున్నది? ఈ పాఠశాలల్లో మధ్యస్థ స్థాయిలో సైన్స్ ఇంకా మ్యాథమెటిక్స్ పాఠ్యపుస్తకాలు ఇంగ్లీషులో, ఇతర సబ్జెక్టులు మరాఠీలోనే ఉంటాయి. ఇంగ్లీష్ కూడా ప్రత్యేక సబ్జెక్టుగా బోధించబడుతుంది. ఈ పిల్లల ప్రాథమిక విద్య వారందరికీ ఇంటి భాష లేదా ప్రాంతీయ భాష అయిన మరాఠీలో ఉండేది. మరీ ముఖ్యంగా తరగతి గది సంస్కృతి మరాఠీ లో ఉంటుంది. అంటే వివరణలూ ప్రశ్నలూ సంభాషణలూ మరాఠి భాషలోనే ఉంటాయి. ఉపాధ్యాయులు పాఠాన్ని ఇంగ్లీషులో చదివి మరాఠీలో వివరిస్తారు.

బోధనా విధానం చాలా సాంప్రదాయకంగా ఉన్నప్పటికీ, ద్విభాషా సాంస్కృతిక ప్రక్రియ అంతటా అంగీకరించబడింది. పిల్లలు ఇంగ్లీషు పాఠాలను చదవడానికి ప్రయత్నం చేసి, మరాఠీలో పదాల అర్థాన్ని రూపొందించడంలో ఆలోచించడం అలవరచుకుంటారు. ఈ రోజు నా తోటి ఉద్యోగులైన ఈ పాఠశాల పాత విద్యార్థులు కొందరితో మాట్లాడితే, ఎవరైనా ఇట్టే చెప్పొచ్చు ఈ పాఠ్యపుస్తకాలను చదవడం వారికి అంత సులభం కాదని. కష్టమైన పదాల అర్థాలను గుర్తించడం, పదాలను కంఠస్థం చేయడం, అదే సమయంలో ఆంగ్లంలో సమాధానాలు రాసేపని లాంటి భయపెట్టే ప్రక్రియలతో వారు కష్టపడ్డారు. ఏదేమైనా, ప్రవేశపెట్టబడిన కొత్త భాషతో క్రమంగా పరిచయం పెరగడం, ఎక్కువగా పాఠ్యపుస్తకాలూ ఉపాధ్యాయుల

కృషిపై ఆధారపడటం జరుగుతూవుంది. ఇంగ్లీషులో రాయడం అనేది నిజమైన సవాలుగానే మిగిలిందని ఈ రోజు మనం చిన్న సహోద్యోగుల అనుభవాన్ని బట్టి చూస్తే అవగతం అవుతుంది. అయినప్పటికీ, సైన్స్ లేదా గణితంలో తెలిసిన పాఠ్యపుస్తక విషయాలను నమ్మకంతో చదవడం బాగా పెరిగింది. నా సహచరులు మూడు, నాలుగు సంవత్సరాలలో వివరించినట్లుగా, **వారు సాంస్కృతిక అవరోధాన్ని దాటినట్లు కనిపించారు. అక్కడ వారు ఇంగ్లీషులో ఉన్నత విద్య కోసం ఆకాంక్షించే కలను నేరవేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. మరాఠీలో తోటివారితో లేదా ఉపాధ్యాయులతో సాంకేతిక సంభాషణల వాతావరణం ఎంతో కొంత ఆదరణకు నోచుకుంది. వారు నేర్చుకున్న ఇంగ్లీష్ అనర్గళంగా లేదు కానీ ప్రపంచాన్ని ఎదుర్కొనే విశ్వాసానికి భిన్నంగా లేదు. మరీ ముఖ్యంగా వారు మరాఠీపై స్వారీ చేసే బలాన్ని పూర్తిగా ప్రాథమిక భాషగా మరాఠీనీ ఉపయోగించడంతో జరుగుతోంది. మరాఠీ పట్ల వారికి ఉన్న గౌరవం నిజమైనది, లోతైనది, ఇంకా కొనసాగుతోంది.**

పిల్లలు భాషలను సులభంగా నేర్చుకోగలరని భాషాశాస్త్రవేత్తలు సూచిస్తున్నారనే సత్యాన్ని వారు చెప్పారు. **ఇంటి భాష లేదా ప్రాంతీయ భాషలో ఉన్న అర్థవంతమైన పటిమ మరొక భాషలో నైపుణ్యాలను సంపాదించడానికి సహాయపడుతుంది. ఈ విధంగా ఇంటిభాష లేదా ప్రాంతీయ భాష పట్ల గౌరవం పెరుగుతుంది. తల్లిదండ్రులు అలాంటి విధానానికి మద్దతు ఇచ్చారు, ఎందుకంటే అది కోరికలకు ఆటంకం కలిగించలేదు.** ఉదాహరణగా నేను మాట్లాడిన ఒక సహోద్యోగి, ఇరవై సంవత్సరాల క్రితం ఆమె తన ప్రాథమిక విద్య సతారా జిల్లాలోని తన గ్రామ పాఠశాలలో చదువుకుంది. ఆమె మాధ్యమిక పాఠశాల (మిడిల్ స్కూలు) డొంబావ్లిలో సెమీ ఇంగ్లీష్ మోడల్ ప్రభుత్వ పాఠశాలలో ఉంది. ఈ పాఠశాల మంచి పేరు సంపాదించి ఆమె మొహోలీలోని SERలో తన తదుపరి చదువులను కొనసాగించగలిగింది. చంద్రపూర్ జిల్లా నాగ్‌భిడ్ అనే చిన్న పట్టణానికి చెందిన మరో సహోద్యోగి తన పట్టణంలోని ఎయిడెడ్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్నాడు. తరువాత నాగపూరులో ఇంజనీరింగ్ చేశాడు. అలాగే, దేశంలోని ఒక ప్రధాన విజ్ఞాన సంస్థలో బోధిస్తున్న ఒక సహోద్యోగి ఇలా వ్రాశాడు, "నేను నా 11 -12 వ యేట థానే వద్ద అలాంటి పాఠశాలకు వెళ్లాను - ఇది 1890లలో ఏర్పాటు చేసిన ఛారిటబుల్ ట్రస్ట్ చేత నిర్వహించబడుతున్న పాఠశాల. నా తల్లి, ఆమె తోబుట్టువులూ దాయాదులూ ఈ పాఠశాలకు వెళ్ళారు. 11 వ-12 వ యేట కూడా తరగతి గది సంస్కృతీ భాషా-మరాఠీనే. ఐతే, ఆంగ్ల పరిభాషను ఉపయోగించి మరాఠీలో గణితం మరియు విజ్ఞాన విషయాలను వివరించేవారు -బహుశా ఇది ఆ ఉన్నత పాఠశాల సెమీ-ఇంగ్లీషు కొనసాగింపు గాబోలు. చాలామంది విద్యార్థులు దిగువ మధ్యతరగతి ఆర్థిక స్థితికి చెందినవారే. ఇది 1996-97లో, ప్రతి ఒక్కరూ కంప్యూటర్ ఇంజనీరింగ్ లేదా కనీసం ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ కోసం వెళ్లాలని కోరుకున్నారు."

(తోటి ఉద్యోగులతో సమాచారం, ముఖాముఖీల ఆధారంగా)

**మధ్యప్రదేశ్‌లో విరుద్ధమైన దృశ్యం**

మధ్యప్రదేశ్‌లో ఒక జిల్లాకు చెందిన బస్తీ పరిస్థితి దీనికి విరుద్ధంగా ఉంది. రెండు దశాబ్దాల క్రితం చాలా తక్కువ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలు ఉండేవి. అన్నీ ప్రైవేట్ పాఠశాలలే. వారి తరగతి గదుల్లో ఉపయోగించాల్సిన భాషగా హిందీని నిషేధించారు. ఉపాధ్యాయులు హిందీలో సులభమైన పద్ధతిలో వివరించలేరు. పిల్లలు హిందీలో మాట్లాడటానికి అనుమతి లేదు, ఎందుకంటే విద్యార్థులు ఇంగ్లీషును ఎంచుకోరని నిర్వాహకులూ, ఉపాధ్యాయులూ నమ్ముతారు. మీరు పిల్లలను ఇంగ్లీషులో మాట్లాడమని బలవంతం చేయాలని వారు వివరించారు. అన్ని పాఠ్యపుస్తకాలూ ఇంగ్లీషులోనే, హిందీ మాత్రం ఒక సబ్జెక్టుగా ఉంటుంది. ఇలాంటి అనేక పాఠశాలల్లో ప్రాథమిక విద్య కూడా ఇంగ్లీషు మాధ్యమంలో ఉంటుంది. ఆట స్థలంలో, తరగతి వెలుపల, స్టాఫురూంలో ఉపాధ్యాయులూ పిల్లలూ ఇద్దరూ హిందీయే వాడుక. కానీ దీన్ని వారు చదువుతున్న పాఠ్యపుస్తకాలలోని వివరణలూ సంభాషణల కోసం తరగతి గది భాషగానూ ఉపయోగించడంలేదు. ఇది తరగతి గది బోధనా భాష కాదు. ఇంగ్లీషులో నైపుణ్యం తీవ్రంగా పరిమితం అయిన ఉపాధ్యాయులు సంక్షిప్త వివరణలను మాత్రమే చేస్తున్నారు. ఉపాధ్యాయులూ, విద్యార్థులూ కొన్ని సార్లు హిందీని ఉపయోగించినందుకు ప్రిన్సిపాల్ తీవ్రంగా మందలించేవారు. తరగతి గదిలో హిందీని ఉపయోగించినప్పుడు కూడా అది తగనిది అనే భావనతో పరిమితం చేయబడింది.

నా తోటి ఉద్యోగి ఒకరు అటువంటి పాఠశాల ప్రిన్సిపాల్‌గా, 11 - 12 వ తరగతికి సంబంధించిన కొంతమంది సీనియర్ ఉపాధ్యాయులు అతన్ని సవాలు చేయటాన్ని గుర్తుకుతెచ్చుకున్నాను. వాళ్లుబోర్డు పరీక్షను సులువుగా దాటగలగాలంటే వారికి అర్థమయ్యే రీతిలో హిందీలో వివరించటం తప్పనిసరి అని భావించేవారట. ఈ సహజ ధోరణి కొన్నేళ్లుగా అణచివేయబడుతోంది, ఎందుకంటే 'ఇంగ్లీషులో మాత్రమే మాట్లాడండి' అనే ప్రమాణానికి విస్తృత ఆమోదం ఉంది. దీంతో చిక్కులు తీవ్రం. ఉపాధ్యాయులూ విద్యార్థులూ ఇద్దరికీ అనుకూలమైన మార్గం పిల్లలు గుర్తుంచుకోవాలనుకొన్న పాఠంలోని సమాధానాలను 'బ్రాకెట్లలో పెట్టడం', ఆపైన బట్టీపట్టడం! ఈ పిల్లలు పట్టణంలోని ఉన్నత మధ్యతరగతి కుటుంబాల నుండి వచ్చారు. బడి పనులను అర్థం చేసుకోవడానికి తగినంత సమయం ఉంటుంది, ఇంట్లోనూ, ట్యూషన్‌లోనూ వారికి సహాయం అందుతుంది గదా, దాంతో ప్రపంచంలో ఎలాగో నెట్టుకొస్తారు. హిందీ పట్ల వారికున్న గౌరవం గణనీయంగా తగ్గిపోయింది. అటువంటి వాతావరణంలో, మధ్య ప్రదేశ్‌లో అభిమానించే భాషగా ఇంగ్లీష్ ఉన్నత పాఠశాలలకు చెందిన చాలా తక్కువ మంది విద్యార్థులకు మాత్రమే పరిమితం అయింది. కానీ, హిందీలో అర్థం చేసుకోవడం, అవగతం చేసుకోవడం మాత్రం వారికి సహజమైనా అది నిషేధానికి గురైంది. మరోవైపు, మహారాష్ట్రలో పాఠశాలలో అభిమానించే అంశాలకు అర్థవంతమైన అవగాహనను మిళితం చేయగల


సమీకృతవిద్యావిధానాన్ని అనుసరిస్తున్నారు. ఈ పాఠశాలలు పట్టణ, పట్టణ పరిసర ప్రాంతాల్లో ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలలుగా నడుస్తున్నాయి. అందులోనూ, విద్యార్థుల జనాభా విస్తృతంగా ఉన్నా, ఉన్నతవిద్య పరిమితంగా అందుబాటులో ఉండేటటువంటి విద్యార్థి జనాభానే ఎక్కువ భాగం ఉన్నారు.

**మధ్యప్రదేశ్‌లో సెమీ-ఇంగ్లీష్ విధానం ఎందుకు ఉండకూడదు?**

*"... ఎరుకువ పెరుగుదలలో* (cognitive growth) *ఇంటి ఇంకా పొరుగు భాషల పాత్రను అంగీకరించడానికి ఇష్టపడకపోవడమూ ఎరుకువలో పెరుగుదల ఉన్న భాషాప్రావీణ్యం భాషల మధ్య బదిలీ కాకపోవడాన్ని గమనించడంలో వైఫల్యం."(ఎన్‌సిఇఆర్‌టి 2006 ఎ:iv).*

**ఒక వ్యూహం ద్విభాషా విధానాన్ని స్వాగతిస్తే మరొకటి ప్రాంతీయ భాషకు తలుపులు మూసివేస్తుంది. హిందీని నిషేధించాలనే వికృత ఆలోచనా వ్యాప్తి ఎం.పీ.లో భాషను నేర్చుకోడానికి సంబంధించి అనేక చిక్కులు పుట్టుకొచ్చాయి.** ఉదాహరణకు, దేవాస్ నుండి 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఒక గ్రామీణ ప్రైవేట్ హిందీ మీడియం పాఠశాల గత పదిహేనేళ్ళలో గ్రామంలో నెమ్మదిగా స్థిరపడి, నేడు ఇంగ్లీష్ మాధ్యమానికి మారే ఒత్తిడిలో ఉంది. చుట్టుపక్కల వాతావరణంలో ఇంగ్లీష్ ఎక్కడా లేకపోయినా నేర్చుకోవాలనేవారి కోరిక బలంగా ఉంది. ఈ పాఠశాలపై ఒత్తిడి తల్లిదండ్రుల నుండి ఇంకా గ్రామానికి చుట్టుపక్కల ఉన్న పెద్ద ఇంగ్లీష్ మీడియం పాఠశాలల పోటీ నుండి వస్తోంది. ఈ పాఠశాలల్లో కొన్ని పైన పేర్కొన్న విధంగానే అనుసరిస్తాయి. పాఠశాలలో హిందీ నిషేధించబడింది. ఈ విద్యార్థుల ఇంటిభాష మాళవి అయినా, ప్రాంతీయ భాషగా హిందీనే అందరూ మాట్లాడుతారు. **ఈ ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుడిగా తన అనుభవం ద్వారా, ఇంగ్లీషును ఒక సబ్జెక్టుగా కలిగి ఉండటం సరిపోతుందని నమ్ముతారు. గ్రామంలో పిల్లలను తీసుకెళ్లడానికి మినీ బస్సు సేవలను అందించే ఈ పెద్ద ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాలలు ఉన్నత కుటుంబాల నుండి వచ్చిన తన విద్యార్థులను వేటాడతాయని అతను ఆందోళన పడుతున్నాడు.** ఈ గ్రామానికి చెందిన 7 వ తరగతి విద్యార్థిని, ఈ పెద్ద ప్రైవేట్ పాఠశాలల్లో చదివి కూడా ఆమె సైన్స్ పాఠ్యపుస్తకాన్ని అర్థం చేసుకోలేదు. ఈ గ్రామానికి చెందిన మరో విద్యార్థిని 8 వ తరగతి తరువాత ఈ పాఠశాలలో తట్టుకోలేమని ఆమె తల్లిదండ్రులు భావించి ప్రభుత్వ హిందీ మీడియం ఉన్నత పాఠశాలకు తరలించారు. ఇలాంటి విషయంలో పిల్లవాడిని నిందిస్తారుగానీ కాని పాఠశాల వాతావరణాన్ని కాదు.

ఈ పాఠశాలల ప్రధాన ఆలోచన హిందీని తరగతి గది భాషగా నిషేధించి వీలైనంత త్వరగా ఇంగ్లీషును ప్రవేశపెట్టడం. మరొక గ్రామంలో, కొంతమంది గ్రామ నాయకులు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రిన్సిపాల్‌తో మాట్లాడి అనధికారిక ఒప్పందం చేసుకున్నారు.దీని ద్వారా వారు దేవాస్ పట్టణానికి చెందిన ఇద్దరు



ఉపాధ్యాయులను ఇంగ్లీషూ గణితాలను బోధించడానికీఆంగ్ల పాఠ్యపుస్తకాలను అనుకరించడానికి నియమించారు. ఈ అదనపు ఉపాధ్యాయులకు సంఘం మద్దతు ఇచ్చింది. ఇది ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను నిలుపుకునే మార్గం కాబట్టి ప్రిన్సిపాల్ అంగీకరించారు. నాలుగు నెలల తరువాత ఈ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు అసంతృప్తి చెందారు. కొత్త ఉపాధ్యాయులు చిత్తశుద్ధి గలవారే కానీ పిల్లలు ఈ ప్రయోగం వల్ల చాలా కలవరపడ్డారు. "వారి సంఖ్యా జ్ఞానం చాలా బలహీనంగా ఉంది. నేను నా పద్ధతులను అనుసరించి వుంటే మేము చాలా బాగా చేసివుండేవారం"అని ఉపాధ్యాయులలో ఒకరు వ్యక్తం చేశారు. అదృష్టవశాత్తూ ఈ ప్రయోగం ఇతర కారణాల వల్ల త్వరలోనేముగిసింది (రెండు గ్రామ పరిస్థితుల డాక్యుమెంటేషన్ ఆధారంగా).

ఉన్నత వర్గాల నుండి వచ్చిన ఈ గ్రామీణ పిల్లలను ఆంగ్లంలో పాఠ్యపుస్తకాలు ఉన్న పాఠశాలలకు పంపిస్తారు, తరగతిలో హిందీ నిషేధించబడింది.3 వ తరగతి నుండే ఇంగ్లీషును ప్రవేశపెట్టాలని కోరిక. ఇంకా ఇంగ్లీషు మాధ్యమ పాఠశాలలు ఎలావ్యాప్తిచెందాలి అనే ఆలోచనతో, వారిలో ఎక్కువ మందిని ఆంగ్లంలో ఏకభాషా దృష్టితో ద్వీపాల్లాగాతయారు చేసేపనిలో పట్టణంలోని పాత ఉన్నత పాఠశాలలు తమకు నిర్దేశించిన నిబంధనలను అనుసరిస్తాయి. ఉపాధ్యాయుల సొంత ఆలోచనలను పక్కన పెట్టబడతాయి. తరగతి గదుల వెలుపల, పనిలో, బజార్‌లో లేదా ఆట స్థలంలో ఉన్నా వాళ్లంతా బహుభాషీయులే. ఇంకా పాఠశాల భాషా బోధన విషయానికి వస్తే భాషా నిపుణుల సలహాలన్నింటినీ విస్మరించి, కృత్రిమ పరిష్కారాల వైపు మొగ్గు చూపుతారు.

**ఆధిపత్య భాష పైన దృష్టి :**

**పాఠశాలల్లో ఉన్న ఏకభాషా విధానం ఒక్క మధ్యప్రదేశ్‌కు మాత్రమే పరిమితమైనది కాదు.** ఇది ఒక విస్తృతమైనది. వీక్షణ. విరుద్ధంగా మహారాష్ట్రలో కూడా ఆంగ్ల భాష పై ఉన్న ఆకాంక్ష, ఒక మధ్యే మార్గాన్ని కనుగొనడమే అయినా, గిరిజన భాషల పట్ల ఈ విధానం భిన్నంగా ఉంది. అదే తర్కం ఉపయోగించి, పిల్లలపై వత్తిడితెచ్చిఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు వస్తాయనే నెపంతో ఆధిపత్య భాషైన మరాఠీ భాషను విధించడం. గిరిజన ప్రాంతాలలో ఉన్న ఆశ్రమ పాఠశాలల్లోనూ జిల్లా పరిషత్‌పాఠశాలల్లోనూ, ప్రాంతీయ భాషలైన కొర్కు, గోండి, మాడియ, భిలీ మొదలైన ఇతర భాషలు ఉండగా, ప్రధాన భాషైన మరాఠీ వాడుక- ప్రాంతాల రీత్యా చూస్తే, ఈ పాఠశాలలో బోధించే ఎక్కువ శాతం మంది ఉపాధ్యాయులు బయటివారే. వాస్తవంగా, ఈ పాఠశాలల్లో గిరిజన భాషలను నిర్మూలించారు. వారిలో ఒకరు ఇలా వ్యక్తపరిచారు: "లేకపోతే వాళ్ళు మరి మరాఠీని ఎలా నేర్చుకుంటారు."! వాదన ఒకటే, ఇంకా దాని ప్రభావమూ ఒకటే. చాలామంది గిరిజన విద్యార్థులు తమ తరగతిగదుల పాఠశాలల్లో సాధన చేసేటప్పుడు, వారి ఇంటి/ప్రాంతీయ భాషా ప్రయోగానికి పూర్తిగా దూరంగా ఉంటారు. ఈ ఆశ్రమశాలల్లో కొద్ది మంది, 1 - 2 తరగతుల ఉపాధ్యాయులు మాత్రమే పిల్లల ఇంటి భాషను మాట్లాడుతారు కాని, సీనియర్ ఉపాధ్యాయులు వాడరు. ఈ గిరిజన ప్రాంతాల బయట నుండి వచ్చే కొంత మంది ఉపాధ్యాయులు, ఈ భాషలను సంభాషణలలో నేర్చుకుని, తరగతిగదుల బయట గానీ, మైదానంలో గానీ లేక హాస్టల్లో గానీ వినియోగిస్తారు. ఇది ఎప్పుడూ కూడా తరగతి సంస్కృతిలో భాగం కాదు. ఇది ఎంతలా అంతర్లీనమైపోయిందంటే, కొంత మంది గిరిజన ఉపాధ్యాయులు కూడా "మరాఠీలోనే మాట్లాడాలి"అనే అభ్యాసనకు కట్టుబడి ఉంటారు. సహజంగా పిల్లలు తరగతిగదుల్లో నిశ్శబ్దంగా ఉంటారు. వాళ్ళు మాట్లాడరు. దీని తరువాత పిల్లలు చచ్చీచెడీ అధిక శ్రమతో - పాఠ్యపుస్తకాలూ గైడ్ల నుండీ ఎక్కువగా ఆలోచనారహితంగా కాపీ చేస్తుంటారు. రాష్ట్రంలోని మూడు వేర్వేరు ప్రాంతాలలో విస్తరించి ఉన్న 371 ఆశ్రమ పాఠశాలల్లో, 66 పాఠశాలల యాదృచ్ఛిక నమూనా కోసం చేసిన అంతర్గత సర్వేలో, 15% మంది పిల్లలు తమ మరాఠీ సైన్సు పాఠ్యపుస్తకాన్ని చదవలేరని మరియు 37% మంది చదవడానికి కష్టపడుతున్నారనీ మరియు కొన్ని భాగాలను మాత్రమే చదవగలరనీ మేము కనుగొన్నాము.ఈ విధంగా మరాఠీ సగం మంది స్థానిక గిరిజనపిల్లలను అర్థవంతమైన అవగాహన నుండి మినహాయిస్తోంది*(పాఠశాలల ప్రాథమిక బేస్ లైన్ నివేదిక ఆధారంగా చేయబడిన ఫీల్డ్ వర్క్).*

**మహారాష్ట్రలోని ఆశ్రమ పాఠశాలలను ఎందుకు సెమీ మరాఠీ చేయకూడదు?**

1 లేక2 తరగతుల కోసం గిరిజన భాషలలో వాచకాలను ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం ప్రయత్నాలు జరిపింది, అయితే ఇది క్షేత్ర అవసరాలకు సరిపోలేదు. భాషా రాజకీయాలు కూడా ఇందులోకి చొచ్చుకొస్తున్నాయి. మరాఠీ నిష్ణాతులైన గిరిజన నేపథ్యం నుండి కొంత మంది ఉపాధ్యాయులను ఎంపిక చేసుకుంటారుకానీ గిరిజన భాషలను ఎంచుకున్న ప్రధాన స్రవంతి ప్రాంతాల నుండి చాలా తక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటారు. **ఎక్కడైతే పాఠ్యపుస్తకాలు మరాఠీలో ఉండి వివరణలూ, సంభాషణలూ ప్రాంతీయ గిరిజన భాషల్లో ఉంటాయో అప్పుడు సెమీ-మరాఠీ విధానం ప్రభావవంతంగా ఉంటుంది. ఉపాధ్యాయులు ద్విభాషులుగా ఉండడానికి ప్రయత్నం చేయాలి. తరగతిగది యొక్క మౌఖిక సంస్కృతి పిల్లల భాషలలో ఉండాలి.** మరాఠీ భాష పరివర్తన చెందడానికి,అనువైన సేంద్రియ పద్ధతిలో ప్రణాళికను తయారుచేయవచ్చు. ఇది ఎలా సాధించాలో చూపించిన ఉపాధ్యాయుల ఉదాహరణలు చాలా అరుదుగా ఉన్నాయి.గిరిజన భాషల పట్ల తరగతిగది సంస్కృతి మారుతుంది. రాష్ట్రంలోని ప్రాంతాలలో కూడా సమృద్ధమైన వైవిధ్యం ఉంది. కొత్త నియామకాలలో కనీసం ఒక్క గిరిజన భాషనైనా తీసుకోవాలనే నిబంధనను నొక్కి చెప్పడం ద్వారా ప్రారంభించవచ్చు. ప్రస్తుతం చిన్న దశలలో బోధిస్తున్న ఉపాధ్యాయుల కోసం, వారందరూ తమ పాఠశాల యొక్క సంబంధిత గిరిజన భాషలో పట్టు సాధించేలా

ప్రణాళిక చేయవచ్చు. ప్రతి పాఠశాలలోనూ స్థానిక వనరులను సృజనాత్మకంగా వినియోగించుకోవచ్చు. **ప్రాంతాలలో ఉన్న వైవిధ్యాన్ని బట్టి ఒక విస్తృత విధానం ఉండాలి. ప్రతి పాఠశాల సెమీ-మరాఠీ విధానాన్ని రూపొందించాలి.** కొంత మంది ఉపాధ్యాయులు ముఖ్యంగా 1 లేక2 తరగతులో బోధించేవారు చూపిన విధంగా దీన్ని చేయవచ్చు.

**జి. ఎన్. దేవి నేతృత్వంలోని ఆదివాసి అకాడమీ నుండి సాధనా సక్సేనా (2018) పేర్కొన్న ఉదాహరణలలో నేర్చుకోగలిగిన అనేక ప్రయోగాలు ఉన్నాయి. వాళ్లు ప్రవేశపెట్టిన గిరిజన భాషలలోని వాచకాలను మరింత విస్తృతంగా అమలు చేయాలి. మరాఠీ క్రమంగా పరివర్తన చెందాల్సిన అవసరం ఉంది. అన్ని స్థాయిలలో తరగతి గదులలో గిరిజన ప్రాంతీయ భాషలలో చర్చను ప్రోత్సహించాలి. పాఠశాల యొక్క మౌఖిక సంస్కృతి, తరగతి గది లోపల వెలుపల, పిల్లల భాషలో ఉండాలి. దీనిని 2006 లో ఎన్‌సీఈఆర్టి ఫోకస్ గ్రూప్ పేపర్ సూచించింది, కాని మనం దీనిని విస్మరించాం.**

**ఎన్‌సిఇఆర్‌టి (2006 ఎ) సూచించినట్లు:** "సాధారణంగా, గిరిజన పాఠశాలల్లోని ఉపాధ్యాయులకు వారి విద్యార్థుల లేదా వారి తల్లిదండ్రుల భాషలు తెలియదు. ఒరిస్సాలోని గిరిజన పాఠశాలల్లో, విద్యార్థులు ఉదయం 10.00 నుండి సాయంత్రం 4:30 గంటల మధ్య పాఠశాలలో తమ ఇంటి భాషను ఉపయోగించవద్దని హెచ్చరిస్తున్నారు. ఈశాన్య ప్రాంతం,ఇంకా ఢిల్లీ పాఠశాలల్లో ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి! అనేక అధ్యయనాలు గిరిజన పాఠశాలల్లోని విద్యార్థులు తమ పాఠ్యపుస్తకంలో 5 వ తరగతిలో పూర్తి వాక్యాన్ని చదవలేరని తేల్చాయి. వారు అక్షరాలను గుర్తించి పదాలను కష్టంతో పలుకుతారు. ఉపాధ్యాయులు నేర్చుకునేవారి భాషలను తెలుసుకోవడం చాలా ముఖ్యం.లేదంటే ఇంటిభాష, పొరుగుభాష, బడిభాషల మధ్య అంతరాలను తగ్గించడానికి ప్రత్యేక పద్ధతులను రూపొందించాల్సి ఉంటుంది. చాలా తరచుగా, తరగతి గది వ్యవహార నిర్వహణ అనేది ఉపాధ్యాయుడి నుండి ఏక మార్గ సంభాషణా విధానంలోవిద్యార్థులు నేర్చుకుంటారనేదానికి ఎటువంటి హామీ లేదు. బహుభాషావాదాన్ని ప్రోత్సహించడానికీ ఈ పత్రంలో మేము చెప్పడానికి ప్రయత్నిస్తున్న ఈ రకమైన జ్ఞాన వృద్ధిని ప్రోత్సహించడానికీ, ఒక ఉపాధ్యాయుడు తన విద్యార్థుల భాష(ల)ను నేర్చుకోవడం తప్పనిసరి." (2006 ఎ: 27).

దీనికి విరుద్ధంగా, మహారాష్ట్రలోని సెమీ-ఇంగ్లీష్ పాఠశాలలతో ఇంటిభాషపట్ల ప్రతిష్ఠ, గౌరవాలతో వారు దానిని సహజపద్ధతిలో ఉపయోగించడానికి అనుమతించింది. భాషా శాస్త్రవేత్తలు సూచించినట్లు ఒక భాషలో పటిమ మరొక భాషను సులభంగా పొందడంలో సహాయపడుతుందని నొక్కిచెప్పడం కాకతాళీయం కాదు. సెమీ-మరాఠీ విధానం గిరిజన ప్రాంతాలకు సమానంగా ప్రభావవంతంగా ఉంటుంది. గిరిజన సంస్కృతులపట్ల మన అనుచిత ప్రవర్తన తగ్గటం వలన కూడా గిరిజనులలో తిరుగుబాటు ధోరణి నెమ్మదిగా మారుతుంది (దేవీ, 2017).

పాఠశాలల్లో ఇంగ్లీషుకు మారేందుకు నమ్మకమైన మార్గాలు కొరవడినందున, బహుభాషా విధానం విస్మరించబడుతోంది.

గ్రామ స్థాయిలో ప్రభుత్వ మధ్య ఇంకా ఉన్నత పాఠశాల ఇప్పుడు తనను తాను సెమీ-ఇంగ్లీషుగా మార్చుకొంటోంది. ప్రాథమిక పాఠశాల మరాఠీ మాధ్యమంగా ఉంది. హైస్కూల్ వరకు అన్ని తరగతులలోనూ తరగతి గది సంస్కృతి సెమీ-ఇంగ్లీష్ మాధ్యమం లేదా ద్విభాషా మాధ్యమంగా 1980 లలో మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించబడింది. 2005 లో మాధ్యమం ప్రజాదరణ కారణంగా, మహారాష్ట్ర ప్రభుత్వం ఎంచుకున్న ప్రభుత్వ పాఠశాలలకు 5 వ తరగతి నుండి సెమీ-ఇంగ్లీష్ ప్రారంభించింది. ప్రభుత్వం, తరువాత, ప్రైవేట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలకు పిల్లలు నిష్క్రమించే విధంగా 2010 తరువాత విస్తరించబడింది. మహారాష్ట్రలో ఈ విధానంపై చర్చ జరుగుతోంది, కానీ ఈ విధానంపై ప్రజల విశ్వాసం కూడా ఉంది. అయితే ఇక్కడ కూడా ఈ పాఠశాలల్లో కొన్ని మొదటి తరగతి నుండి ఇంగ్లీష్ మాధ్యమం కావాలని కోరుకుంటాయి. ఆం.ప్ర. లాంటి అనేక రాష్ట్ర ప్రభుత్వాలు 'పూర్తి ఇంగ్లీష్' మీడియం ప్రభుత్వ పాఠశాలల కోసం కూడా ప్రయత్నిస్తున్నాయి. ఇది ఒక ఉదాహరణ మాత్రమే.

నాటకీయంగా వ్యతిరేక ఆలోచనలు ఈ అలవాటును ఎలా ప్రభావితం చేస్తాయి? వారు ఇంగ్లీష్ కోసం ఆశించే అభిలాష వైపు వేర్వేరు మార్గాలను సూచిస్తున్నారు. ఈ ఆలోచనలు పాత చర్చ నుండి తీసుకోబడ్డాయి. ఏకభాషా దృష్టి ఉత్తమమైనది అనే స్థితికి ఈ ఆలోచనను పాఠశాలలు చేరుకుంటున్నాయి. ఈ దృష్టిలో ఇతర భాషలు ఆటంకం కలిగిస్తాయి వాటిని 'నిషేధించాలి' లేదా అప్రధానమైన అంశంగా ఉంచాలి. వారు ఇంగ్లీష్ కోసం కృత్రిమ ద్వీపాలను సృష్టించడానికి ప్రయత్నిస్తారు. ఆధిపత్య భాషపైనే వారికీలక దృష్టి. ఎన్సీఈఆర్టీ (2006a) ప్రధాన విధాన పత్రం చెప్పినట్లుగా, "చాలా కాలం నుండి, ద్విభాషావాదం విద్యావిషయకసాధనకూ ఎరుకువ పెరుగుదలకూ ప్రతికూల సంబంధాన్ని కలిగి ఉందని నమ్మేవారు..." (2006 ఎ: 21). మరోఅభిప్రాయం ప్రకారం, పిల్లల ప్రాంతీయ భాష ఆధారంగా బహుభాషా విధానాన్ని సూచిస్తుంది. అన్ని భాషలకూ సుసంపన్నమైన వాతావరణాన్ని సృష్టించండి. స్థానిక సందర్భం ఆధారంగా ఆంగ్ల పరివర్తనను ఉద్దేశపూర్వకమైన ప్రణాళికలో ప్రాంతీయ భాషను ఉపయోగించండి. అనేక నివేదికలు సూచించినట్లుగా ప్రారంభ సంవత్సరాల్లో మాతృభాష ఆధారిత ద్విభాషా లేదా పరస్పరాధారిత భాషా విద్యను ప్రోత్సహించడానికి ప్రత్యేక కారణం ఉంది. ఉదాహరణకు ఐరాస తయారించిన ఇటీవలి సమీక్ష చూడండి (జెస్సికా బాల్ (2011). నూతన స్థాయీ నైపుణ్యాలు "ఒక భాష నుండి మరొక భాషకు తేలికగా బదిలీ చేయబడతాయి. చాలావరకూ కావాలని మార్పు కోసం అభ్యాసకుడు అదనపు ప్రయత్నం చేయనవసరం లేదు" అనే తర్కం మీద ఆధారపడి

**తరువాయి 18వ పుటలో.......**

**అమ్మనుడితోనే అందలం**

జె.డి.ప్రభాకర్
8500227185

## 'దేశ సంపదకు ప్రాంతీయ భాషలే మూలం'

# తెలుగు భాషవాడుక: సామాజిక భాషాశాస్త్ర అధ్యయనం

**సా**మాజిక జీవనంలో నుండి జనించిందే భాష.ఆది నుండి నేటి శాస్త్ర సాంకేతికతతో అభివృద్ధి చెందుతూ ఆధునిక కాలం వరకు మనిషి సృజనాత్మతకు ముఖ్య ఉపకరణంగా భాష ఉంది. నాటి రాతి యుగం మనిషి నేటి రాకెట్టు ప్రయోగాల వరకు చేరుకున్నాడంటే తాను ప్రకృతిలోని విషయాలను, దాని జ్ఞానాన్ని సంగ్రహించి, అవసరాలకు అనుగుణంగా వస్తు ఉత్పత్తి చేస్తుండటమే కారణం. ఈ క్రమంలో, తాను సంగ్రహించిన జ్ఞానాన్ని ఇతరులకు అందించడంలో భాష ముఖ్య భూమిక పోషిస్తోంది. ఈ అభివృద్ధి క్రమంలో సమాచార మార్పిడిలో భాష ఎంతగానో ఉపకరించింది అన్నది సుస్పష్టం. అంతేకాకుండా, వ్యక్తి శ్రమనూ సమయాన్నీ తగ్గించడంలో మాతృభాష తోడ్పాటునందిస్తుంది. జ్ఞానవాహినిగా, జ్ఞాన సృష్టికి మూలంగా పరిగణింపబడుతున్న భాష, ప్రతీ యుగంలోనూ మానవుడిని ప్రగతిదారిలో నడిపిస్తోంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మాతృభాషని ఒక ప్రత్యేక దృక్కోణంలో ఆర్థికసామర్థ్యాన్ని కలిగించే పనిముట్టుగానూ ఒక సామాజిక శక్తిగానూ పరిగణించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది (ఉమామహేశ్వరరావు,2016).

మార్షాక్ (1965) భాషకు ఆర్థిక వ్యవహారాల సంబంధాన్ని గుర్తిస్తూ, ఒక భాష మరొక భాష కంటే ఎందుకు ఎక్కువగా పరిగణించబడుతుంది? భాషా వ్యవహారం ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి? గతంలోలేక ప్రస్తుతం భాషల స్థితిగతులకు గల కారణాలు ఏమిటి? అనే ప్రశ్నలు లేవనెత్తుతూ భాషకు ఉన్న శక్తియుక్తులను ఆర్థిక కోణాన్నుంచి పరిశీలించాడు. సమాజ అభివృద్ధికి కీలకమైన నిర్ణాయక కారకాలలో భాష ముఖ్య భూమిక పోషిస్తుంది(ప్రభాకర్, 2016). ఉత్పత్తి కారకంగా ఉన్న భాష, శ్రామికుల మాతృభాష అయితే అది అధిక ఉత్పత్తికి దారితీస్తుంది. ఈ పరిశోధనా పత్రం, ఉత్పత్తిలో భాష పాత్రను వివరిస్తూ, భాషకున్న విలువను తెలియజేస్తుంది. మాతృభాష ఆర్థిక కార్యకలాపాల్లో కీలక పాత్ర పోషిస్తుందని చూపించడానికి పనిస్థలాల్లో నుండి సమాచారాన్ని సేకరించడమైనది.

**శ్రమ-భాషా పెట్టుబడి:**

భాషను ఆర్థికవేత్తలు ఒక మానవ మూలధనంగా పరిగణిస్తారు (రేనాల్డ్ మరియు మారియన్, 1972).ఈ సందర్భంలోనే, "భాషలు సమాజంలోని ఆర్థిక లావాదేవీలను ప్రభావితం చేయటమేగాక, సమాజపు ఆర్థిక వ్యవస్థకు భాషే పునాది'' అవుతుందని ఉమామహేశ్వరరావు(2017)ఆర్థిక గణాంకాల ద్వారా నిరూపించారు. ఉత్పత్తికై పెట్టిన పెట్టుబడుల్లో భాష వాడుక కూడా పెట్టుబడిలో భాగమే. డబ్బు, యంత్రాలూ, వివిధ పనిముట్లూ వాటి శక్తిసామర్థ్యాలూ పెట్టుబడిగా పెట్టిన తీరూ వీటికైన ప్రణాళికా భాషతోనే చేకూరుతాయి. ఏ భాష అయితే ఉత్పత్తికి తక్కువ సమయాన్ని తీసుకుంటుందో, పనికి కావలసిన మెరుగైన అవగాహన కల్పిస్తుందో ఆ భాషనే వాడటం సాధారణ సాంప్రదాయమే కాదు అవసరం కూడా. ఆ భాషనే ఒక సమాజపు శ్రమశక్తుల (కార్మికుల) భాషగా గుర్తించి భాషా ప్రణాళికను రూపొందించాలి. ఆ భాషనే పాఠశాల స్థాయినుండి శిక్షణా కేంద్రాల వరకు విద్యా మాధ్యమంగా వాడుతుండాలి.

మార్షాక్, (1965) ఒక భాష-విలువ, ప్రయోజనం, ఖర్చులూ ఇంకా లాభాలను కలిగి ఉంటుందని గుర్తించాడు.మానవ మూలధన సిద్ధాంతం (Human Capital Theory) కార్మిక ఉత్పాదక శక్తిని సూచిస్తుంది, ఇది ఇతర భౌతిక పెట్టుబడుల నుండి వేరుగా ఉంటుంది. ఇది ఆదాయంలో వ్యత్యాసాలను వివరించడానికి అతి ముఖ్యమైన పరికరంగా పనిచేస్తుంది. (బెకర్, 1975: రైడర్ - పోన్స్-రైడ్లర్, 1986:రాబిన్సన్, 1988). శ్రామికులు పనిస్థలాల్లో పని చేసినప్పుడు, వారు విషయావగాహన కొరకూ, పనిస్థానాలలో తోటివారితో సంభాషించడానికీ భాషని ఉపయోగిస్తారు. వ్యక్తి ఖర్చుచేసే సమయం, వాడుతున్న భాష, ఉపయోగించే శక్తి కలిగివున్న నైపుణ్యాలను వినియోగించటం మానవ మూలధనంగా పరిగణింపబడుతుంది (ప్రభాకర్ 2016). రేనాల్డ్ ఇంకా మారియన్ (1972) ఆర్థికవేత్తలు భాషని మానవ మూలధనంగా గుర్తించారు. ఈ పద్ధతిలో భాషాజ్ఞానం కూడా విద్య వలన వచ్చే ఫలితాలను రాబడుతుంది. తర్వాత ఇదే ఆలోచనా ధోరణి బ్రెటన్ మరియు మిస్సోకోవ్స్కి (1975)చే కొనసాగించబడి, భాషా సమూహాల మధ్య నైపుణ్యాల తేడాను, వాటిపై ఉన్న సామాజిక ఆర్థిక ప్రభావాలను చూపిస్తూ మాతృభాష విశిష్టతను చూపించడం జరిగింది. వివిధ ఆర్థిక సంబంధాలలో భాష కావాల్సిన ఇతర నైపుణ్యాలను పెంచుతుంది. అందువలన, భాష మానవ మూలధనంలో భాగమవుతుంది. కొంతమంది పరిశోధకులు (బ్రెటన్, 1978:వాలియన్కోర్ట్, 1980: గ్రెనియర్, 1982)ఒక భాష నేర్చుకోవడం అనేది మానవ మూలధనం యొక్క పెట్టుబడిలో భాగంగా పరిగణించారు. భాషలకు వాణిజ్యపరమైన సామర్థ్యం

వుంటుంది. అంటే సమాజంలో స్థానిక, వాణిజ్య శక్తులు బలపడడానికి స్థానిక భాషల ఆర్థిక స్థాయి పెరగాలి. స్థానిక భాషల ఆర్థిక స్థాయిలో పెరుగుదల ఆ సమాజపు ఆర్థిక శక్తికి నిదర్శనం(ఉమామహేశ్వరరావు, 2017).


**ఉత్పత్తిలో మాతృభాష పాత్ర:**

భాష, సమాజంలోని సంస్కృతిసాంప్రదాయాల సమ్మేళనం. జ్ఞానానికి మూలం సంస్కృతి అయితే, దానిని అందించే మాధ్యమం భాష. మనిషి చేస్తున్న ప్రతీ పనికీ వెనక ఆ పనికి సంబంధించిన సమాచారం ఉంటుంది. ఈ సమాచారం ఒక తరం నుండి మరొక తరానికి అందివ్వబడుతూ సమాజ ఆర్థికోన్నతికి సహకరిస్తుంది. కొన్నిసమయాల్లో జ్ఞాన సృష్టికి దారితీసి సమాజాన్ని ప్రగతి పథంలోకి నడిపిస్తుంది. జ్ఞాన సృష్టికీ, దాన్ని తదుపరి తరాలకు అందివ్వడానికి భాషే ఆధారం. ఈ ప్రక్రియను మాతృభాష సమర్థవంతంగా జరిపిస్తుంది. పనికి సంబంధించిన అవగాహనా పరిధిని మాతృభాష పెంచుతుంది.

వ్యక్తి సంపద సమృద్ధిగా ఉంటేనే దేశసంపద సమృద్ధిగా వుంటుంది. వ్యక్తి పనిచేయడానికి కావలసిన శక్తి సామర్థ్యాలు, భాష, నైపుణ్యం అన్నీమానవ మూలధనంగా పరిగణించబడతాయి. ఒక దేశ అభివృద్ధి ఆ దేశ వ్యవసాయ, ఉత్పత్తి, సేవా రంగాలపై ఆధారపడి ఉంటుంది. వస్తూత్పత్తి విధానం ద్వారా మానవ జీవనం సరళీకృతం అయింది. ఉత్పత్తి జరగడానికి ముందు ఆలోచన, అది కార్యరూపం దాల్చడానికి కావలసిన ప్రణాళిక అన్నీ భాష ద్వారా సమకూరుతాయి. ఏ భాష అయితే ఈ క్రమానికి అడ్డంకిగా ఉండదో, ఆ భాష వాడుక వల్ల అధిక ఉత్పత్తిని రాబట్టవచ్చు. మాతృభాషే మనిషికి స్వాస్థ్యం. ప్రతి మనిషికీ ధనిక, పేద, జాతి, మత, కుల, లింగ వర్గాల భేదం లేకుండా సమాన వనరుగా ఉంటున్నది మాతృభాష మాత్రమే. ప్రతి ఒక్కరి సృజనాత్మకతకూ, దాని సాధనలో ఉండే కష్ట నష్టాలలో మార్గాన్ని మాతృభాష సుగమం చేస్తుంది.

ప్రపంచ దేశాల స్థూల జాతీయోత్పత్తి సమాచారాన్ని 2003 నుండి 2010 వరకు ప్రపంచ బ్యాంకు భాషల ఆధారంగా విడుదల చేసింది. అంతర్జాలంలో భాషల వాడకాన్ని బట్టి సేకరించిన గణాంకాల ప్రకారం, స్థానిక భాషలు ఇంగ్లీష్ కంటే ప్రపంచ స్థూల జాతీయోత్పత్తికి ఎక్కువ మొత్తంలో దోహదం చేస్తున్నాయని తెలుస్తోంది.

భారతదేశ స్థూల జాతీయోత్పత్తి సమాచారాన్ని ప్రపంచ బ్యాంకు విడుదల చేసింది. ఈ సమాచారం భారతదేశపు జనాభా గణనకు లేదా ఎథ్నోలాగ్ వంటి ఇతర వనరులకు అనుబంధంగా ఉంది. ఈ సమాచారం ప్రకారం భారతదేశపు స్థూల జాతీయోత్పత్తి భాషల ఆధారంగా క్రింది విధంగా విభజించబడింది: హిందీ 40.22%, బెంగాలీ 8.30%, తెలుగు 7.87%, మరాఠీ 7.45%, తమిళ భాష 6.32% ఉర్దూ 5.18%, గుజరాతీ 4.85%, కన్నడ 3.90%. ఇది కేవలం ప్రాంతాలవారిగా జనాభా మీద ఆధారం చేసుకొన్నదికానీ, శ్రామికుల పని స్థలాల్లో భాషావ్యవహారాన్ని శాస్త్రీయ పద్ధతిలో అధ్యయనం చేసిన సమాచారం కాదు. పైన చెప్పిన విషయాలను శ్రామిక - ఉత్పత్తి సంబంధాలలో ఎలా



| క్ర. సం | పని స్థలాలు | మొత్తం శ్రామికులు | గణాంకాలు శాతాలలో ఇవ్వబడ్డాయి | | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| | | | లింగభేదం | | | విద్యార్హతలు | | | | | శ్రామిక విభాగాలు | | | | | | |
| | | | పురుషులు | స్త్రీ | నిరక్షరాస్యులు | ప్రాథమిక విద్య | ద్వితీయవిద్య | ఇంటర్మీడియట్ | ఐ.టి.ఐ | గ్రాడ్యుయేట్లు | ఎగువ తరగతి | మధ్య తరగతి | దిగువ తరగతి | తెలుగు | ఇంగ్లీషు | హిందీ | ఇతర భాషలు |
| 1. | కట్టడాలు | 600 | 95 | 5 | 4 | 1 | 11 | 8 | 53 | 23 | 15 | 60 | 25 | 72 | 10 | 6 | 6 |
| 2 | ట్రాన్స్ ఫార్మర్ తయారీ | 445 | 96 | 4 | 3 | 17 | 15 | 0 | 55 | 10 | 11 | 64 | 25 | 76 | 9 | 11 | 1 |
| 3 | మందుల తయారీ | 200 | 83 | 17 | 1 | 8 | 17 | 13 | 0 | 70 | 27 | 48 | 25 | 54 | 36 | 14 | 5 |
| 4 | బీడీ తయారీ | 200 | 36 | 74 | 54 | 34 | 11 | 1 | 0 | 0 | 3 | 8 | 89 | 97 | 0 | 0 | 3 |
| 5 | వ్యవ సాయం | 355 | 61 | 39 | 67 | 23 | 8 | 2 | 0 | 0 | 8 | 9 | 83 | 100 | 0 | 0 | 0 |
| 6 | మొత్తం | 1800 | 74.2 | 27.8 | 25.8 | 16.6 | 12.4 | 4.8 | 21.6 | 20.6 | 12.8 | 37.8 | 49.4 | 79.8 | 11 | 6.2 | 3 |

వాడుతున్నారో పరిశోధించి చూపించే దిశగా ఈ కింది విధంగా విశ్లేషించాం.

**సమాచారం-క్రమ-విశ్లేషణ:**

భాషకీ ఆదాయానికీ మధ్య సంబంధాన్ని నెలకొల్పేందుకు ఆధారభూతమైన సమాచారం సేకరించడం జరిగింది. ఈ సమాచార సేకరణ కొరకు హైదరాబాదు పరిసర ప్రాంతాలైన మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని ఐదు పనిస్థలాలను సందర్శించడమైనది. ఎక్కడైతే మనుష్యులు తమ భాషను పనిస్థలాల్లో ఉపయోగిస్తూ పనిచేస్తారో అక్కడ భాష, సంపదను ప్రభావితం చేసే చోటు అవుతుంది. ఒక వ్యక్తి తన పనిలో తోటి పనివారితో మాట్లాడేటప్పుడు ఉపయోగించే భాష, పనికి కావలసిన అవగాహనను కల్పిస్తుంది, సాంకేతిక ఉపయోగంలో వాడే భాష ప్రత్యక్షంగానూ పరోక్షంగాను ఆర్థిక లాభనష్టాలకు కారణమవుతుంది. కాబట్టి, సమాచార సేకరణకి పనిస్థలాలు సరైనవిగా భావించి వాటిని ఎన్నుకోవడం జరిగింది.

సమాచార సేకరణకై ఇచ్చిన ప్రశ్నావళిలో మొత్తం 20 ప్రశ్నలు పొందుపరచడం జరిగింది. ఇందులో మొదటి ఆరు ప్రశ్నలు వ్యక్తిగత వివరాలను సేకరించడానికై ఏర్పాటు చేయబడినవి, మిగతా ప్రశ్నలు భాష వాడుకను గూర్చిరూపొందించబడినవి. ప్రశ్నావళి ద్విభాషి: తెలుగూ, ఇంగ్లీషూ రెండు భాషల్లో తయారు చేయబడింది. స్థానికంగా పనిచేసే వారి మాతృభాష తెలుగు కాబట్టి సమాచార సేకరణకు అనువైనది. ఇంగ్లీషు, ఇతర ప్రాంతాల నుండి పనికోసం వలస వచ్చిన వారికోసం ఉపయోగించడమైనది.

ఎంపిక చేసుకున్న ఐదు పనిస్థలాల్లో 1800 ఉద్యోగస్థుల నుండి సమాచార సేకరణ జరిగింది. పని స్థలాల్లో తమ తమ పనుల ఆధారంగా వారందరినీ మూడు విభాగాలుగా వర్గీకరించడమైనది. ఈ పనిస్థలాలో అధికారులైన ముఖ్య కార్యనిర్వాహణాధికారి, కార్య నిర్వాహకుడు, మానవ వనరుల అధికారిమొదలైనవారిని ఎగువ తరగతివారుగానూ, ఇంజినీర్లు, పర్యవేక్షకులు, నిర్వాహకుడు మొదలైనవారినిమధ్య తరగతివారుగానూ, ఫిట్టర్లు, సర్వీసింగ్, వెల్డర్లు, సహాయకులు, బీడి కూలీలు, వ్యవసాయ కూలీలు మొదలగువారిని దిగువ తరగతివారుగానూ వర్గీకరించడమైనది.

ఎగువ తరగతివారి సంఖ్య మిగిలిన రెండు వర్గాలతో పోల్చితే చాల తక్కువ. పనిస్థలాల్లో మొత్తం పనివారి సంఖ్యలో వీరు 12.8 శాతం మట్టుకే ఉంటారు. వీరు ఇంగ్లీషు మాధ్యమంలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసినవారు. పనిస్థలాల్లో వీరి చొరవ చాలా తక్కువ. వీరు క్రింది వర్గాలవారిపై అజమాయిషీ చేస్తూ ఉంటారు. క్రింది వర్గాలతో పోల్చితే వీరి భాషా వాడుక తక్కువగా ఉంటుంది. వారి సంభాషణలు ఎక్కువగా మధ్య తరగతి వారితోనే, చాలా వరకు ఇంగ్లీషు భాషలో ఉంటాయి.

1. మధ్య తరగతి వారు 37.8 శాతం ఉంటారు.వీరందరూ గ్రాడ్యుయేట్స్: వృత్తి పరమైన కోర్సులు చేసినవారు. పనికి సంబంధించిన ప్రణాళికను తయారు చేయడం, ఆ ప్రకారంగా

పనిస్థలాల్లో పనిచేయించడం వీరి విధి. వీరు దిగువ వర్గం వారితో తెలుగు భాషలోనే సంభాషిస్తారు.

2. దిగువ తరగతి వారు పై రెండు వర్గాల వారికంటే సంఖ్యాపరంగా చాలా ఎక్కువ. పనిస్థలాల్లో వీరు 49.4 శాతం ఉంటారు. ఇందులో వృత్తిపరమైన కోర్సులు, డిప్లొమా, ఇంటర్మీడియేట్, పదవ తరగతి మరియు చాల మంది నిరక్షరాస్యులు ఉన్నారు. వీరందరూ తెలుగు మాధ్యమంలో చదివినవారు. మాతృభాష అయిన తెలుగులో వ్యవహరిస్తారు.ఉత్పత్తి అధిక భాగం దిగువ తరగతి వారి నుండే వస్తుంది. మాతృభాషనే వీరు విరివిగా వాడతారు. పని సంబంధిత సూచనలూ,హెచ్చరికలూ ఉత్పత్తిలో భాగమైనవారందరికి తెలుగులోఉండడవే సహజం. మధ్యతరగతివారు దిగువ తరగతివారితో జరిపే సంభాషణలూ, సూచనలూ, దిగువ తరగతివారు ఒకరితో ఒకరు వ్యవహరించడం, పరిశ్రమలు పొందుపరచిన పని సంబంధిత సమాచార పుస్తకాలు తెలుగులోనే ఉంటాయి. ఇంగ్లీషు వ్యవహారం ఉన్నతవర్గం వారికి మాత్రమే పరిమితమై కేవలం 12 శాతానికే పనిస్థలాల్లో వ్యవహరించబడుతుంది. ఎంపిక గావింపబడ్డ పనిస్థలాలు తెలంగాణ రాష్ట్రానికి చెందినవి, హైదరాబాదు పరిసర ప్రాంతాలు కాబట్టి హిందీ, ఉర్దూ ప్రభావితమైనవి కాబట్టి కొంతవరకూ హిందీ, ఉర్దూ వ్యవహారంలో వాడబడుతుంది. వీటితో పాటు తమిళం, ఒడియా భాషలు కూడా పని కోసం వలస వచ్చిన కొందరిచే వ్యవహరించ బడుతున్నాయి.

3. ఎంపిక చేయబడ్డ అన్ని పనిస్థలాల్లో శ్రామికులందరూ భారతీయభాషలని 89% శాతం, మరి ముఖ్యంగా వారి మాతృభాష తెలుగుని 80% శాతమంది వ్యవహరిస్తున్నారు. దీన్నిబట్టి తెలుగు రాష్ట్రాల్లో ఆర్థిక కార్యకలాపాలు మాతృభాషలోనే జరుగుతున్నాయని తెలుస్తోంది. సంపద సృష్టికి మాతృభాష మూలంగా కనిపిస్తోంది. ఇలా సృష్టింపబడిన సంపద అంతా దేశ సంపదలో పాలిభాగం అవుతుంది. స్థూల జాతీయోత్పత్తి(GDP)లో ప్రాంతీయ భాషలు సింహభాగం అందిస్తూ, దేశాభ్యున్నతికి దోహదం చేస్తున్నాయి. **రాష్ట్రాల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం. సంపద సృష్టిలో ప్రాంతీయ భాషల వాడకం ద్వారా ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందని ఈ పరిశోధన వలన స్పష్టమవుతోంది. ప్రాంతీయ భాషల స్థితి ఎంత ఆరోగ్యంగా ఉంటే దేశ సంపద అంత ఆరోగ్యంగా ఉంటుంది. దేశ సంపదకు ప్రాంతీయ భాషలే మూలం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాంతీయ భాషలను వచ్చే తరాలవారికి సమర్థవంతంగా అందివ్వడానికి కంకణం కట్టుకోవాలి. ప్రాంతీయ భాషలు కాకుండా ఇంగ్లీషు నేర్చుకుంటేనే ఉద్యోగాలొస్తాయని జనం అపోహలో తమ పిల్లల్ని ఇంగ్లీషు మాధ్యమంలో చదివిస్తున్నారు. కానీ ఈ పరిశోధన వల్ల ఇంగ్లీషు కేవలం 11% శాతానికే పనిస్థలాల్లో పరిమితమైనదని, దాన్ని మాట్లాడేవారి సంఖ్య చాలా తక్కువనీ సేకరించబడిన సమాచారాన్ని బట్టి తెలుస్తోంది. ఇంగ్లీషు నిర్ణాయకంగా వాగ్దానం చేసే ఉద్యోగాలు కొన్ని మాత్రమేనని గుర్తించడమైనది. ఇంగ్లీషే అన్ని సమస్యలనూ నయంచేసే సంజీవని అని నమ్మే ప్రజలకి అది అపోహ అని ఈ పరిశోధన ద్వారా నిరూపించడమైంది**

ఈ వ్యాస రచయిత పరిశోధక విద్యార్థి,
హైదరాబాదు విశ్వవిద్యాలయం

---

**14 వ పుట తరువాయి.......**

## మహారాష్ట్రలోని ప్రభుత్వ ఎయిడెడ్ సెమీ-ఇంగ్లీష్ పాఠశాలల నుండి మనం ఏమి నేర్చుకోవచ్చు?

ఉంటుంది (NCERT 2006a: 21). ఈ బదిలీ పిల్లల మొదటి భాషలో ఉన్నత స్థాయి నైపుణ్యం అభివృద్ధిపై ఆధారపడి ఉంటుంది. అడ్డదార్లు అవసరంలేదు. పరివర్తనాలను క్రమంగా సాధారణంగా పాఠశాలలో నాలుగైదు సంవత్సరాల తరువాత ప్రణాళిక చేసుకోవాలి. **బహుభాషా విద్యకు మద్దతు ఇవ్వడం సమాజానికి మంచిది. ఎందుకంటే ఇది అన్ని భాషలూసంస్కృతుల పట్ల గౌరవాన్ని పెంచుతుంది. మహారాష్ట్రలోని సెమీ-ఇంగ్లీష్ పాఠశాలల అనుభవం ద్వారా నిరూపించబడినట్లుగా, ఈ విధానం వ్యక్తిగతంగా విద్యార్థులను ఇంగ్లీష్ కోసం వారి ఆశయ లక్ష్యాలలో ఏ విధంగానూ వైకల్యాన్ని కలిగించదని మనం ప్రజల నమ్మకాన్ని పెంచాలి. ప్రాథమిక విద్య మాతృభాషా మాధ్యమంలో ఉండాలని చాలా మంది నిపుణుల అనుభవం ద్వారా కూడా తెలుస్తోంది. ఏకభాషాదృష్టి బలంగా ఉంది. అది 'పూర్తి ఇంగ్లీష్ మాధ్యమానికి' పాఠశాలలనునెట్టివేస్తుంది. దీనికి ఉన్నత వర్గాల మద్దతు ఉంది. వీళ్లు దీన్ని రెండోరకం ఎంపికగా చూస్తారు. ఈ విరుద్ధమైన అభిప్రాయాలలో రాష్ట్ర ప్రభుత్వాలు ప్రభుత్వ పాఠశాలల కోసం ఆచరణీయ కార్యాచరణ ప్రణాళిక వైపు వెళ్ళాలి. వారు ఇంగ్లీషు వైపు పరివర్తనలను విశ్వసనీయ పద్ధతిలో నిర్వహించగలగాలి. అప్పుడే ఆకాంక్ష, కోరికలను తీర్చగల ప్రజల నమ్మకాన్ని సృష్టించవచ్చు. సామూహిక విద్యలో ఈ విశ్వసనీయ మార్గాలు లేకపోవడం ప్రజల నమ్మకాన్ని దెబ్బతీస్తుంది. మహారాష్ట్రలోని సెమీ-ఇంగ్లీష్ పాఠశాలల అనుభవం మధ్యేమార్గంగా ఒక ఉదాహరణను అందిస్తోంది. మనం ద్వేషభావాన్ని వీడి పాఠశాలల కోసం తెలివైన విధానానికీ విశ్వసనీయమైన ఆచరణకూ మధ్య అంతరాన్ని దాటేందుకు వంతెన అవసరం..**

**'సొంత భాషలో చదువు మొదలు పెట్టటం అత్యంత సులువు. చదువును పిల్లలు హాయిగా, కష్టం లేకుండా, సంతోషంగా నేర్చుకుంటారు. బడి వాతావరణం పిల్లలకు ఆనందంగా, ఆహ్లాదంగా ఉంటుంది'.**

డా॥ మండలి బుద్ధప్రసాద్
9848780872

నాట్యతపస్వి

# శోభానాయుడు

కనువెలుగు 1956

కనుమరుగు 14-10-2020



**1975లో** మద్రాసులో కళాసాగర్ సంస్థ కూచిపూడి ఆర్ట్స్ అకాడెమీ వారి చండాలిక నాట్య ప్రదర్శన ఏర్పాటు చేశారు. కూచిపూడి నాట్యకళ ఘన చరిత్రను ఒక మలుపు తిప్పిన ప్రదర్శన అది!.

విశ్వకవి రవీంద్రనాథ టాగూరు, బౌద్ధుల కాలం నాటి ఒక ఇతివృత్తాన్ని తీసుకుని అస్పృశ్యత సమస్యపై వ్రాసిన నృత్యనాటికను ఎస్.వి.భుజంగరాయశర్మ గారు గొప్పగా తెలుగు చేశారు. పౌరాణిక అంశాలకు పరిమితమైన కూచిపూడి నృత్యరంగం మొదటిసారిగా ఒక సామాజిక సమస్యపై ఈ నృత్యరూపకాన్ని రూపొందించి ప్రదర్శించింది. ఆఘనత నాట్య గురువు వెంపటి చినసత్యంగారిది కాగా, చండాలిక పాత్రలో యువనర్తకీమణి శోభానాయుడు అభినయంలో తన విశ్వరూపాన్ని ప్రదర్శించి కూచిపూడి నాట్య విధానానికే కొత్త శోభను సమకూర్చారు.

ఆరోజు ఆమె నాట్యవిన్యాసాన్ని చూసిన నాలుగువేలమంది అదృష్టవంతుల్లో నేనూ ఒకణ్ణి. మా నాన్న మండలి వెంకట కృష్ణారావుగారు ఆనాటి విద్యామంత్రిగా ఆ ప్రదర్శనకు ముఖ్య అతిథి కావటంతో వారితో కలిసివెళ్లి నేను మద్రాసులో ఆ ప్రదర్శన చూడగలిగాను.

ఆ తరువాత 1976లో హైదరాబాద్ రవీంద్రభారతిలో కూడా "చండాలిక" ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఆనాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావుగారితో సహా అనేకమంది ప్రముఖులు విచ్చేసిన ఆ సమయంలో రవీంద్రభారతి కిక్కిరిసిపోయింది. ఆనాటి ప్రదర్శన ఈ నాటికీ నాకళ్లముందు కదలాడుతూనే ఉంది.

అంతకు పూర్వమే శ్రీకృష్ణపారిజాతం లాంటి నృత్యనాటికలలో సత్యభామ పాత్రలో శోభానాయుడు గారు పేరొందినప్పటికీ నా దృష్టిలో చండాలిక ఒక అపూర్వమైన పాత్ర!

వెంపటి చినసత్యం గారికి పద్మభూషణ్ పురస్కారం వచ్చిన సందర్భంలో అవనిగడ్డ గాంధీక్షేత్రంలో వారికి మా నాన్నగారు ఘన సన్మానం చేశారు. ఆ రోజు "పద్మావతీ శ్రీనివాసం" ప్రదర్శించటానికి శోభానాయుడుగారు అవనిగడ్డ వచ్చారు. తన ప్రదర్శనతో వేలాది మంది దివిసీమ ప్రజలను మంత్రముగ్ధులను చేశారామె!

అప్పటి నుండీ ఆమెతో పరిచయం ఉన్నప్పటికీ నేను మంత్రి అయిన తరువాత శోభానాయుడిగారితో కలిసి అనేక కార్యక్రమాలలో పాల్గొనే అవకాశం కలిగింది. ఆమె కొత్త నాట్య ప్రదర్శన జరిగినప్పుడు అతిథిగా నన్ను ఆహ్వానించి గౌరవించేవారు.

కిన్నెర రఘురామ్ ఎక్కువగా ఆమె కార్యక్రమాలు ఏర్పాటు చేసేవారు. 'అతిథులుగా ఎవరిని పిలవమంటారని ఆమెను అడిగితే ఆమె మీ పేరుని, కళాతపస్వి కె.విశ్వనాథ్ గారిని పిలవమని చెప్పేవార'ని రఘురాం నాతో చాలాసార్లు అన్నారు.

ఆమె మోకాళ్లకు ఆపరేషను చేయించుకున్న తరువాత యిచ్చిన మొదటి ప్రదర్శన నన్నెంతో ఆశ్చర్యపరచింది. ఆమె పట్టుదలకు, కృషికి నిదర్శనమే ఆ ప్రదర్శన. 60 యేళ్ల వయసులో మోకాళ్లకు ఆపరేషను చేయించుకున్నా, ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేయగలగటం వరపుత్రులకే సాధ్యం అనుకుంటాను. 'కూచిపూడి నృత్యం తన ఊపిరి, తన ప్రపంచం' అని సగర్వంగా ప్రకటించారామె!.

హైదరాబాదులో కూచిపూడి అకాడెమీని ప్రారంభించినప్పుడు ఆమె 'మద్రాసులో నేను భక్తురాలిగా ఉన్నాను. హైదరాబాదులో నేను పూజారిణిని' అన్నారట. నాట్యకళను ఒక భగవత్స్వరూపంగా

ఆరాధించిన కళామూర్తిగా ఆమె అవుపిస్తారు.

2008లో సిలికానాంధ్ర ఆధ్వర్యంలో అమెరికాలో జరిగిన మొదటి అంతర్జాతీయ కూచిపూడి నాట్యోత్సవానికి అధ్యక్షత వహించే భాగ్యం నాకు కలిగింది. నాట్యగురువు వెంపటి చినసత్యంగారికి శోభానాయుడు గురుపూజ చేసిన మహత్తర సన్నివేశం అది! రెండు కళ్లూ చాలని గొప్ప దృశ్యంగా ఆ సమావేశాన్ని నేను భావిస్తాను. నాలుగు తరాల నాట్య గురువులు పాల్గొన్నారు.

వెంపటి చినసత్యంగారు ఒక ఆంగ్లపత్రికకు యిచ్చిన ఇంటర్వ్యూలో నావద్ద నాట్యాన్ని అభ్యసించినవారు ఎక్కువ మంది సినిమా రంగానికి వెళ్లారు. కానీ, శోభానాయుడు మాత్రం నాట్యరంగాన్ని మాత్రమే అంటిపెట్టుకుని ప్రసిద్ధి పొందారని చెప్పారు.

శ్రీమతి శోభానాయుడు ఆరంగేట్రానికి మద్రాసు కళాక్షేత్రం వ్యవస్థాపకురాలు శ్రీమతి రుక్మిణీ అరండేలు వచ్చారు. ఆమె ప్రదర్శనకు అచ్చెరువొంది ప్రశంసించి, 'నువ్వు మద్రాసు వచ్చింది నాట్యం నేర్చుకోవటానికా... సినిమాలలో చేరటానికా...?' అని అడిగారట! దానికి ఆమె తటపటాయించకుండా 'నేను సినిమాలలోకి వెళ్లను. నా జీవితాన్ని నాట్యానికే అంకితం చేస్తాను' అని ప్రమాణపూర్వకంగా ప్రకటించారు. తరువాత అక్కినేని నాగేశ్వరరావు గారు 'మహాకవి క్షేత్రయ్య'కూ, దర్శకుడు బి.యన్.రెడ్డి గారు హిందీ 'సర్గమ్' సినిమాకీ, కె.విశ్వనాథ్‌గారు 'శంకరాభరణం' సినిమాకీ, బాపుగారు 'సీతాకళ్యాణం' సినిమాకీ, యన్.టి.రామారావు గారు 'బ్రహ్మర్షి విశ్వామిత్ర' సినిమా కోసం ఇంకా ఎంతో మంది నిర్మాతలు, దర్శకులు నటించవలసిందిగా ఆహ్వానించినా ఆమె తన ప్రమాణానికే కట్టుబడి ఆ అవకాశాలను సున్నితంగా తిరస్కరించారు! ధనం కోసం, గ్లామర్ కోసం, తాపత్రయపడని కళాతపస్విని ఆమె. ఆమెది ఋషితుల్యమైన కళాహృదయం. ఆ హృదయానికి కళాభిమానులు సాగిలబడి మొక్కుతారు. "నానృషిః కురుతే నాట్యం" అని ఆమె నిరూపించారు. ఋషి కానివారు నాట్యమయూరి కూడా కాలేరు.

కూచిపూడి నాట్యసౌరభాన్ని దిగ్గిగంతాలకు వ్యాపింప చేసిన కళామూర్తి ఆమె. రష్యాలో ప్రదర్శన ఇచ్చినప్పుడు ఇద్దరు రష్యన్ యువతులు కూచిపూడి నాట్యకళ పట్ల ఆకర్షితులై ఆమెను తమకు నేర్పించవలసిందిగా ప్రార్థించారు. పదే పదే ఆమెను కలిసి, ఇండియా వచ్చి నేర్చుకుంటామని కోరేవారు. తన డాన్స్ అకాడెమీలో వారికి శిక్షణనిచ్చి మంచి నాట్యతారలుగా ఆ ఇద్దరినీ తీర్చిదిద్దారామె. 'ఈ ఘనత కూచిపూడి నాట్యకళది. ఆ కళలోనే ఆ ఆకర్షణ ఉంది. కానీ పట్టుదల లేకపోతే ఈ విద్య వంటబట్టదు. నన్ను నిలబెట్టిందీ పట్టుదలే. మరెవరికైనా కావలసిందీ అదే. పట్టుదల ఉంటే దానితోపాటు కావల్సినవన్నీ వాటంతట అవే సమకూరుతాయి. ఆ రష్యన్ అమ్మాయిల పట్టుదలలో వెయ్యోవంతున్నా, అనుకున్న రంగంలో శిఖరాన్ని అందుకోవడం ఎవరికైనా సాధ్యమేనని నాకు బలంగా అనిపిస్తుంది' అంటారామె!

104 డిగ్రీల వైరల్ జ్వరంతో బాధపడ్తున్నా పట్టు విడవకుండా, ఒంట్లో బాగోలేదని తప్పించుకోకుండా, గురువు మాట నిలబెట్టటం కోసం, కళ కోసం ఆమె నృత్యం చేసి ప్రదర్శనను రక్తికట్టించారు. చండాలిక, సత్యభామ, శకుంతల లాంటి పాత్రల్ని తలచుకుంటే శోభానాయుడు గుర్తుకొస్తారు. అంత బలంగా ఆమె రసహృదయుల మనసులమీద చెరగని ముద్రవేశారు.

తన చిన్నప్పుడు ఏలూరులోని గురువుగారు "మీ అమ్మాయికి నాట్యానికి కావలసిన ఆకృతి లేదు. ప్రేక్షకుల్ని ఒప్పించే శక్తి కూడా లేదు. అందువల్ల మీరు ఊరికే తాపత్రయపడొద్దు. అలా అని మాన్పించనూ వద్దు. నేర్పించండి. ఎప్పటికైనా వస్తే వస్తుందేమో!" అన్నారట. బహుశా మద్రాసు వెళ్లి వెంపటి చినసత్యం గారిని ఆశ్రయించి నాట్యమయూరిగా రాణించగలగటానికి ఆ గురువు మాటలకు పంతం పట్టి పట్టుదలతో చేసిన కృషే కారణం. నిజానికి శోభానాయుడుగారికి జన్మనివ్వటం మాత్రమే కాదు, ఆమెలో ఒక నాట్యమయూరికి జన్మనిచ్చింది కూడా ఆమె మాతృమూర్తే. గురువు లాభం లేదన్నా, తండ్రి వ్యతిరేకించినా, అమ్మ వెనక్కి తగ్గలేదు. "ఓ రెండేళ్లలో నాట్యం నేర్చుకుని ఆరంగేట్రం చేసి తిరిగి వస్తుంది. ఆ తరువాత అమ్మాయిని డాక్టర్‌ను చేస్తారో, ఏం చేస్తారో మీ ఇష్టం" అని భర్తను ఒప్పించిన మహా ఇల్లాలామె! ఆ ఒప్పందం మీదే నన్ను చెన్నయ్ పంపించారు" అని పలు సందర్భాల్లో శోభానాయుడు స్వయంగా చెప్పుకునేవారు. వైద్యం నేర్వకపోయినా నాట్యసరస్వతికి నిత్యనైవేద్యంగా తన జీవితాన్ని మలచుకున్నారామె. అందుకే ఆమె ధన్యజీవి.

మందలించారని గురువును వీడలేదు. వేరే గురువును ఆశ్రయించలేదు. గురువు మందలించారంటే లోపం ఎక్కడుందో తనను తాను సరిచూసుకుని, సరిచేసుకుని మెరుగుపడితే కళలో రాణిస్తారని నమ్మిన వ్యక్తి ఆమె! గురువు కోప దూషణాదులు ఎప్పుడూ తన మంచికేనని భావించి, నిరాశ చెందకుండా దీక్షతో, పట్టుదలతో కృషి చేసి, గురువుకు తగిన శిష్యురాలనిపించుకున్నారామె! ఆత్మ విమర్శే ఆమెని అంత పెద్ద స్థానానికి చేర్చింది.

నాగరకతకు కళ గీటురాయి. ఏ దేశంలో నైనా నాగరకత ఎంతవరకూ వికసించిందో ఆ దేశంలో వర్ధిల్లిన కళల ద్వారా తెలుసుకోవచ్చు ఆ కళలను వర్ధిల్లచేసిన కళాకారులపట్ల జాతి రుణపడి ఉంటుంది. ఈ సత్యాన్ని మన ప్రభుత్వాలు గమనించకపోవటం దురదృష్టకరం. సంతాప సందేశాలతో సరిపెట్టకుండా భావితరాలకు అందించిన ఆదర్శాన్ని గుర్తుచేసేలా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వాలకుంది. దురదృష్టవశాత్తూ మన రాజకీయపక్షాలకు కళాసాహిత్య రంగాలంటే చిన్నచూపు ఎక్కువ. దేశప్రతిష్ఠకు, జాతి ప్రశస్తికి ఇవి గీటురాళ్లనే ఎరుక వాళ్లకు లేదు. అదే అసలు కారణం.

జీవితంలో నాట్యం కాదు, నాట్యమే జీవితంగా జీవించి, తెలుగు నేలకు, తెలుగుజాతికీ, తెలుగు సాంస్కృతిక వారసత్వానికీ ఎనలేని కీర్తినార్జించి పెట్టారు శోభానాయుడు! నాట్యసరస్వతి అనుగ్రహం సంపూర్ణంగా పొందిన ఆమె జన్మ ధన్యం. ఆమె కళాజీవితం నాట్య కళాకారులందరికీ ఆదర్శప్రాయం. అ

సి.వి.క్రిష్ణయ్య
93965 14554

# చదవడం అంటే ఏమిటి?

చదవడం అంటే ఏమిటి? దేన్ని చదవడం అంటున్నాం? నేర్చుకోవడం అంటే ఏమిటి? దేన్ని నేర్చుకోవడం అంటున్నాం? చదవడం నేర్చుకోవడం రెండూ ఒకటేనా? ఈ విషయాల గురించి స్పష్టంగా తెలుసుకొందాం. మొదట విద్యార్థులనూ, టీచర్లనూ అడిగి వారేమిచెబుతారో విందాం.

ఒక అమ్మాయిని పలకరిద్దాం.

అమ్మాయీ! నీ పేరేమిటి? ఏ తరగతి చదువుతున్నావు?

"నా పేరు లత. పదోతరగతి చదువుతున్నాను!!"

లతా! నీ చేతిలో ఏదో పుస్తకం ఉంది. ఏమిచేస్తున్నావు?

"రేపు పరీక్షలు, చదువుకొంటున్నాను"

చదవడం అంటే ఏమిటి?

"చదవడం అంటే అక్షరాలు గుర్తించి, పదాలు వాక్యాలు చదవడం. పుస్తకంలో పాఠం చదవడం"

"నువ్వు పాఠం చదువుతున్నట్లు లేదు. నీ చేతిలో నోట్‌బుక్ ఉంది."

'అవును. ప్రశ్నలకు జవాబులు నేర్చుకొంటున్నాను!

నేర్చుకోవడం అంటే ఏమిటి?

"నేర్చుకోవడం అంటే ఒకటికి పదిసార్లు చదివి కంఠస్థం చేసి గుర్తుపెట్టుకోవడం"

మరిచిపోతే ఎలా!

"మరిచిపోతుంటాం. మళ్లీ పరీక్షలప్పుడు చదివి గుర్తు చేసుకొంటూ ఉంటాం. పరీక్షల వరకు గుర్తుంటే చాలు"

"పరీక్షలు రాస్తావు. మార్కులు వస్తాయి. పాసైపోతావు. ఆ తర్వాత మరిచిపోతే మార్కులు కూడా పోవాలి గదా!"

"అదెలా! నేను కష్టపడి నేర్చుకొని పరీక్షల్లో రాసాను కదా"

"మార్కులు వేసేది జ్ఞానానికి కదా! జ్ఞానం మరిచిపోరు కదా! నువ్వు కంఠస్థంచేయకుండా పాఠం అర్థం చేసుకొని సొంతమాటల్లో రాస్తే జ్ఞానం సంపాదించుకొంటావు గదా!"

"పాఠం చదివి అర్థం చేసుకోవడం కష్టం. పాఠంలో ప్రశ్నలుంటాయి. వాటికి టీచర్లు జవాబులు చెబుతారు. లేకపోతే గైడ్లు ఉంటాయి. జవాబులు నేర్చుకొని పరీక్షల్లో రాస్తే మంచి మార్కులు వస్తాయి. సొంతంగా రాస్తే ఫుల్ మార్కులు వేయరు"

ఇదీ సంగతి. పిల్లల దృష్టిలో చదవడం అంటే అక్షరాలు చదవడం. నేర్చుకోవడం అంటే జవాబులు కంఠస్థం చేయడం.

పాఠాలు అర్థం చేసుకోవడం కష్టం. సొంత మాటల్లో రాస్తే 'ఫుల్ మార్కులు' వేయరు. ఇది పిల్లల అభిప్రాయం. మరి టీచర్లు ఏమి చెబుతారో విందాం.

సార్ మీరు ఏ సబ్జక్టు చెబుతారు? –

"నేను సోషల్ అసిస్టెంటును. సోషల్ చెబుతాను".

"పిల్లలకు పాఠాలు చెబుతారా, ప్రశ్నలకు జవాబులు చెబుతారా"

"రెండూను. పాఠాలు చెబుతాను, ప్రశ్నలకు జవాబులూ చెబుతాను."

"ప్రశ్నలకు జావాబులు తెలుసుకొని రాయాల్సింది పిల్లలు గదా! మీరెలా జవాబులు చెబుతారు?"

"వాళ్లు అర్థం చేసుకోలేరు"

"వాళ్లకు అర్థమయ్యేటట్లు మీరు పాఠం చెప్పాలిగదా!"

"మేం పాఠం చెబుతాం. అర్థం చేసుకొనే వాళ్లు చేసుకొంటారు. చేసుకోలేని వాళ్లు చేసుకోలేరు. వారికి నోట్స్ ఇస్తున్నాంగా! అందరికీ అర్థమయ్యేటట్లు చెప్పాలంటే సిలబస్ పూర్తిగాదు. అందుకే నోట్స్ ఇస్తున్నాము."

ఇది టీచర్ల ఉద్దేశం.

ఇప్పుడు అసలు విషయానికి వద్దాం. చదవడం అంటే ఏమిటి? ఇక్కడ రెండు విషయాలు ఉన్నాయి. లిపి చదవడం, విషయం చదవడం. రెండూ ఒకటి కాదు. లిపినేర్చుకొంటాం. అది ఒక నైపుణ్యం, అది ఒక విద్య. ప్రాథమిక తరగతుల్లో లిపి నేర్చుకోవడం పూర్తవుతుంది. దీని అధారంగా పై తరగతుల్లో విషయం చదువుతారు. అంటే అర్థం చేసుకుంటారు. చదవడం అంటే అర్థం చేసుకోవడం. విషయం ఇదీ అని తెలుసుకోవడం. చదవడం అంటే ప్రశ్నలకు జవాబులు నేర్చుకోవడం కాదు. చదవడం అంటే కంఠస్థం చేయడం కాదు.

అక్షరాలతో సంబంధం లేకుండా మనమందరం ఈ ప్రపంచాన్ని నిరంతరం చదువుతూ ఉంటాం. అంటే అర్థం చేసుకొంటూ ఉంటాం. అర్థంచేసుకొనే శక్తి ప్రతి ఒక్కరికీ ఉంటుంది. అది నేర్చుకొనేది కాదు. అది పుట్టుకతోనే మనలో దాగి ఉంటుంది. అది ఉపయోగించక పోతే జరిగే నష్టం అంతా ఇంతా కాదు.

అర్థం చేసుకోడానికి ఒక పద్ధతి ఉంది. ఒక క్రమం ఉంది. అదేమిటో తెలుసుకొందాం.

ఈ సృష్టిలో ప్రతిదీ అద్భుతమే. రహస్యమే. ఆకాశం, నక్షత్రాలు సూర్యుడు, చంద్రుడు, భూమి, నిప్పు, నీరు, చెట్లు, రకరకాల జీవులు వీటి గురించి తెలుసుకోడానికి మానవ జాతి వేల సంవత్సరాలుగా కృషిచేస్తూ ఉంది. ఎంతోమంది శాస్త్రవేత్తలు, పరిశోధకులు తమ జీవితాలను ధారబోసి ఎన్నో విషయాలు తెలుసుకొన్నారు. వారి కృషి ఫలితమే ఈనాడు మనం అనుభవిస్తున్న జీవన విలాసాలు.

వేల సంవత్సరాలుగా ఎంతో విజ్ఞానం పోగుపడింది. ఈ విజ్ఞానం దాచి పెట్టేది కాదు. తరం నుండి తరానికి అందించాలి. ఈ విజ్ఞానం మనుషుల మెదళ్లలో చేరితేనే అది మరింతగా అభివృద్ధి అవుతుంది. అందుకోసమే ఈ స్కూళ్లూ, టీచర్లూ, పాఠ్యపుస్తకాలు.

పిల్లల వయస్సును బట్టి తరగతులను బట్టి వాళ్లు ఎలాంటి విషయాలు ఎంత నేర్చుకోగలరో అంత విజ్ఞానాన్ని కూర్చి పాఠ్యపుస్తకాలు తయారు చేస్తారు. వాటిని చదివి పిల్లలు అర్థం చేసుకోవాలి. ఇందుకోసం ఉపాధ్యాయులు సహకరిస్తారు. పిల్లలు

పాఠ్యపుస్తకాలు చదవకుండా, సందేహించకుండా, ప్రశ్నించకుండా, టీచర్ చెప్పిన జవాబులు కంఠస్తం చేయడాన్ని చదవడం అందామా? మొత్తం వ్యర్థం అయిపోయినట్లే కాదా!

భూమి గుండ్రంగా ఉందనీ, అది తనచుట్టూ తాను తిరుగుతూ సూర్యుడిచుట్టూ తిరుగుతున్నదనీ పాఠంలో ఉంది. విద్యార్థి చదువుతాడు. కానీ భూమి చదునుగా బల్లపరుపుగా ఉన్నట్లూ, స్థిరంగా కదలకుండా ఒకే చోట ఉన్నట్లు కళ్లకు కనబడుతుంది. సూర్యుడు తూర్పున ఉదయించి, అలా పైకి ఎగబాకి పడమట దిగిపోయి సూర్యుడే భూమిచుట్టూ తిరుగుతున్నట్లు గమనిస్తాడు. తాను చూస్తున్నదానికి విరుద్ధంగా పాఠంలో ఉంది. ఇప్పుడేమి జరగాలి? సందేహించాలి. ఇది నిజమా అని ప్రశ్నించాలి. టీచర్‌తో స్నేహితుల్తో చర్చించాలి. తర్కించాలి. వాదోపవాదాలు జరగాలి. అనేక రుజువులు చూడాలి. అర్థం చేసుకోవాలి. ఓహో ఇదా సంగతి అని ఆశ్చర్యపోవాలి. ఆనందించాలి. లోపల ఏదో ఒక అనుభూతి పొందాలి. అంతకుముందున్న అభిప్రాయంలో మార్పు వస్తుంది. సత్యమేదో తెలుసుకొంటాం. జీవితంలో దాన్ని ఉపయోగించు కొంటాం. ఇదేమీ జరక్కుండా అర్థం చేసుకోవడం జరిగే పనికాదు. మధ్యలో మరో పితలాటకం వచ్చి కూర్చుంది. ఏ భాషలో అర్థం చేసుకోవాలి? ఏ మీడియంలో చదవాలి? ఇది అకస్మాతుగా ఇప్పుడు పుట్టిన సందేహం. ఏ భాషలో మాట్లాడతారో, ఏ భాషలో ఆలోచిస్తారో ఏ భాషలో ప్రశ్నిస్తారో ఆ భాషలోనేగదా అర్థం చేసుకోవాలి. అది మాతృభాషే గదా! పరభాషను నేర్చుకోవాలన్నా మాతృభాష సహాయంతోనే కదా! ప్రపంచమంతా ఇదేగదా ఘోషిస్తున్నది.

మధ్యలో వచ్చిన ఈ పితకలాటాన్ని పక్కన బెట్టి అసలు విషయానికి వద్దాం. చదవడం అంటే అర్థం చేసుకోవడం అని తెలుసుకొన్నాం. మరి నేర్చుకోవడం అంటే ఏమిటి? పుస్తకంలో ఉన్న వాక్యాలను కంఠస్థం చేయడమా? కంఠస్థం చేయడాన్ని నేర్చుకోవడం అనకూడదు. బట్టీపట్టడం అనాలి.

నేర్చుకొనేవి విద్యలు, నైపుణ్యాలు. డ్రైవింగ్ నేర్చుకొంటారు. టైలరింగ్ నేర్చుకొంటారు. సంగీతం నేర్చుకొంటారు. నాట్యం నేర్చుకొంటారు. పరభాషలు నేర్చుకొంటారు. ఇందు కోసం కొంత శ్రమపడాలి. అభ్యాసం చేయాలి. ఒక సారి నేర్చుకొంటే జీవితాంతం మనవెంటే ఇవి ఉంటాయి. ప్రశ్నలకు జవాబు మరిచిపోయినట్లు మరిచిపోరు.

కుండలు చేయడం, బుట్టలు అల్లడం, వంట చేయడం, వ్యవసాయం, ఇలాంటివి ఎన్నో విద్యలున్నాయి. చదువుతో సంబంధం లేకుండా చాలా మందికి చాలా విద్యలు తెలుసు.

కాబట్టి అర్థం చేసుకోవడం వేరు. నేర్చుకోవడం వేరు. అర్థం చేసుకోవడం అంటే విషయం ఇదీ అని తెలుసుకోవడం. ఈ తెలుసుకోవడం మానవుడి సహజ లక్షణం. ఇందు కోసం మనిషి తన ప్రాణమైనా ఇస్తాడు. తెలుసుకోవడం ఆసక్తికీ కుతూహలానికీ సంబంధించినది. అవసరం ఉండవచ్చు లేకపోవచ్చు. కానీ నేర్చుకోవాలంటే అవసరం ఉండి తీరాలి. అది భవిష్యత్తులో కలగబోయే ప్రయోజనం కోసం చేసేపని. ఇందు కోసం శ్రమపడాలి. మనస్సు, శరీరం రెండూ ఉపయోగించాలి.

తెలుసుకోవడం మానవుడి సహజ లక్షణం. నేర్చుకోవడం మానవుడు సాధించిన లక్షణం.

అర్థం చేసుకోకుండా చదివేది చదువు కాదు. అదొక వ్యర్థ కార్యకలాపం. ఇలాంటి చదువులు ఉన్న దేశాలు, సమాజాలు ఎంతో నష్టపోతున్నాయి. సమాజాలు అస్తవ్యస్తంగా మారిపోతున్నాయి. మన దేశం ముఖ్యంగా మన రాష్ట్రం ఎంతో నష్టపోతున్నది. ప్రతీదాన్ని డబ్బులతో కొలిచే ఈ ప్రపంచంలో ఇప్పుడు జరిగిన నష్టాన్ని డబ్బుతో లెక్కిస్తే కొన్ని లక్షల కోట్లు ఉంటుంది.

ఆ నష్టాలు ఇవే:

1. అద్భుతమైన బాల్యాన్నీ, కాలాన్నీ, డబ్బునూ నష్టపోతున్నారు. అర్థం చేసుకోకుండా చదివినందు వల్ల క్రమంగా అర్థం చేసుకొనే శక్తిని కోల్పోతారు. ఆలోచించడం మానుకుంటారు. అస్తవ్యస్తంగా ఆలోచిస్తారు. దురభ్యాసాలకు లోనవుతారు. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోతారు. సులభంగా మోసపోతారు. ఇతరుల మీద ఆధారపడి బ్రతకడం అలవాటు చేసుకుంటారు.

2. కష్టపడి డిగ్రీలు సంపాదించుకుని ఉద్యోగస్తులైన వారు భవిష్యత్తులో ఒక్క పుస్తకం కూడా చదవరు. తమ వృత్తి నైపుణ్యాలను మెరుగు పరచుకోరు. ఎందుకంటే విజ్ఞాన సంబంధమైన పుస్తకాలు చదివి అర్థం చేసుకోవడానికి భయపడతారు. అందువల్ల ఎలాంటి మార్పును స్వీకరించలేరు. సమాజాన్ని ముందుకు కదలనీయరు.

3. ఉన్నత చదువులు చదివిన ఇంజినీర్లు, డాక్టర్లు, లాయర్లు, అధికారులు, ఆలోచించలేని జనాలను తమ కింద ఉద్యోగులను చూసి తమ అధిక్యతను ప్రదర్శించడానికి ప్రయత్నిస్తారు. క్రింది వారిని పురుగుల్లా చూస్తారు. తమ తెలివి తేటలతో ప్రజల సమస్యలను పరిష్కరించవలసిన వీరు ప్రజలకే సమస్యగా మారతారు.

ఈ మనుష్యులు బాల్యంలో, కౌమారంలో, యవ్వన కాలాల్లో వత్తిడి లేకుండా, భయం లేకుండా, ఆనందంగా అర్థం చేసుకొంటూ చదివివుంటే ఈ ప్రపంచాన్ని ఆనందంగా ఉంచేవారు. ప్రపంచం ఇంత దుర్మార్గంగా ఉండేది కాదు.

చదువు గొప్పదే, బడీ గొప్పదే–కానీ బోధనా పద్ధతులు, పరీక్షలు, మార్కులు, పాస్, ఫెయిలు ఇవన్నీ అశాస్త్రీయం.

ఈ చదువులు పరాయి పాలకులు తమకు ఊడిగం చేసే బానిసలను తయారు చేయడానికి ఏర్పాటు చేసిన విద్యావిధానంలో భాగం. వాళ్లు పోయినా వాళ్ల విద్యావిధానం అలానే ఉంది. మన పాలకులకు కూడా స్వతంత్రంగా ఆలోచించలేని బానిసలేగదా కావలసింది. అందుకనే విద్యావ్యవస్థను మరింతగా దిగజారుస్తూ చట్టాలు తెస్తూ ఉంటారు. ఇప్పుడు మాతృభాషలోగూడా ఆలోచించ గూడదు. చదువు కోకూడదు అనే చట్టం తెచ్చారు. పరాయి పాలకులు కూడా చేయలేని సాహసం చేశారు. కారణం తెలుస్తూనే ఉంది కదా! మన చదువుల ద్వారా ఇంత కాలం తయారైంది అర్థం చేసుకోలేని వాళ్లు. ఆలోచించ లేనివాళ్లు ఆలోచించగలిగినా నిజాయితిగా ధైర్యంగా సత్యాన్ని ఒప్పుకోలేనివాళ్లు.

ఇంతకంటే వేరే రుజువులు ఎందుకు?

**'పిల్లలు అదనపు భాషను త్వరగా, సులభంగా, బాగా నేర్చుకోటానికి తల్లిభాష ఉపయోగపడుతుంది'**

పీవీ
శతజయంతి ప్రత్యేకం

డా. గంధం సుబ్బారావు
7901093537

# పీవీ గారి సాహిత్యాభినివేశం



(గత సంచిక తరువాయి...)

గారు విశ్వనాథ వద్దకు వెళ్ళి, "సహస్ర ఫణ్" గురించి ప్రశ్నలు అడిగారు. అందుకు బదులుగా ఆయన "నాకు ఆ హిందీ నడవదు. మీరు చదివారు కదా! ఎట్లా వుంది? అని కృష్ణ గారిని అడిగారట. అందుకు ఆయన మీరేమీ అనుకోకపోతే, ఒక మాట చెబుతాను. పీవీ నరసింహారావు అనే రచయిత "సహస్ర ఫణ్" అనే నవల రాస్తే, దానిని విశ్వనాథ సత్యనారాయణ తెలుగులోకి అనువదించారని చెప్పుకుంటున్నారు'' అని జవాబిచ్చారు. దానికి విశ్వనాథ పొంగిపోయారని సీనియర్ జర్నలిస్ట్ ఉదయవర్లు గారు 25 -12 -2004 నాటి ఆంధ్రప్రభ దినపత్రికలో రాశారు.

"విశ్వనాథ మనకూ, ప్రపంచానికీ ఇస్తున్న విభూతిని ప్రతి ఒక్కరూ సవిమర్శగా అర్థం చేసుకోవాలి. ఆయన సాహిత్య సేవ ఎడతెగకుండా పారే జీవనది వంటిది. ఓ మహాస్రవంతి. దివ్యంగా, ధారావాహికంగా ప్రవహించే పరమపావనియైన జాహ్నవి వంటిది. ఎక్కడ దోసిలి పట్టి త్రాగినా, త్రాగవచ్చు" అని విశ్వనాథ సాహిత్యాన్ని విశ్లేషించారు పీవీ గారు (ఆంధ్రప్రభ 30-08-1971).

తెలుగులో తన రచనా వ్యాసాంగానికి ప్రేరణ విశ్వనాథ సత్యనారాయణ రచనలేనని పీవీ తెలిపారు. విశ్వనాథ వారంటే పీవీకి అమితమైన గౌరవం. ప్రత్యేకంగా విశ్వనాథ వారిని చూడటానికి ముఖ్యమంత్రిగా పీవీ గారు విజయవాడకు వెళ్ళిన రోజులున్నాయి.

పీవీ గారి అనువాద ప్రతిభకు మరో తార్కాణం "అబలా జీవితం". మరాఠీ సాహిత్యంలో ఆణిముత్యంగా భావించే "పన్ లక్షత్ కోన్ ఘూతో" (ఎవరికి పట్టింది!) నవలకు ఇది అనువాదం. బహుభాషా కోవిదులైన పీవీ కి మరాఠీ భాషలోనూ మంచి ప్రావీణ్యం ఉంది. అది ఈ అనువాదంతో జగద్విదితమైంది. ఈ నవల మూల రచయిత శ్రీ హరినారాయణ్ ఆప్టే మరాఠీ సాహిత్య చరిత్రలో సుస్థిర స్థానం సంపాదించుకున్న సుప్రసిద్ధ రచయిత. గోపాలకృష్ణ గోఖలే వంటి జాతీయ నాయకులకు ఆత్మీయుడు. ఆయన రచించిన 18 నవలల్లో ఇది ప్రసిద్ధమైంది.

ఇది తెలుగు నవలే అన్నంత సాఫీగా సాగింది ఆ అనువాదం. అనూహ్యమైన వర్ణనలతో సాగే ఈ రచనను సరళమైన తెలుగులోకి అనువదించారు పీవీ. దీని ద్వారా తెలుగు సాహిత్యానికి ఒక అరుదైన జోడింపు లభించింది. ప్రధానంగా రెండు కుటుంబాలను కేంద్రీకరించుకుని సాగిన ఈ నవల 19వ శతాబ్దంలో స్త్రీల స్థితిగతులకు, పరిస్థితులకు అద్దం పడుతుంది.

ప్రసిద్ధ రచయిత్రి శ్రీమతి జయప్రభ తన తెలుగు కవితా సంకలనం పుస్తకాన్ని ఇవ్వడానికి ఆమె ఒకసారి పీవీ గారిని కలిశారు. ఆ పుస్తకాన్ని అందుకున్న పీవీ అందులోని కొన్ని కవితలు చదివి, మీ కవితలు చాలా బాగున్నాయి. ఎవరైనా ఇంగ్లీష్ బాగా వచ్చిన

### అనువాదకుడుగా పీవీ

14 భాషలపై పట్టు కలిగిన పీవీ, వివిధ భాషలలోని సాహిత్యాన్ని తెలుగులోకి, హిందీలోకి, ఇంగ్లీషులోకి అనువదించారు. ఒక భాష నుంచి మరొక భాషలోకి ఆయన చేసిన అనువాదం నేరుగా రాసిన సాహిత్యం వలెనే ఉన్నదంటే, వివిధ భాషలపై ఆయన పట్టు ఏ స్థాయిలో ఉండేదో అర్థం చేసుకోవచ్చు.

### సహస్ర ఫణ్

విశ్వనాథ సత్యనారాయణగారి ప్రఖ్యాత నవల "వేయిపడగలు" ను "సహస్ర ఫణ్" పేరుతో హిందీలోకి పీవీ గారు చేసిన అనువాదం అనువాద ప్రక్రియకే తలమానికమని మెప్పు పొందింది.

స్వయంగా ఒక ఉత్తమ నవలను రచించడం వేరు, ఒక ఉత్తమమైన నవలను మరొక భాషలోకి అనువదించి, ఆ అనువాదం మూల రచనకు సమాన స్థాయిలో ఉందని భాషాప్రేమికుల, విశ్లేషకుల ప్రశంసలు పొందటం వేరు. ఈ అరుదైన గౌరవం పీవీ గారికి దక్కడం ఆయన అనువాద ప్రతిభకు తార్కాణం.

"వేయిపడగలు" వంటి నవలను అనువదించడం కష్టతరం. ఎందుకంటే ఏ భాషారీతికైనా తేలిగ్గా ఒదిగిపోయే గ్రాంథికభాషా రచనలకు నుడికారం ప్రసక్తి ఉండదు. కానీ, విశ్వనాథ సత్యనారాయణ గారి రచనలు అట్లా వుండవు. తెలుగు దేశంలోని గ్రామసీమల్లో వుండే అతి సహజమైన తెలుగు నుడికారానికీ, శోభకు ఏతమెత్తినట్లు ఉంటాయి ఆయన రచనలు. తెలుగు సంస్కృతి, నుడికారం, పలుకుబడుల సంగమం "వేయిపడగలు". అట్లాంటి రచనను సంప్రదాయ హిందీ భాషా రచయితలు, పాఠకులు ఆహా! అని ఆనందించేటట్లు అనువాదం చేయడం తేలికైన పని కాదు.

ఆ విధంగా "సహస్ర ఫణ్" అటు విశ్వనాథ వారికీ ఇటు పీవీ గారికి హిందీ సాహిత్య ప్రపంచంలో ప్రఖ్యాతిని, ప్రచారాన్ని సముపార్జించి పెట్టింది. ఎంతగా అంటే అచ్చయిన రెండు వేల ప్రతులు నాలుగైదు నెలల్లోనే అమ్ముడు పోగా, 1972 ఫిబ్రవరి లో ద్వితీయ ముద్రణ వెలువడింది. అంతేకాక "సహస్ర ఫణ్" ను మరాఠీ, గుజరాతీ భాషలలోకి అనువదించడానికి అనుమతులు కోరబడ్డాయి. ఈ అనువాదానికి కేంద్ర సాహిత్య అకాడమీ ఉత్తమ అనువాద సాహిత్యానికిచ్చే అవార్డు పీవీ గారికి లభించింది.

ఆ సందర్భంలో సుప్రసిద్ధ పాత్రికేయులు కీ. శే. జి. కృష్ణ

వారితో ఇంగ్లీషులోకి అనువదింపజేయకపోయారా? అంతర్జాతీయంగా మీకు మంచి పేరు వచ్చేది అని అన్నారట. ఆమె అలాగే అంటే, ఆయన కొంచెం ఆలోచించి ఎవరో ఎందుకు? నేనే ఇంగ్లీష్ లోకి అనువాదం చేసి పెడతాను లెండి అన్నారట. ఆమెకు గుండెల్లో రాయి పడిందట. పీవీ గారు వచనం అనువదించడంలో ప్రసిద్ధులు. ఆయన తన తెలుగు కవితలను ఆంగ్లంలోకి అనువదించగలరా అనుకున్నారట. అయితే కొన్ని రోజుల తరువాత ఆమెను పిలిచి, ఆమె కవితల ఆంగ్ల అనువాద ప్రతిని ఇచ్చారట. ఆ అనువాదాలు చదివి ఆమె ఆశ్చర్యపోయారట. అవి అనువాదాలు వలె కాక, ఆంగ్ల దేశాలకు చెందిన చేయి తిరిగిన ప్రసిద్ధ కవి సహజ కవితల్లాగా ఉన్నాయట. అంతకన్నా బాగా ఆంగ్లంలోకి మరెవ్వరూ అనువదించలేరు అనుకున్నారట ఆమె. పీవీ గారి ప్రతిభను తక్కువగా అంచనా వేసినందుకు ఆమె బాధపడ్డారట. తన కవితలు పీవీ గారికి అంతగా నచ్చినందుకు ఆమె హృదయం ఉప్పొంగిపోయిందట.

ఒక భాష నుంచి సాహిత్యాన్ని మరొక భాషలోకి అనువదించడం వల్ల ఆయా సంస్కృతులు ఇతరులకు తెలుస్తాయి. దీని వల్ల భిన్నత్వంలో ఏకత్వం సాధించవచ్చని పీవీ నరసింహారావు గారు చెప్పారు. దేశకాల పరిస్థితుల దృష్ట్యా అది ఈనాటి అవసరమని, ప్రపంచ భాషలలోని మహాకావ్యాలన్నింటినీ రష్యన్ భాషలోకి అనువదించడానికి దోహదం చేసిన పీపుల్స్ పబ్లిషింగ్ హోమ్ కార్యాచరణ పద్ధతి అందరికీ అనుసరణనీయమైనదని, తెలుగులో ఎంతో విలువైన సాహిత్యం విస్తారంగా వున్నదని, దానిని బయటి ప్రపంచానికి తెలియజెప్పి తెలుగు సాహిత్యం గొప్పదనాన్ని దశదిశలా చాటాలని పీవీ గారు ఎప్పుడూ ఆరాటపడేవారు.

రాష్ట్ర సాంస్కృతిక మండలి, తెలుగు విశ్వవిద్యాలయం వంటి ప్రభుత్వ నిధులున్న సంస్థలు పాఠకులు ఉన్నారా, లేరా? అన్న మీమాంసకు వెళ్ళకుండా గ్రంథాలను ప్రచురించి, మన సంస్కృతిని పరిరక్షించాలని ఆయన అనేవారు.

“పీవీ నరసింహారావు గారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ శాఖ మంత్రిగా ఉండగానే ఆ శాఖలో అనువాద విభాగం ఏర్పాటైంది. అంతకుముందే భారత రాజ్యాంగాన్ని “భారత సంవిధాన” మనే పేరిట నరసింహారావు గారే తెలుగులోకి అనువదించి వున్నారు. 1963లో కేంద్రం చేసిన అధికార భాషా శాసనంలోనూ, 1966లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన చట్టంలోనూ ఇంగ్లీష్ లో వున్న ఏ చట్టాన్నయినా అనువదించి రాష్ట్ర గవర్నరు ఆమోదం పొందిన తరువాతనే అది అధికార పాఠమవుతుంది. దానికి తప్ప న్యాయశాస్త్ర రీత్యా ఇతర విధాన అనువాదాలకు గుర్తింపు లేదు – రాదు. అందువల్ల అనువాద విధానాలను నిర్దేశించవలసిన అవసరం, బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం మీద వున్నాయి. అప్పటికీ భాషలను గురించి, అనువాద విధానాలను గురించి రకరకాల సిద్ధాంతాలు, చర్చలు వున్నాయి. వాటన్నిటినీ సమన్వయము చేయడం సాధ్యం కాదు. అలాగని నిర్ణయాధికారాన్ని కాలానికి వదిలేస్తే ఎన్ని దశాబ్దాల తరువాత, ఎన్ని శతాబ్దాల తరువాత ఏక రూపత, ఆమోద యోగ్యత, ఏక ఐక్యత వస్తాయో ఎవరూ చెప్పలేరు. అందువల్ల ఏదో ఒక విధమైన నిర్దేశం, లక్షణ నిరూపణ చేయవలసిన బాధ్యత న్యాయశాఖ మంత్రి మీద వుంది. ఆ బాధ్యతను నెరవేర్చే సదుద్దేశంతో, తెలుగులో శ్వేత పత్రాన్ని (వైట్ పేపర్), పరిశీలన పత్రాలను (వర్కింగ్ పేపర్స్) 1968, 1969 సంవత్సరాలలో ప్రభుత్వం తరఫున న్యాయశాఖ మంత్రిగా పీవీ గారే తయారు చేసి శాసనసభలో వాటిని చర్చకు పెట్టారు. విస్తృత పరిశీలన కోసం, చర్చా గోష్ఠులకు తేదీలను కూడా నిర్ణయించారు కానీ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయికి చేరుకున్నందువల్ల బహిరంగ సమావేశాలు జరగలేదు”.

(డా. బూదరాజు రాధాకృష్ణ “భాషా సేవకులుగా శ్రీ పీవీ నరసింహారావు గారు” వ్యాసం).

**విమర్శకుడుగా పీవీ**

ఏది చదివినా శ్రద్ధగా చదవడం, చదివిన రచనను లోతుగా విశ్లేషించి, ఆ రచనను విమర్శనాత్మకంగా పరిశీలించడం పీవీ గారికి అలవాటు. విమర్శ విషయంలో ఎంతటి వారైనా ఎలాంటి మొహమాటం లేకుండా తన అభిప్రాయాన్ని నిక్కచ్చిగా చెప్పడంలో ఏనాడూ ఆయన వెనుకాడలేదు. తెలుగు సాహిత్యంలో హిమాలయ శృంగ సదృశ్యుడైన విశ్వనాథ సత్యనారాయణ గారిని ఆయన ఒకసారి విమర్శలో ఢీకొన్నారు.

1956 మార్చి 31 , ఏప్రిల్ 1 తేదీల్లో, రెండు రోజులపాటు కరీంనగర్ లో విశ్వనాథ షష్టిపూర్తి ఉత్సవాలు జువ్వాది చొక్కారావు, గౌతమ్ రావు గార్ల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున జరిగాయి. దివాకర్ల వెంకటావధానిగారు, నాయని సుబ్బారావు గారు, ధూళిపాళ శ్రీరామ మూర్తి గారు, కాళోజి నారాయణరావు గారు – వంటి ప్రముఖులు ఆ సభల్లో పాల్గొన్నారు. వరంగల్ నుంచి కోవెల సుప్రసన్నాచార్య, కోవెల సంపత్కుమారాచార్య కూడా ఈ సభలకు వెళ్ళారు.

“ఆ సందర్భంగా సత్యనారాయణ గారి నవలా సాహిత్యాన్ని గురించి పీవీ గారు తొలి రోజున చదివిన ప్రసంగ వ్యాసం అందరినీ ఒక్కసారిగా ఉలిక్కిపడేటట్లు చేసింది. సభాసదుల్ని ఆలోచించమని బలవంతపెట్టింది. ఆ సుదీర్ఘ వ్యాసాన్ని విన్నవారు కొందరు సంతోషించారు. కొందరు చికాకుపడ్డారు. ఈ రెండు తీరులకూ కారణం, పీవీ ఆ ప్రసంగంలో సత్యనారాయణ గారి నవలల్లో – ప్రధానంగా ప్రవేశపెట్టిన కొన్ని పాత్రలు, వాటి చిత్రణలో లోపాల వంటి కొన్ని కొన్నింటిని సందేహాల రూపంలో వేలెత్తి చూపడమే. కొంత ఘాటుగా విస్తరించడమే. ఆ ప్రసంగ వ్యాసం ఆయన ముఖతః ఆ రోజున విన్నప్పుడు శ్రీ పీవీ దృష్టి నైశిత్యం, విశ్లేషణ, వివేచనలోని గాంభీర్యం మొదటిసారిగా నాకు అవగతమైంది” అని డా. కోవెల సంపత్కుమారాచార్య తమ “పీవీ సాహిత్య వ్యక్తిత్వం” వ్యాసంలో పేర్కొన్నారు.

పీవీ తరువాత మరొకరిద్దరు ప్రసంగించిన అనంతరం, చివరకు మాట్లాడిన విశ్వనాథ వారు తమ ప్రసంగంలో పీవీ ప్రస్తావించిన అంశాలకు తమ సాహిత్య జీవితంలో నుంచి, లోకంలో నుంచి పలువురు మహానుభావులైన దేశ విదేశ మహాకవుల, రచయితల రచనల నుంచీ “వేయిపడగలు” మొదలైన నవలలు తాను రచించిన కాల పరిస్థితుల నుంచీ రకరకాల ఉదాహరణలు ఇస్తూ, ఆయా పాత్రలను ఆయా విధాలుగా చిత్రించడానికి కారణాలను, ఔచిత్యాన్ని వివరిస్తూ సుదీర్ఘంగా ఉపన్యసించారు.

ఆనాటి పీవీ ప్రసంగాన్ని, ఆ తరువాత సత్యనారాయణ గారి ఉపన్యాసాన్ని విన్నవారిలో కొందరు పీవీ, సత్యనారాయణ గార్ల

సంబంధాన్ని గురించి రకరకాలుగా చెప్పుకుని వారిద్దరికీ చెడిందని ప్రచారం చేశారట. అప్పటికే విశ్వనాథ వారి వేయిపడగలు నవలను పీవీ హిందీలోకి అనువదిస్తున్నారనే వార్త వ్యాప్తిలో వుంది. అయితే ఆనాటి ఆ సన్నివేశంతో ఆ అనువాద కార్యక్రమం ఆగిపోతుందని, సత్యనారాయణ గారు హిందీ సాహిత్య రంగానికి పరిచయమయ్యే అవకాశం, దాన్ని బట్టి అఖిల భారత స్థాయిలో ఆయనకు పేరొచ్చే అవకాశం దానంతట అదే తప్పిపోయిందని చాలా మంది భ్రమపడ్డారు. కానీ వారి ఊహలు అన్నీ అపోహలుగానే మిగిలిపోయాయి. ఆనాటి నుంచీ సత్యనారాయణ గారు – పీవీ గారు మరింత సన్నిహితులయ్యారు. "వేయిపడగలు" ను పీవీ "సహస్ర ఫణ్" గా అనువదించడంలో తమ రాజకీయ కార్యకలాపాల వత్తిడి వల్ల కొంత ఆలస్యం జరిగినా, ఇది 1971లో భారతీయ జ్ఞానపీఠ్ వారి ద్వారా వెలువడి, వారిద్దరికీ మంచి పేరు తెచ్చిపెట్టింది.

**జర్నలిస్టుగా పీవీ**

1945–46 సంవత్సరాలలో దేవులపల్లి రామానుజరావు గారు ఆంధ్ర సారస్వత పరిషత్ పక్షాన "శోభ" అనే మాసపత్రికను నడిపారు. ఆ సమయంలోనే పీవీ తన మిత్రబృందంతో కలిసి "కాకతీయ సారస్వత సంకలనములు" పేర ఒక వార్తాపత్రికను ప్రారంభించారు.

పోలీస్ చర్య తరువాత తెలంగాణాలో ఒక వినూత్న రాజకీయ సంచలనం ప్రారంభమైంది. ప్రజాతంత్రశీలత అనే కొత్త సంస్కృతికి, సంప్రదాయానికి బీజాలు పడ్డాయి. కాలానుగుణంగా 1948 నుంచి కాకతీయ పత్రిక ఉద్ధృతిని పెంచింది. గార్లపాటి రాఘవరెడ్డి గారి పరిదేవన కావ్యం ఈ పత్రికలోనే మొదటిసారి అచ్చయింది. ఈ పత్రికలో పీవీ గారి పలు రచనలు, "మానావమానాలు" అనే నవల ప్రచురించబడ్డాయి. ప్రసిద్ధ హిందీ కవి మహాదేవవర్మ కవితలపై సుదీర్ఘ సమీక్షను కూడా పీవీ ఈ పత్రికలో ప్రచురించారు. మతకలహాలు ఇతివృత్తంగా "యెదవ నాగన్న" కథను, మహాకవి 'గ్రే' ఎలిజీకి తెలుగు అనువాదాన్ని కూడా పీవీ ఈ పత్రిక ద్వారానే పరిచయం చేశారు. పీవీ గారి "గొల్లరామవ్వ" కథ, "బ్లూ సిల్క్ శారీ" మొదట ఈ పత్రికలోనే ప్రచురితమైయ్యాయి.

పత్రిక సామాన్య ప్రజల ఆదరాన్ని, సాహితీ వేత్తల ఆమోదాన్ని పొందింది. రాజకీయంగా ప్రజాస్వామ్య, సామ్యవాద సిద్ధాంత వ్యాప్తికి కృషి చేసింది. అనేక ప్రత్యేక సంచికల ద్వారా వ్యవసాయ, సహకార, విద్య, సంక్షేమ రంగాలకు ప్రాధాన్యతనిస్తూ, పీడిత ప్రజానీకం ప్రయోజనాలకు ప్రాచుర్యం కల్పించింది. అసంఖ్యాక హాస్య, వ్యంగ్య రచనల ద్వారా అభివృద్ధి నిరోధక శక్తుల కుట్రలు, కుతంత్రాలను బయట పెట్టింది. నైతిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక వికాసాలకు పాటు పడింది. జాతీయ, అంతర్జాతీయ సమస్యలను కూడా నిష్పాక్షికంగా విశ్లేషించింది.

పత్రిక నిర్వహణలో పీవీ చందాదారులను చేర్పించడం, రచనలు సమకూర్చడం, ప్రకటనలు సేకరించడం, ప్రూఫ్ లు దిద్దడం వంటి అన్ని పనులూ చేసేవారు. అన్నిరకాల బాధ్యతలను నిర్వహించేవారు. ఈ పత్రికకు పీవీ ఆప్తమిత్రులు పాములపర్తి సదాశివరావు గారు సంపాదకులు. గార్లపాటి రాఘవరెడ్డి గారు, కాళోజీ నారాయణరావు గారు పత్రిక నిర్వహణలో సాయపడేవారు.

అయితే, నిర్వాహకులలో వ్యాపార దృక్పథం లేనందున కాకతీయ పత్రికకు ఆర్థిక పుష్టి సమకూరలేదు. కేవలం నిస్వార్థ సేవా దృక్పథంతో పత్రికను నడిపారు. అందువల్ల రానురాను పత్రిక మనుగడ కష్టతరమై, అనుకోని రీతిలో పత్రిక ప్రచురణ నిలిచిపోయింది.

కాకతీయ పత్రిక నిలిచిపోయి ఎన్ని దశాబ్దాలు గడిచినా పీవీ లో మంచి సాహిత్య పత్రిక ఉండాలన్న కోరిక మాత్రం సజీవంగానే ఉండిపోయింది. పీవీ గారికి తెలుగు జర్నలిజం పై గాఢమైన అభిప్రాయాలున్నాయని పీవీ గారి ఆంగ్ల నవల "ఇన్సైడర్" ను తెలుగులోకి అనువదించిన సీనియర్ జర్నలిస్ట్ శ్రీ కల్లూరి భాస్కరం గారు "ప్రతిభా వైజయంతి 2002" లో రాసిన వ్యాసంలో పేర్కొన్నారు. ఆయన పుస్తకం అనువాదం విషయమై పీవీ గారి వద్దకు తరచూ వెళ్తుండేవారు. అలా ఒకసారి వెళ్తూ, తన మిత్రుడు ఒకరిని వెంట తీసుకుని పోయారట. పీవీ గారు మాటల సందర్భంలో తెలుగు సాహిత్యం తీరుతెన్నులు, కవులు, రచయితల గురించి మాట్లాడుతూ "తెలుగులో పత్రికలేవండీ, భారతి లాంటి పత్రికలేమైపోయాయి? మిగతా భారతీయ భాషలలో చూస్తుంటాను, భారతి లాంటి స్థాయి గల పత్రికలు ఎన్నో కనిపిస్తుంటాయి. తెలుగులోనే ఏమి లేని పరిస్థితి ఎందుకొచ్చింది?" అంటూ ఆవేదన వ్యక్తం చేశారట. అప్పుడు పక్కనే వున్న భాస్కరం గారి మిత్రుడు "తెలుగువాళ్ళు చదవరండీ!" అనేశారట. ఆ మాటకు ఆయన చాలా నొచ్చుకున్నట్లు కనిపించారట. "తెలుగు వాళ్ళ గురించి అలా అనకండి. తప్పక చదువుతారు" అన్నారట. ఆ మరునాడు మళ్ళీ భాస్కరం గారు కలుసుకున్నప్పుడు కూడా పీవీ గారు ఆ ప్రస్తావన తెచ్చి, "మీ మిత్రుడి అభిప్రాయం చాలా తప్పు. మీరే ఒక మంచి పత్రిక ప్రారంభించండి. నా సహకారం కూడా ఉంటుంది" అన్నారట. తెలుగులో భారతి, త్రివేణి లాంటి పత్రికల అవసరం ఈనాడు ఎంతగానో వుంది. భారతి ఈ శతాబ్దపు తెలుగు వారి ఆస్తి. దాన్ని పునరుద్ధరిస్తే మేలు జరుగుతుంది అన్నారట.

పీవీ గారు మారు పేర్లతో ముఖ్యంగా "కాంగ్రెస్ వర్కర్", "కాంగ్రెస్ మాన్" పేర్లతో సమకాలీన రాజకీయాలపై, నాయకులపై ఎన్నో వ్యాసాలను ప్రముఖ పత్రికలలో రాశారు. రాజీవ్ గాంధీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసినప్పటికీ, ఆయన ప్రభుత్వం పడిపోయిన తరువాత రాజీవ్ గాంధీ తప్పిదాలను, ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోడానికి గల కారణాలను విశ్లేషిస్తూ ఒక వ్యాసాన్ని "కాంగ్రెస్ వర్కర్" పేరుతో 1990 జనవరి నెలలో "మెయిన్ స్ట్రీమ్" పత్రికలో రాశారు.

ఈ వ్యాసంలో ఆయన అయోధ్య సమస్యను పరిష్కరించే విషయంలో రాజీవ్ గాంధీ చేతకానితనాన్ని ఎండగట్టారనీ, బోఫోర్స్ కుంభకోణం విషయంలో రాజీవ్ గాంధీ డబ్బుకు కక్కుర్తి పడివుండకపోవచ్చు కానీ, ఏవో కొన్ని నిజాల్ని, లేదా బాధ్యులైన వారిని దాచిపెట్టాలని ప్రయత్నిస్తున్నట్లుగా ఉందని, పదునైన వ్యాఖ్యలు చేశారు. 1984 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాలుగు వందలకు పైగా స్థానాలు సాధించింది. కాంగ్రెస్ చరిత్రలోనే ఇది అసాధారణ విజయం. దేశ చరిత్రలో మరే పార్టీ ఇంతవరకు ఇంతటి ఘన విజయాన్ని సాధించలేదు. ఇందిరా గాంధీ హత్యానంతరం సానుభూతి పవనాలు వీయడం వల్ల లభించిన విజయమిది. ఇందులో రాజీవ్ గాంధీ గొప్పతనమేమీ లేదు. అయితే, ఈ

విజయంతో కళ్ళు మూసుకుపోయిన అసమర్థ నాయకుడు రాజీవ్ గాంధీ అని ఆ వ్యాసంలో పీవీ వ్యాఖ్యానిస్తూ, అంతటి భారీ మెజారిటీతో గెలిచిన నాయకుడు ఐదేళ్ళలో ఎందుకంత బలహీన పడిపోయాడని, 1989 సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిందని, ఈ ఐదేళ్ళలోనే ఇంత తేడా రావడానికి గల కారణాలను ఈ వ్యాసంలో పీవీ విశ్లేషించారు.

అకాడమిక్ దృష్టితో రాసిన వ్యాసమిది. మెయిన్ స్ట్రీమ్ పత్రికలలో "ది గ్రేట్ సూసైడ్" అనే పేరుతో ప్రచురితమైంది. ఆ తరువాత కాలంలో ''ఫ్రంట్ లైన్'' పత్రిక దీనిని పీవీ వ్యాసమని పునర్ముద్రించింది.

రాజకీయ, సామాజిక, సాంస్కృతిక, సాహిత్య అంశాలపై జాతీయ, అంతర్జాతీయ వేదికల నుంచి పీవీ నరసింహారావు గారు చేసిన అసంఖ్యాకమైన ఉపన్యాసాలు అన్నీ ఆయనకు ఆయా విషయాలపై గల సాధికారికతను సూచిస్తాయి.

### పీవీ గారి హాస్యం

గంభీరసాగరుడు, మౌనముద్రాంకితుడుగా పేరు పడ్డ పీవీ నరసింహారావు గారిలో హాస్యచతురత అపారం. నోరు తెరిస్తే, సున్నితమైన హాస్యం, వ్యంగ్యం, ఛలోక్తులు తొణికిసలాడేవి. తరచిచూస్తే, ఇవి ఆయన ప్రతి రచనలోనూ మనకు దర్శనమిస్తాయి. "ఇన్సైడర్" నవల ఒక వ్యంగ్య, హాస్య రసాత్మకమైన రచన. కాళోజీ నారాయణరావు గారి షష్టిపూర్తికి పీవీ రాసిన కవితలో కూడా ఈ హాస్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది.

### కుంటిదే అయినా ఇంటిది

ఐక్యరాజ్యసమితి పాత్రపైనా, దాని వైఫల్యాలపైనా ఒకసారి పీవీ వ్యాఖ్యానిస్తూ, ఆ సంస్థకు ఎన్ని వైఫల్యాలున్నా, అదే మానవజాతికి ప్రస్తుతం అందుబాటులో వున్న ఏకైక అంతర్జాతీయ సంస్థ అని చెప్పారు. "కుంటిదే అయినా ఇంటిది" అన్న సామెత ఐక్యరాజ్యసమితికి బాగా సరిపోతుందని, ఎప్పటికైనా దాని ఉపయోగం ఉంటుందని నేను నమ్ముతున్నానని ఆయన అన్నారు.

### కాపీ ఇవ్వలేను కానీ కాఫీ ఇస్తాను

పీవీ గారు ప్రధానమంత్రి కావడానికి కొద్దిరోజుల ముందు సీనియర్ జర్నలిస్ట్ శ్రీ బి. నాగేశ్వరరావు కన్నుమూశారు. ఆయనకు నివాళి అర్పించేందుకు ఢిల్లీ నుంచి హైదరాబాద్ బంజారాహిల్స్ లోని జర్నలిస్ట్ కాలనీకి వచ్చిన పీవీ తిరిగి ఢిల్లీకి పయనమవుతుండగా, అక్కడే వున్న పలువురు జర్నలిస్టులు "సార్ ఏదైనా కాపీ ఇవ్వండి (పత్రికా భాషలో వార్త)" అంటూ పీవీ ని చుట్టుముట్టారు. ఆయన నవ్వేసి, "రాజకీయాల నుంచి రిటైర్ అయ్యాను. ఢిల్లీ నుంచి నా పుస్తకాలను హైద్రాబాదుకు షిఫ్ట్ చేసే పనిలో వున్నాను. నేనేం కాపీ ఇవ్వగలను, కాకపోతే మీకు మంచి కాఫీ మాత్రం ఇవ్వగలను" అంటూ చమత్కరించారు. దీనితో అందరూ హాయిగా నవ్వుకున్నారు.

### కుంటి లక్ష్మి

పీవీ గారి వద్ద ఎన్నికల ప్రచారానికి గ్రామాలలో తిరగడానికి ఒక పాత జీపు ఉండేదట. ఆయన దానికి "కుంటి లక్ష్మి" అని పేరు పెట్టారు. మిగతా రోజుల్లో అది వంగరలో వారి ఇంటి ఆవరణలో ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ పడి ఉండేదట. ఎన్నికలు సమీపిస్తుంటే "ఆ కుంటి లక్ష్మిని బయటకు తీసి బాగు చేయించండి, ఎలక్షన్లకు అదే గతి" అని ఛలోక్తి విసిరేవారట.

### ప్రయాణాలలో పాటలు, పద్యాలు

పీవీకి శాస్త్రీయ సంగీతమంటే మక్కువ. రాగ, తాళ గతులను గుర్తించేవారు. బాల్యం నుంచే పద్యాలను, పాటలను శ్రావ్యంగా పాడేవారు. త్యాగరాజ కృతులు, జావళీలు అంటే మహా ఇష్టం. ఏ కొంచెం విరామ సమయం దొరికినా కూనిరాగాలు తీసేవారు. 1952లో ఒకసారి ఢిల్లీకి స్నేహితులతో రైలులో ప్రయాణిస్తూ, ఆ రెండు రోజుల ప్రయాణంలో పాటలను, పద్యాలను రాగయుక్తంగా పాడి, తన సంగీత పాటవాన్ని ప్రదర్శించి, పీవీ అందరి ప్రశంసలూ పొందారు.

### మన బృహస్పతి ఎక్కడ

పీవీ కార్యదక్షుడు. ఏ పనైనా చక్కగా అరమరికలు లేకుండా పూర్తిచేసేవారు. ఏ అంశాన్నైనా క్షుణ్ణంగా అధ్యయనం చేసి, సరైన సలహా ఇచ్చేవారు. అందువల్లే ఆయన అచిరకాలంలోనే మహానాయకుల సాన్నిహిత్యాన్ని పొందగలిగారు. రాజకీయ గురువైన రామానందతీర్థ, స్టేట్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన వ్యవహారాలన్నీ పీవీ కే అప్పగించారు. అసెంబ్లీలో అడుగుపెట్టాక, పీవీ చురుకుదనం గమనించి అప్పటి స్పీకర్ అయ్యదేవర కాళేశ్వరరావు గారు కీలక ప్రతులు, చట్టాల రూపకల్పన బాధ్యత పీవీకి అప్పగించారు.

ఒకసారి సమావేశానికి కాంగ్రెస్ పెద్దలందరూ హాజరయ్యారు కానీ పీవీ ఇంకా చేరుకోలేదు. అప్పటి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు గారు "అయ్యో! ఎక్కడ మన బృహస్పతి, ఇంకా రాలేదు?" అని అక్కడున్నవారిని అడగటం పీవీ ప్రాధాన్యతను తెలియజేస్తుంది. కాసు బ్రహ్మానందరెడ్డిగారు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా అన్నిరాత కోతలకు ఆయన పీవీ మీదనే ఆధారపడేవారట. ఆయన కూడా పీవీని ''బృహస్పతి'' అనే సంబోధించడం విశేషం.

శ్రీమతి ఇందిరా గాంధీ ప్రధానమంత్రిగా వున్నా లేకపోయినా, ఆమెకు ఏ సమస్య వచ్చినా అర్థరాత్రి అని కూడా చూడక పీవీ ఇంటికి వెళ్ళేవారట. ఆయనతో కూర్చుని సుదీర్ఘంగా మంతనాలు జరిపేవారట. ఆమె పీవీ గారిని అంతగా నమ్మకంలోకి తీసుకున్నారు. అది కేవలం పీవీ గారి ప్రతిభను, దక్షతను మాత్రమే కాక, ఆయన విశ్వసనీయతను కూడా సూచిస్తుంది.

తెలుగు సాహిత్యం పై పీవీ గారికి అమితమైన గౌరవం. ఆయన ఒకసారి 20వ శతాబ్దపు సాహిత్యం గురించి ప్రస్తావిస్తూ, ప్రపంచ సాహిత్యంతో సరితూగగల తెలుగు సాహిత్య సంపద ఎంతో ఉందన్నారు. దీన్ని పరిరక్షించుకోవాలన్నారు. మంచి సాహిత్యాన్ని ఎంత మాత్రం పోగొట్టుకోకూడదని, దాన్ని భద్రపర్చుకోవడంతో పాటు, ఆత్మ చెడకుండా ఇతర భాషల్లోకి తర్జుమా చేయాలి. ఏ భాషా సాహిత్యమైనా ఆ జాతి సంస్కృతి, నాగరికతకు మూలకందం. సాహిత్యానికి ఆది, అంతం అంటూ లేదు. ప్రజలకు సమాంతరంగా సాహిత్యం ఉత్పత్తి అవుతుంది. ఆయా కాలాల్లో ప్రజలు, పాలకుల అభీష్టం మేరకు రచనలు వచ్చాయి. ప్రక్రియ సైతం ప్రజలు కోరిందే ఉంటుంది అన్నది పీవీ అభిప్రాయం.

మన దేశంలో కవిత్వం, కవితా పద్ధతులు, శైలి రకరకాలుగా ప్రవహించాయి. చిత్రకవిత్వపు పాయ మాత్రం తెలుగుకే

ప్రత్యేకమైంది. హిందీ, మరాఠీ, బెంగాలీ తదితర భాషా పండితులు, కవులు అనేక మందితో తాను మాట్లాడినప్పుడు మన అవధానం, చిత్ర కవిత్వం పట్ల వారు విస్మయం వ్యక్తం చేశారని పీవీ పేర్కొన్నారు.

ఎక్కడైనా శ్లేష, శ్లేష తరువాత శ్లేష రెండు పదాల్లో వస్తే, అది సాహితీ కౌశల్యానికి పరాకాష్టగా వారు అభివర్ణిస్తారు. ఉత్తర భారత భాషల్లో భావానికి ప్రాధాన్యం ఎక్కువగా ఇస్తారు. భాషా పాండిత్యం తక్కువ. అనేక సందర్భాలలో యతి, ప్రాసలు తదితర వ్యాకరణ సంబంధమైన పొరపాట్లు వున్నా, భాషాదోషాలను పట్టించుకోకుండా రసగ్రహణం, భావం మాత్రం చూస్తారు. అదే తెలుగు గడ్డపై "రాఘవ పాండవీయం" లాంటి ఒక కావ్యంలో ప్రతి పద్యాన్ని రామాయణ, భారతాలకు అన్వయిస్తూ చెప్పడం మరే భాషలోలేని అపురూపసంపద అని పీవీ నరసింహారావు గారు పరిశీలనాత్మక దృష్టితో వింగడించారు. పూర్వకాలంలో మన దగ్గర యుద్ధాలు జరగని సందర్భాలలో రాజులు తీరికగా కూర్చుని, ఒక వంక వారు రాస్తూ మరో వంక మహాకవులైన వారు విశేష రచనలు చేయడానికి దోహదం చేశారని కూడా ఆయన సింహావలోకనం చేశారు.

ప్రపంచ వాఙ్మయ చరిత్రలో మరే భాషలో కూడా లేని అవధాన ప్రక్రియ తెలుగు భాషకే సొంతమని, దానిని ఒక శాస్త్రంగా, ఒక కళగా అభివృద్ధి చేసి, అది అంతరించిపోకుండా ముందు తరాలకు అందించాలని ఆయన సూచించారు. అవధానంలో పాండిత్యంతో పాటు శబ్దాధిపత్యం ప్రధానం. అది లేకపోతే కవి రాణించడు. సుమారు మూడు, నాలుగు వందల సంవత్సరాలుగా తెలుగు నేలపై భాషాకోవిదులు, పండితులు, కవులు అభివృద్ధి చేసిన ఈ అవధాన ప్రక్రియకు ఇంకా ప్రాముఖ్యత లభించే విధంగా మెరుగులు దిద్ది అందరికీ రసాస్వాదనీయంగా పునరుద్ధరించాలని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రధానమంత్రిగా వున్నప్పుడు ఆయన తన పనితీరును అవధానంతో పోల్చారు. అవధానానికి ఒకరు సమస్యాపూరణమిస్తే, మరొకరు అప్రస్తుత ప్రసంగంలోకి లాగుతారు. మరొకరు గంట కొట్టి దృష్టి, ధ్యాస మళ్ళిస్తారు, ఇంకొకరు నిషిద్ధాక్షరి ఇస్తారు. ఈ పద్ధతిలోనే తాను పార్లమెంట్ లో ప్రశ్నోత్తరాల సమయంలో చేసేది అవధానమే అన్నారు పీవీ. సభ్యులు వేసిన అడ్డదిడ్డమైన ప్రశ్నలకు సరైన జవాబులను చమత్కారంగా చెప్పవలసి ఉంటుంది. చెప్పే జవాబు – ప్రశ్న ఎంత తెలివి తక్కువగా వుంది, అని ధ్వనించే లాగా ఉండాలంటే, తమకు ఎంతో సాధన అవసరమని ఆయన అన్నారు. అవధాన విద్యలో పాండిత్యం, భాషాజ్ఞానం, చమత్కారం ఒక పార్శ్వమైనప్పటికీ, అందులో జ్ఞాపకశక్తి ప్రధానమైనది.

కంప్యూటర్ లో చదరంగం ఆడే పద్ధతి వ్యాప్తిలోకి వచ్చినట్టుగానే, అవధాన ప్రక్రియ సైతం కంప్యూటర్ల ద్వారా చేసే విశేష ప్రక్రియగా రూపొందాలని శ్రీ పీవీ నరసింహారావు గారు అన్నారు.

లోకంలో ఏకసంథాగ్రాహులు, ద్విసంథాగ్రాహులు ఉంటారు. చిన్నతనంలో పీవీ. నరసింహారావుగారు ఏకసంథాగ్రాహిగా గణుతి కెక్కారు. ఏ అంశమైనా ఒక్కసారి చదివితే ఆయనకు కంఠతా వచ్చేది. అయితే వయసు పెరగడం ప్రకృతి సహజమైన అంశమైనా, తాను నిర్వహించిన పదవుల రీత్యా ఎటు చూసినా ప్రశ్నలే. ఎన్నింటికి సమాధానాలు చెప్పినా ప్రశ్నల పరంపర సంధానం నిరంతరంగా సాగుతున్నది. ప్రతి మనిషీ ఒక పృచ్ఛకుడైనాడు. అందుచేత, ఈ ప్రశ్నల కలగూరగంప తన జ్ఞాపకశక్తికి అడ్డం వస్తున్నది. ఈ నేపథ్యంలో, లోగడ మాదిరిగా ఒకసారి కాదుకదా, ఇరవై సార్లు చదివినా ప్రస్తుతం జ్ఞాపకం ఉండడంలేదని పీవీ గారు విచారం వ్యక్తం చేసారు. అయితే ఈ జ్ఞాపకశక్తిని పెంచుకోడానికి శిక్షణ కావాలన్నారు.

ఆయన ఎంత సంప్రదాయవాదో, అంత ఆధునిక దృష్టి కలవాడు. కంప్యూటర్ల వాడకం తప్పనిసరి అని కూడా ఆయన నొక్కిచెప్పేవారు. అయితే కంప్యూటర్లకు ప్రాణం కానీ, మేధ కానీ వుండవు కదా? కాబట్టి సాంకేతికంగా ఎంత ప్రగతి సాధించినా మనిషికి కంప్యూటర్ ప్రత్యామ్నాయం కాబోదని ఆయన పదేపదే చెప్పేవారు. అనేక యంత్రాలు, సాంకేతిక అభివృద్ధికి మనిషే జనకుడు. ఈ సాధన సామగ్రి అంతా మనిషికి సేవకులు. కంప్యూటర్లు మంచి సేవకులుగా వాటితో మంచి సంబంధాలు ఉండాలి తప్ప, మనిషే వాటికి వశమైతే ప్రపంచం నిలవదని ఆయన హెచ్చరించేవారు.

అలనాడెప్పుడో వాల్మీకి, వ్యాసుడు ప్రభృతులు చేసిన రచనల తాళపత్ర ప్రతులు అందరికీ అందుబాటులో వుండేవి కావు. ప్రింటింగ్ సౌకర్యం వచ్చిన తరువాత, ఇతిహాసాలు మాత్రమే కాక ఇతర సాహిత్యాన్నంతా గ్రంథాల రూపేణా తెచ్చారు. ఇవాళ కంప్యూటర్లు వచ్చాయి. ఇంటర్నెట్ వచ్చింది. సమాచార సేకరణ ఎంతో సులభమైంది. అంత మాత్రాన పుస్తకాలు ప్రచురించకూడదనే అభిప్రాయానికి రాకూడదని, తిరిగి పుస్తకాలను గుర్తించే రోజులు వస్తాయని పీవీ ఆశాభావం వ్యక్తం చేసేవారు. ఇంటర్నెట్ ను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలన్నారు. నెట్ లో పొందుపరచిన అంశమే అందరికీ అందుబాటులో ఉంటుంది తప్ప, అది మనిషిలాగ కొత్త రచనలు చేయదనే సత్యాన్ని గ్రహించాలన్నారు.

భారతదేశానికి ఇంతటి మహామేధావి ప్రధానమంత్రి కావడం ఈ దేశప్రజలు చేసుకున్న అదృష్టం. ఇంతటి ప్రతిభామూర్తి భారత రాజకీయాలలో అరుదు.

"తాను పుట్టిన గ్రామం ఈ తెలుగు నేలపైనే వున్నది. ఈ గడ్డమీదనే ఓనమాలు దిద్దుకున్నాను. ఈ నేలపైనే దేశసేవ చేస్తూ, తొలి అడుగులు వేశాను. ఆప్తమిత్రులు, బంధువులు ఇక్కడే వున్నారు. ఇది భిన్న సంస్కృతులు ఎదిగి పూచిన చోటు. ఇక్కడే నా మూలాలున్నాయి", అంటూ ఆత్మావిష్కారం చేశారు పీవీ. ఆయన ఒక పరిణత మనస్వి.

## మీ స్పందనను తెలియజేయండి

**'అమ్మనుడి'**లో రచనలలోని అంశాలపై
మీ స్పందనను క్లుప్తంగా తెలియజేయండి.

సంపాదకుడు **'అమ్మనుడి'**
జి–2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల
వీధి, మాచవరం, విజయవాడ–520 004.

ఇ–మెయిల్ : *editorammanudi@gmail.com*

డా॥ పి. శివరామకృష్ణ 'శక్తి'
94414 27977

# కనుమరుగౌతున్న అమ్మ, అమ్మనుడి జ్ఞాపకాలు-ఆఫ్రికా నేర్పే గుణపాఠాలు

## అమ్మనుడిలో ఎదుగుతున్న నుడికారం, పదసంపద..

**లె**క్కల మాస్టారి కోణాలు, డిగ్రీల పాఠం (గిరిజన) విద్యార్థికి ఎక్కలేదు. గిరిజనుడి విల్లు కోణమానిని లాగా 180 డిగ్రీలలో ఉంటుంది. బాణం లంబకోణంలో 90 డిగ్రీలలో సంధిస్తాడు. సూర్యుడు నడినెత్తికి వస్తే లంబకోణం. ఇదే తాపీ మేస్త్రీ కుటుంబం నుండి వచ్చే పిల్లవాడికి, మూలమట్టం, సారామట్టం, వడబంలతో పోలిస్తే అర్థమోతుంది.. ఇలాగే ప్రతి వృత్తికి లెక్కలు, కొలతలు, పరికరాలు ఉన్నాయి.. పనివాళ్ళందరూ లీవర్ (మోపుతో బరువు లేపటం), ట్రిగ్గర్ (అల్లెతాడు సాగదీసి బాణం వేయటం, ఇదికూడా రెండు రకాలు బారతీపు- లాంగ్ షాట్, బొక్కతీపు- కట్ కొట్టటం) తరణి పట్టటం (చక్రం), గాలి తిత్తి(బ్లోయర్) టెక్నిక్స్ వాడుతుంటారు. వాటి మీద రూపొందిన వాయిద్యాలు కూడా ఉన్నాయి. సులువుకు సహకరించేలయగల పాటలు, హైలెస్సా, జంబయ్ జో జోదు లంగరు పాడుతుంటారు. ఆ లయకు పురిపెట్టే ఆటలు ఉన్నాయి. ఇవన్నీ తరతరాలుగా వస్తున్నవే. ఎద్దు, ఏనుగు, గుర్రం, ఇంధనం, ఇలా శక్తి మారుతుంది. కొత్త కొత్త పనిముట్లు దిగుమతి అవుతాయి. వీటికి తగ్గట్లు పదాలు కూడా అతుకు వేసుకుంటున్నారు.

కుట్టు మిషన్, మిషన్ కుట్టు; రుబ్బింగ్ మిషన్, వాషింగ్ మిషన్; వాయల్ చీర, సిల్కుచీర; రవ్వల నెక్లెస్, కలవర్ నెక్లెస్, అపోలో నెక్లెస్;

వ్యవసాయంలో దుక్కి మసాలా, దుక్కి ఎరువు, దుక్కి పిండి. దుక్కి మందు డబల్ కాట్ మంచం, రైస్ అన్నం, బ్యాండ్ మేళం, స్టోరు బియ్యం, నూనె మిల్లు, రైస్ మిల్లు, పెద్ద సారు; డౌట్ అనుమానం, చివరాఖరు, ఆడ లేడీస్; గ్యాస్ బండ, గ్యాస్ లైటు, ఇంగ్లీష్ వైద్యం, మిషన్ ఆస్పత్రి, ధర్మాసుపత్రి, పెద్ద ఆపరేషన్, రైలుబండి, పాలవాన్, పాల కేన్, పాల మీటరు, డాల్డా నెయ్యి. నూనె మిల్లు, బెండకాయ స్విచ్, గొడుగు లైటు, బిళ్ళ బంట్రోతు, బుగ్గకారు, పొగాకు బారన్, లైను పిల్ల, స్టోరుబియ్యం. మిరపకాయ టపా, అప్పుల తహసిల్దార్, గుద్దుల బ్యాంకు, ట్రైబల్ కలెక్టర్, ఏజెంట్ కోర్టు, కూపీ గుమస్తా, ఉప్మా బడి (అంగన్ వాడి), ఆశ్రమ స్కూలు, జంగల్ పట్టీ, లావని పట్టా, చెకింగ్ కాటా. ఉపాధి కూలి, లైటు కొట్టటం, లైనేయటం, ఎక్రాలు, ఎర్త్ పెట్టటం, షాక్ కొట్టటం,

ప్రజల నుడికారం సమిష్టి చేతనను మీటి ఉత్సాహాన్ని పెంచటానికి ఉద్యమం కావటానికి ఉత్తరాంధ్రలో 'బీల, తంపర' భూములు థర్మల్ పవర్ స్టేషన్‌కు అప్పచెప్పటాన్ని ఎదిరించటం ఉదాహరణ. జీవ వైవిధ్యచట్టం ఈ భూముల పర్యావరణ ప్రాముఖ్యం గుర్తించి వాటిని ఫ్యాక్టరీకి ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేసింది.

సరిహద్దులు, కొండగుర్తులు, ఇరుగు పొరుగు వాళ్ళు వీటితో స్థలాలను, పొలాలను చెపుతారు. ఇటువంటి సంప్రదాయ పద్ధతిలో పటంగీసి పట్టాకోసం దరఖాస్తు చేయవలసిందిగా అటవీ హక్కుల గుర్తింపు చట్టం చెపుతుంది. సర్వేక్షణ పటాలలో, జి.ఐ.యస్‌లో ఉహాజనితమైన అక్షాంశ రేఖాంశాలను కర్కాటక, మకర రేఖలలో గుర్తిస్తే, జనం స్థలవాచకాలతో గుర్తిస్తారు. ప్రతి వనరుకు ఒక ఉహాజనితమైన అధిదేవత ఉంటుంది.

ఇలా స్థలవాచకాలు, వనరులు, ఋతువులు, పనిముట్లు, అవి వాడే ప్రజల సాహిత్యం సనాతనం. ఉన్నది కాగ్నిషన్, దాన్ని గుర్తించటం రికగ్నిషన్. విద్యార్థి, అతడి కుటుంబ వృత్తి నేపధ్యం కాగ్నిషన్. దాన్ని గుర్తించటం రికగ్నిషన్. కొత్త వస్తువులను పాతపదాలకు జోడించి/ అంటుగట్టి ప్రజలు వాడుకలోకి తెస్తారు. **ఈ సృజనాత్మకత ఉన్న సమాజం, మార్పుకు తగ్గట్టు తనను మార్చుకోగల సమాజం బతికి ఉంటుంది. ఈ శక్తి క్షీణిస్తున్న సమాజం బానిసత్వంలోకి పోతుంది. కొత్త వస్తువులు, శాస్త్రం జనసామాన్యం సొంతం చేసుకుంటున్న పద్ధతి గుర్తించకుండా, కొత్తవి సృష్టించాలి అంటూ శిష్టులు ఉన్నవాటిని కనుమరుగు చేస్తున్నారు. అటువంటి అతితెలివిని ఎండగట్టాలి. తెల్లవాళ్ళతో పాటు, వాళ్ళ చదువు,వాళ్ళ సాహిత్య రూపాలను ఈ శిష్టులు ఒడిసి పట్టుకున్నారు. గుర్తింపు పొందసాగారు. భావదాస్యపు బానిస ధోరణులను బలపరిచారు.** అందుకు దారితీసిన చరిత్రను ఒకసారి గుర్తుచేయటం అవసరం.

### సాహిత్యంలో ఉత్పత్తి సంబంధాలు- గిరిజన రైతాంగ పోరాటాలు

తెల్లవాళ్ళకు, తూర్పుతీరంలో రాజులు లొంగారు కాని, వారితో రకరకాల చుట్టరికాలుగల తూర్పుకనుమలలో గిరిజనులు లొంగలేదు. గిరిజనులు, పితూరీ మీద పితూరీ చేస్తుంటే, ఎదురుదెబ్బలు తిన్న తెల్లవాళ్ళు, నరబలి మాన్పించటం పేర సాయుధ సంస్కరణలకు పూనుకున్నారు.

ఈ సంస్కరణల కోసం అనాదిగా మనపద్ధతిలో మనం ప్రయత్నం చేస్తూనే వచ్చాము. నరబలి బదులు, దున్నపోతులు, గుమ్మడి కాయలు; మోదకొండమ్మ వంటి దేవతల కథాగానం; విధవా వివాహాన్ని ఆచరణలో చూపిస్తూ, వేదాలు పదుగురి కోసం తెలుగుచేసి బంకుపల్లి మల్లయ్య శాస్త్రి వంటివారు పరితపిస్తే, పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో కొందరు తెల్లప్రభుత్వం అండదండలతో ఈ మార్పును

వేగిరపరచవచ్చునని భావించారు.

తెల్లవారి బలప్రయోగానికి, క్రమంగా వాళ్ళు తెస్తున్నమార్పులకు 'కల్లలాడరు ఇంగిరీజులు' అంటూ వారిని 'సంఘసంస్కరణ పతాకలు' గా కీర్తించే గురజాడ వంటి బుద్ధిజీవుల మద్దతుకూడా దొరికింది. ఈ మద్దతు వెనుక విజయనగరం సంస్థానం ఆధిపత్య ధోరణులకు ఎదురుతిరుగుతున్న గిరిజనుల మీద, వారి సంస్కృతి మీద, వారి పాలకుల మీద తిరస్కరభావం కూడా ఉండవచ్చు. అప్పటి నుండి గిరిజనులను అజ్ఞానులుగా అడవి మనుషులుగా చిత్రిస్తూ, జాలి ఒలకబోయ సాగారు. ఇలా వలస ప్రభుత్వం మనను బానిసత్వపు బందిలిదొడ్డిలోకి తోలటం వల్ల వస్తున్న దుష్పరిణామాలను, చిలకమర్తి, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మ, ప్రకాశం పంతులు హెచ్చరిస్తూనే ఉన్నారు.

తెల్లవాడి పరిచయంతో వాళ్ళ లిఖిత సాహిత్య ప్రక్రియలు నవల, కథ కవితల వంటి కొత్త ప్రక్రియల ఉత్పత్తి, అక్షరాస్యత పెరిగిన కొద్దీ పాఠకులు పెరిగారు. సమాజం చదువుకొన్న, లేని వాళ్ళుగా విడిపోయింది. ఇటువంటి తరుణంలో గిడుగు సవరలను అర్థం చేసుకోడానికి ప్రయత్నించారుకాని, ఒరిస్సా రాష్ట్ర విభజనకు బాధపడిన ఆయన రాజమహేంద్రికి తరలి పోవటంతో అటువంటి ప్రయత్నాలు ఆగిపోయాయి. ఆయన వ్యావహారిక భాషోద్యమం, మాండలికాన్ని తోసిరాజని లిఖిత సాహిత్యానికి ప్రోత్సాహమిచ్చింది. ఒక మిథ్యాప్రామాణిక భాష బలపడింది.

ఒక పక్క శిష్టవర్గం కవిత్వం పిచ్చి పెంచుతుంటే ,ప్రజలు మరింత అజ్ఞానంలో కూరుకుపోసాగారు. గురజాడ, రావిశాస్త్రి, కారా, చాసో, వంగపండు, గద్దర్, వీళ్ళంతా ఇలా చదువుకున్న వాళ్ళను, జన సామాన్యానికి కావలసిన చదువు, వ్యవహార జ్ఞానం నుండి కవిత్వం, కళల వైపు మళ్ళించారు. మసాలా, ఉద్యమ సాహిత్యాలు పెరిగిపోయాయి. సంఘాలు



కెన్యా రచయిత, మాతృభాషోద్యమకారుడు 'గూగీ వా థియాంగో'

పెట్టుకుని సిండికేట్ అయ్యారు. రావిశాస్త్రి మరో వెన్నెలకంటి రాఘవయ్య కాలేకపోయారు సరే. న్యాయవాది అయిన ఆయన వ్యవహార జ్ఞానం లోపించిన రచనలను గాడిలో పెట్టలేక పోయారు.

ఇక, గిరిజన ప్రాంతాలలో పనిచేసి 'నెల నెలా వెన్నెల', 'సంతోష చంద్రశాలలు' 'చదువు కొత్తలు' నడిపిన శిష్ట సాహిత్యవేత్తల యాత్రా సాహిత్యాలలో, రచనలలో జపాన్ హైకూలు, బషో కవిత్వాలు తప్ప, అక్కడ వెన్నెల బయళ్ళలో చూడదగిన చుక్కలు, ఆటలు, పాటలు కనిపించవు. గిరిజన ప్రాంతంలోని తన స్వగ్రామంలో అమ్మ కొలిచే దేవత జాకరమ్మ గుర్తుందిగాని (కోకిల ప్రవేశించే కాలం) , తమ అభిమాన రచన ఒడియా నవల అనువాదం 'అమృత సంతానం'లో ప్రతీ అధ్యాయంలో వచ్చే ఆ దేవత, ఆ దేవతకు చేసే కొత్రకొత్త పండుగ సందడిని వర్ణించిన రచన 'ఆదివాసీ పండుగలు' (పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ)లో వివరాలు, తాను నడిచిన దారులలో గిరిజనుల దేశకాలాలు, వారి చరిత్ర జాడలు తెలుసుకోవాలని తోచలేదు.

ప్రజలు తమ సాహిత్యాన్ని తాము అల్లుకోకుండా, రచయితల వైపు చూడసాగారు. తమ విత్తనాలు, ఎరువులు, తాము తయారు చేసుకోకుండా, కంపెనీల మీద ఆధారపడసాగారు.

కెన్యాలో, 1960లలో, తన ముందే చోటుచేసుకున్న ఇటువంటి పరిణామాలను ప్రసిద్ధ రచయిత గూగీ వా థియాంగో 'బందీ' (స్వేచ్ఛా సాహితి)లో ఇలా వర్ణిస్తాడు. *స్థిరపడిన వలసవాదులు ఉత్పత్తి చేసిందేమీలేదు. కళలేదు. సాహిత్యం లేదు. సంస్కృతి లేదు. గిలికింది యాత్రా గైడ్‌లు మాత్రమే ..... పేర్లు, మెరిసే అట్టలు తప్ప వాటిలో ఉన్నదంతా శూన్యమే...వాళ్ళ నాటకరంగం....మోటు అనుకరణ తప్ప మరేమీ కాదు. ఒక చిన్న సామ్రాజ్యాన్ని తయారు చేసుకున్నారు'* (పుట57). వీటిని ఎండగడుతూ అతడు తన మాతృభాష 'గికుయు'లో రాసి వేయించిన నాటకం వల్ల అతడు జైలు పాలవుతాడు. కాని, క్రమంగా ఆ ఉద్యమం *'ప్రజల భాష నేర్చుకోండి– మీ సంస్కృతిలో ఉత్తమమైన దానిని ప్రబోధించండి. ఆఫ్రికన్ సంస్కృతిలో ఉత్తమమైన దానిని నేర్చుకోండి. ఇదే మన విముక్తి మార్గం. ఇందులోనే మనకు గమ్యం ఉంది(140)'* అని 1951లోనే ఉద్బోధించిన భారత జాతీయుడు మాకెన్ సింగ్ నుండి స్ఫూర్తి పొందింది. క్రమంగా ప్రపంచం కీర్తించే రచయితలు, కళాకారులు, క్రీడాకారులు ఆఫ్రికానించి వస్తుంటే, మనవాళ్ళు రిజర్వేషన్లతో తృప్తిపడుతున్నారు. మన ఇంగ్లీష్ పంతుళ్ళు, ఆఫ్రికన్ రచయితలు చినువా అచ్బే, సోలె వోయింకా, గూగీ, చిమమండ రచనలు మనకు ఏం గుణపాఠాలు నేర్పుతాయో చూడకుండా ఉన్నది ఉన్నట్లు అప్పచెపుతున్నారు. మన మేధావులు యధాతథంగా అనువదిస్తున్నారు. సంతోష

**తరువాయి 34 వ పుటలో.......**

-వాచస్పతి

# పదనిష్పాదనకళ 3

(గత సంచిక తరువాయి...)

*The joy of coining new words!*

**వ్యా**వహారికం అంటే అర్థం – ఆంగ్ల మాధ్యమ జనాల సంకుచిత అవగాహనకి అనుగుణంగా యావత్తు తెలుగుభాషనీ అంతం చేయడం కాదు. ఈమాత్రం ఆంగ్ల మాధ్యమం గిడుగువారి కాలంలో కూడా ఉంది. జనానికి అర్థం కావడం అంటే కొత్తపదాల్ని సృష్టించకూడదని కాదు. అర్థమవుతున్న భాషలోనే కొత్త పరిభావనల్నీ, తత్సంబంధిత పదాల్ని మిశ్రమం చేయడమని !

**ఇంకో కోణం : అచ్చతెలుగువాదం**

ఇదిలా ఉండగా, ఆర్య-ద్రావిడ జాతివాదాల్ని గ్రుడ్డిగా నమ్మేవారు కొందఱున్నారు. అలా నమ్ముతూ, వేలాది సంవత్సరాలుగా ఈ దేశపు శాస్త్రీయ చింతనాధారని పరిపుష్టం కావించిన సంస్కృతాన్ని వారు పరాయిభాషగా పరిగణిస్తారు. ప్రతిదీ అచ్చతెలుగులోనో, తెలుగు మాండలికాల్లోనో, పచ్చి వ్యావహారికంలోనో ఉండాలని వారంటారు. ఈ వాదాన్ని కూడా యథాతథంగా ఆమోదించడం కష్టం. ఎందుకంటే ఇప్పటిదాకా నడిచిన చరిత్రని రద్దుచేసి పారెయ్యలేం. ఇప్పటికే భాష లోకి వచ్చిన పదాల్నీ, సంప్రదాయాల్ని వెళ్ళగొట్టలేం. ఎట్టి పరిస్థితుల్లోను కాలం వెనక్కి నడవదు. భాషను అభివృద్ధి చేసుకోవాలి. తప్పదు. కానీ ఆ క్రమంలో ఇలాంటి హఠాన్ నాటకీయ పరిణామాలు మట్టుకు ఎంతమాత్రమూ పనికిరావు. అలాంటి వాటికి దిగితే మనం యావత్తు తెలుగు సాంస్కృతిక వారసత్వాన్ని తరువాతి తరాలకు అర్థం కాకుండా చేసిన వారమౌతాం. పాత తెలుగు పుస్తకాలూ, పాటలూ, పద్యాలూ, కథలూ తరువాతి తరాలకు అర్థం కావాలి. అలా అర్థమయ్యేలా మన విద్యావిధానమూ మనం రూపొందించే పదాలూ ఉండాలి. మన విద్యావిధానం గతానికీ భవిష్యానికి వారధిగా పనిచేయాలి. **సంస్కృతాన్ని పరాయిభాషగా చూసే ధోరణి సమీచీనం కాదు. అది పూర్తి అవాస్తవికమైనది. దాన్నొక ఊహాలోకంగా అభివర్ణించడానికి నేను సంకోచించను. సంస్కృతం తెలుక్కి కన్నతల్లి కాకపోవచ్చు గాని పెంపుడుతల్లి మాత్రం అవును. సవతితల్లి మట్టుకు కానే కాదు.** మన జనాభాలో అత్యధిక సంఖ్యాకులు హిందువులు. ముస్లిములకి అరబ్బీ ఎంతటి పవిత్రభాషో హిందువులకు సంస్కృతం కూడా అలాంటిదే. వారికి సంస్కృత సంపర్కం అత్యంత సహజమైనది. వారికి ఆ భాషతో దైనందిన అవసరాలు ఉన్నాయని మఱువరాదు.

1. 'అర్థం కావడం' ఒక్కటే మన కృషికి కొలబద్ద కాకూడదు. భాషా సాహిత్యాలనేవి ఏ యుగంలోనూ ఆ కొలబద్ద ననుసరించి వర్ధిల్లినవి కావు. ఇంగ్లీషులో సైతం నూటికి 99 పదాలు అది మాతృభాషగా గలవారిక్కూడా అర్థం కావు. అంత మాత్రాన ఆ భాషలో కొత్త పదాల సృష్టి ఆగిపోలేదు. ప్రతి కొత్త ప్రచురణ నాటికీ ఆంగ్ల నిఘంటువుల రాశి పెఱక్కుండా పూర్వపరిమాణం దగ్గరే స్తంభించిపోవట్లేదు. ఇప్పుడు అర్థమౌతున్న పదాలు కూడా గాల్లో తేలునో, కలలోనో జనం దగ్గఱికి రాలేదు. ఈ అర్థం కావడం వెనుక కొంత ప్రయత్నం ఉంది. కొంత శిక్షణ ఉంది. కొంత ప్రచార ప్రక్రియ ఉంది. ఉండాలి కూడా.

2. అర్థం కావడం అనేది – ఒకఱు ఏ సామాజిక నేపథ్యం నుంచి వచ్చారు? ఏ వృత్తి, వ్యాపార రంగానికి చెందిన వారు ? ఎంతవఱకు చదువుకున్నారు? ఏ విధమైన అభిరుచి గలవారు? మొదలైన అనేక విషయాలపై ఆధారపడి ఉంటుంది. అందుచేత అర్థం కాకపోవడం అనేది ఆ అర్థం కానివారి లోపమే తప్ప పదప్రయోగంలోని లోపం కాదు.

3. కొత్త పదాలు కల్పించడాన్ని ప్రోత్సహిస్తున్నట్లే కొత్త పదాలు నేర్చుకోమని కూడా ప్రోత్సహించాలి.

4. **భాషలో పదాలు ఎల్లప్పుడూ అంతకు ముందున్న పదాల నుంచే పరిణామం చెందుతాయి. లేనిది ఎక్కణ్ణుంచీ రాదు. పదం మీద పదం పేఱుకుంటూ (pile up) పోతుంది. అయితే పేర్చేవారు కావాలి. ఆ పేర్చేవారికి అంతకు ముందు పేర్చబడ్డ పదాలూ, అవి పేఱుకున్న విధానం తెలిసి ఉండాలి. అలా తెలిసినవారు ఎంత ఎక్కువమంది ఉంటే అంత తొందఱగా భాష అభివృద్ధి చెందుతుంది.**

5. ఇప్పుడు ఇంగ్లీషులో ఉన్న సాంకేతిక పదాలు కూడా మొదట్లో వాడినప్పుడు ఎవఱికీ అర్థం కాని పదాలే. వ్యకాలు (వ్యక్తిగత కలనయంత్రాలు అంటే PC లు) జనం చేతుల్లోకి రాకముందు ఒక పాతికేళ్ళ క్రితం Hard disk అనేది సాధారణ ఆంగ్లేయులక్కూడా హాస్యాస్పదమైన పదమే. **మనం కోరుతున్నదల్లా "తెలుగు అనువాదాలన్నీ హాస్యాస్పదమై నవే" అనే ఈ మూఢ విశ్వాసం నుంచి బయటపడమనీ, తెలుగుపదాల్ని కూడా ఇంగ్లీషులాగానే ప్రేమించమనీ ! కొత్త తెలుగుపదాల్ని వాడుతున్న కొద్దీ నవ్వురావడం మానేసి గౌరవభావం కలగడం మొదలవుతుంది. సృష్టిస్తున్నకొద్దీ, వాడు తున్నకొద్దీ తెలుగు పదాల క్రమబద్ధతనీ, నిర్మాణాన్నీ జనం ఆస్వాదించడం మొదలుపెడతారు. తెలుగులో కూడా గౌరవ నీయమైన పదజాలం (vocabulary) విస్తారంగా ఉంది. దాన్ని ఉపయోగించుకోవాలి. భాష యొక్క మౌలిక స్వభావాన్నీ స్వాతంత్ర్యాన్నీ నిలబెట్టాలి.** మన భావదారిద్ర్యానికీ మాతృభాషా పరమైన అజ్ఞానానికీ ఇంగ్లీషు పదాలతో అతుకు వేసుకున్నంత మాత్రాన గౌరవం పొందుతామనుకోవడం ఒక భ్రమ. ఆ సదరు "గౌరవనీయ పదాలు" కూడా మళ్ళీ మళ్ళీ అందఱూ వాడడం మూలాన కేవలం ఒక్క తరంలోనే అగౌరవనీయాలవుతాయి. అప్పుడు మళ్ళీ మన గౌరవనీయ పదాల వేట యథామామూలే. గతంలో ఎన్నోసార్లు అలా జఱిగింది.

6. **స్వకీయత (originality) ద్వారానే ఏ జాతైనా గౌరవాన్ని పొందుతుంది. ఆంగ్ల పదాలు ఆంగ్లేయుల స్వకీయతకి నిదర్శనం. మఱి ఒక స్వతంత్ర, విభిన్నజాతిగా మన స్వకీయత సంగతేంటి?** భావాలతోపాటు పదాల్ని కూడా అనుకరించి తీఱాల్సిందేనా? అలా అనుకొని ప్రత్యామ్నాయ తెలుగుపదాల్ని సృష్టించకుండా కేవలం ఇంగ్లీషు పదాలతోనే లాగిద్దామనుకుంటే కొన్ని పంక్తులు వ్రాసేసరికి

"దీని బదులు నేరుగా ఇంగ్లీషులోనే వ్రాయడం నయం" అనిపిస్తుంది. ఇక తెలుగెందుకు ? "తెలుగు పదాలు అవసరం లేదు" అనే వాదన ఇంకా ముందుకెళ్ళి "అసలు తెలుగే అవసరం లేదు"అనే వాదనకి దారితీస్తుంది. **ఇప్పుడు జరుగుతున్నది అదే.**

**7. ఈత అన్నాక నీళ్ళలోకి దూకి నేర్చుకోవలసిందే. భాష సర్వాంగసుందరంగా అభివృద్ధి చెందాకనే అందులో సాంకేతికాంశాలు రాస్తానంటే కుదరదు. ముందు రాస్తూ, రాస్తూ, ఆ క్రమంలో కొత్త పదాల్ని కనిపెడుతూ వాడుకలోకి తెస్తూంటేనే భాష అభివృద్ధి చెందుతుంది. సాహిత్యభాష సాంకేతిక భాషగా పరిణామం చెందుతుంది. ఇంగ్లీషు కూడా ఇందుకు మినహాయింపు కాదు.**

**మరో కోణం : తెలుగులో పదాలు లేవనే వాదన**

"తెలుగులో పదాలు లేవు. లేదా తెలుగులోకి అనువదించలేం" ఇది సరైన అభిప్రాయమా ? లేక "మనకు తెలుగు భాషలో సరైన శిక్షణ లేదు, ఇంగ్లీషులో ఉన్నంత "ఇది సరైనదా ? ఇంగ్లీషు భాషలో ప్రస్తుతం కనిపిస్తున్న ఇంగ్లీషు పదాలన్నీ ఆ భాష పుట్టినప్పటినుంచే అందులో ఉన్నాయా? మధ్యలో ఆ పదజాలాన్ని పెంచడానికి ఆంగ్ల మేధావులు చేసిన మానవ ప్రయత్నమేమీ లేదా? ఆ పదాలు హఠాత్తుగా ఆకాశంలోంచి ఊడిపడ్డాయా ?

**మనకి తెలుగులో ఉన్న పూర్వశిక్షణ మనచేత ఈ భాష గొప్పదనాన్ని ప్రశంసింపజేయడానికి సరిపోవడం లేదు. కొత్త తెలుగుపదాల్ని కల్పించడానికి చాలడం లేదు. ఇంగ్లీషుని అనువదించను సహాయపడలేకపోతోంది. మనకి పాఠశాలల్లో తెలుగు నేర్పుతున్న విధానం– మనం పదో తరగతిలో భాషాపరంగా ఏ స్థాయిలో ఉన్నామో ఆ స్థాయిలోనే జీవితాంతం మనల్ని ఉంచుతోంది. తెలుగు పాఠ్యాల బోధనలో ఏ విధమైన కొత్త పద్ధతులూ చోటుచేసుకోవడం లేదు. ముప్ఫయ్యేళ్ళ క్రితం ఎలాంటి పాఠాలూ, పాఠ్యక్రమమూ, బోధనా పద్ధతీ, మూల్యాంకన విధానమూ ఉండేవో సరిగ్గా వాటినే ఏ మార్పూ లేకుండా కొనసాగిస్తున్నారు. తతిమ్మా అన్ని సబ్జెక్టులలోనూ విప్లవాత్మకమైన మార్పులు తెస్తున్నారు. అథవా, తెలుగు సబ్జెక్టులో ఏమైనా మార్పులు తెచ్చినా అవి ఈ భాషని నాశనం చేసే దిశలో ఉంటున్నాయి తప్ప బాగుచేసే దిశలో ఉండట్లేదు. మనం ఈ భాషాపరమైన స్తబ్ధత** (linguistic stagnation) **కి అలవాటుపడి "ఓహో తెలుగంటే ఇదే, ఇంకేమీ లే"దనుకుంటున్నాం. తెలుగు సాహిత్య పఠనం పేరుతో మనం అనంతర జీవితదశాకాలంలో చదివేదంతా వ్యావహారికం, లేకపోతే పచ్చివ్యావహారికం.**

ఒకపక్క ఇలా తెలుగులో స్తబ్ధం (stagnate) అయిపోయిన మనం మరోపక్క మన ఆంగ్లపరిజ్ఞానాన్ని మాత్రం రోజు రోజుకూ పెంచుకుంటున్నాం, ప్రయత్నపూర్వకంగా! మన బహుభాషా పరిజ్ఞానం మన భాషని ఉద్ధరించడాని క్కాక దాన్ని కించపరచడానికి దుర్వినియోగమవుతోంది. కొన్నికొన్ని ప్రారంభిక తభావతులు చోటు చేసుకున్నప్పటికీ ప్రయోగశీలతని సాదరంగా ఆహ్వానించాల్సి ఉంది. ప్రయోగాలు చేస్తూ చేస్తూ పోగా వాటిల్లోంచి కొంత మంచి పుట్టే అవకాశం ఉంది. ఒక కొత్త ప్రయోగం నచ్చకపోతే ప్రత్యామ్నాయాలు ఆలోచించే స్వేచ్ఛ మనకెప్పుడూ ఉంది. అసలు ప్రయోగాలే చేయొద్దన డం సరైన ధోరణి కాదు.

జీవితం ఒక నిరంతర అభ్యసనా ప్రక్రియ (constant learning process). కొత్త పదాలు సృష్టి అవుతున్నకొద్దీ వాటిని మన పదజాల పరిజ్ఞానంలో భాగంగా చేసుకోక తప్పదు. అది తెలుగైనా, ఇంగ్లీష్టైనా! అయితే ఇక్కడ ఆచరణాలో జరుగుతున్నది ఏంటంటే– ఆ అభ్యసన ప్రక్రియలో ఇంగ్లీషు ఉండొచ్చుగానీ తెలుగు ఉండకూడదు అని వాదించడం. తెలుగు మాత్రం స్తబ్ధం అవ్వాలి, ఎందుకంటే మనం స్తబ్ధం అయ్యాం కనుక !

ఇహపోతే అర్థం కావడం. ఏ పదానికీ స్వతహాగా సద్యఃస్ఫోరకత (spot understandability) లేదు, తెలుసుకుని, పలికి, అలవాటు పడితే తప్ప! వాడుతూ ఉంటే అంతా వ్యావహారికమే. వాడకపోతే అన్నీ గ్రాంథికమే. మాతృభాష కానటువంటి ఇంగ్లీషులో ఏ కొత్త పదం వచ్చినా ఆబగా అందిపుచ్చుకోవడానికి సిద్ధంగా ఉన్న మనం తెలుగు దగ్గఱికొచ్చేసరికి ఆ పని ఎందుకు చేయలేకపోతున్నాం? ఇది తెలుగు తప్పా? మన తప్పా? ఆలోచించాల్సి ఉంది. ఏ కారణాన్నో ఇక్కడ చాలా ప్రతిఘటన (resistence) ఉన్నది, కొత్త పదాల్ని కల్పించుకోవడం పట్ల, వాటిని వాడడం పట్ల ! ఇంగ్లీషు పదాల్ని ఉన్నదున్నట్లు దిగుమతి చేసుకోవడాన్ని అభ్యుదయంగా భ్రమించే వాతావరణం ఉంది.

**ఆదాన అనువాదాల పట్ల అపోహలు**

ఆంగ్ల పదాల ద్వారా వ్యక్తమయ్యే భావాన్ని తెలుగుపదాలతో అనువదించి వాడుతూంటే "మక్కికి మక్కి" అని, "True translation" అని పేర్లు పెట్టి వెక్కిరించడం కనిపిస్తోంది. **ఈ వెక్కిరింపులకి పాల్పడుతున్నది తెలుగువారే, ఇతరులు కారు. ఆ విధంగా తెలుగులో నూతనపద నిష్పాదకుల్నీ, పదప్రయోక్తల్నీ మానసికంగా క్రుంగదీయాలనే ప్రయత్నమూ, నిరుత్సాహపఱచాలనే వ్యూహమూ, అలా తెలుగుపై ఇంగ్లీషు పదాల బాహుళ్యాన్ని శాశ్వతంగా వ్యవస్థాపించాలనే ఆకాంక్షా వెల్లడవుతున్నాయి. అనువాదాల రూపంలోనైనా సరే, తెలుగు బతికి బట్టగట్టడం వారికి ఇష్టం లేదు.**

ఇలా అవహేళనలకి దిగేవారి ఉద్దేశంలో– "ఆ తెలుగు ప్రత్యామ్నాయాలు ఒరిజినల్ కావు. అవి నకిలీ. కాబట్టి వెకిలి. ఒరిజినల్ ఇంగ్లీష్ ఐడియాస్ ని ఇలా అనువాదాల రూపంలో దొంగిలించి ఆ ఐడియాస్ కి మూలపురుషులైన ఇంగ్లీషువారి గొప్పదనాన్ని తెలుగువారు తెలుసుకోకుండా చేసి కప్పిపుచ్చడమూ, అవేవో తెలుగువారి ఒరిజినల్ ఐడియాస్ అయినట్లు ప్రచారమైపోవడమూ ఘోర అన్యాయం, అక్రమం. దురాగతం. **తెలుగు తెలివితక్కువ, వెనకబడ్డవాళ్ళ భాష. ఇందులో తెలివైన వ్యక్తీకరణలెలా ఉంటాయి? మా లెక్క ప్రకారం ఉండకూడదు. తెలివైన, నాగరికమైన వ్యక్తీకరణ ఏదైనా ఉంటే దానికి ఇంగ్లీషు ముద్ర ఉండాలి. అదే ఆధునికత. అదే అభివృద్ధి. అదే గౌరవనీయత. అదే విజ్ఞానానికీ, నాగరికతకీ, అభ్యు దయ దృక్పథానికి అసలైన చిహ్నం. మేము సాక్షాత్తూ ఒరిజినల్ ఇంగ్లీషే తెలిసినవాళ్ళం. ఈ నకిలీ (తెలుగు) పదాలతో మాకేం పని?"**

గ్రహించగలిగితే, ఇంతుంది ఈ ఎగతాళ్ళ వెనక !

అయితే, ఓ విషయం. ఇలా **అనుకుంటున్నది, ఇంగ్లీషు అఱకొఱగా నేర్చుకుని తలలెగరేస్తున్న ఒక వర్గం మాత్రమే. ఇంగ్లీషు తెలియని ఆంధ్రులు అనువాద పదాల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నారు.** ఆంగ్లపదాల బదులు అవే వాడుతున్నారు. ఎందుకంటే వారివఱకూ వాటికి (తెలుగుపదాలకి) ప్రత్యామ్నాయం లేదు.

కానీ ఆంగ్ల విద్యావంతులైన ఆంధ్రులవఱకూ ప్రత్యామ్నాయం

(ఇంగ్లీషు) ఉంది. తెలుగంటే ఉన్న చిణాకువల్ల అనవసరమైన మూలవిధేయతని కౌగలించుకుంటున్నారు. కాబట్టి తెలుగు వారికి ఒక ప్రత్యామ్నాయభాషని చూపించినప్పుడు వారు తెలుగుని వదిలేయడమే కాకుండా దాన్ని కించపఱుస్తారని సూచించబడుతోంది. అందువల్ల భాషాపరమైన మానసిక పరిణతి విషయమై ఇంకా ఎన్నో మైళ్ళు ప్రయాణించాల్సి ఉన్న ఈ జాతికి ఇంత విస్తృతంగా విదేశీ భాషా శిక్షణ ఇవ్వడం భస్మాసుర హస్తంలాంటిది కావచ్చుననిపిస్తోంది. ఆంగ్ల విద్యావంతుల విషయానికొస్తే, తాము ఒరిజినల్ ఇంగ్లీష్ ఐడియాస్ అనుకొని వాడుతున్న అనేక పదాలు, వాస్తవానికి ఇతరభాషల నుంచి ఆంగ్లేయులు మక్కికి మక్కి అనువదించుకొని వాడుతున్నవని ఈ బడాయి తెగ ఆంధ్రులకి తెలియదు. మచ్చుకు ఈ క్రింది జాబితా పరికించండి :

**ఆంగ్లేయులు ఇతర భాషల నుంచి అనువదించుకున్న వ్యక్తీకరణలలో కొన్ని :**

**చైనీయభాష నుంచి**

| ఆదాన అనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Running Dog | zou gou. |
| Brainwashing | xì não |
| Look-see calques | kanjian |
| lose face | diu lian |
| Paper tiger | zhi l?phù |

**పరాసుభాష (ఫ్రెంచి) నుంచి**

| ఆదాన అనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Adam's apple | pomme d'Adam |
| Bushmeat | viande de brousse |
| deaf-mute | sourd-muet |
| By heart (or off by heart) | par caur |
| Governor-General | Gouverneur Général |
| Free verse | vers libre |
| Old guard | Vieille Garde (the most senior regiments of |
| the Flea market | marché aux puces |
| Marriage of convenience | mariage de convenance |
| New Wave (artistic period) | Vague |
| rhinestone pebble" | caillou du Rhin ''Rhine |
| Staircase wit | l' esprit de l'escalier |
| that goes without saying | cela va sans dire |
| Point of view | point de vue |

**ఒలందుభాష (డచ్చి) నుంచి**

| ఆదాన అనువాద పదం | దాని మూలపదం |
|---|---|
| Masterpiece | meesterstuk |
| Pineapple calques | pijnappe |
| Superconductor | Dutch supergeleider[20] |

**శార్మణ్యభాష (జర్మన్) నుంచి**

| ఆదాన అనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Antibody | antikorper |
| Ball lightning | Kugelblitz |
| Beer garden | Biergarten |
| Concertmaster | Konzertmeister |
| Flamethrower | Flammenwerfer |
| Foreword | Vorwort |
| Heroic tenor | Heldentenor |
| Homesickness | Heimweh |
| Intelligence quotient | Intelligenzquotient |
| Loan translation | Lehnübersetzung |
| Loanword | Lehnwort |
| mercury/quicksilver vapor lamp | Quecksilberdampflampe |
| Motorway | Autobahn |
| Overman and superman | Übermensch |
| Power politics | Machtpolitik |
| Rainforest | Regenwald |
| Standpoint (point of view) | Standpunkt |
| Superego | Überich |
| Stormtroopers | Sturmtruppen |
| Subliminal | unterschwellig |
| Thought experiment | Gedankenexperiment |
| Watershed | Wasserscheide |
| Worldview | Weltanschauung |
| World war | Weltkrieg |

**యూదీయభాష (హీబ్రూ) నుంచి**

| ఆదాన అనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Scapegoat | SINTY (Azazel) (A departing goat) |

**రోమకభాష (ల్యాటిన్) నుంచి**

| ఆదాన అనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Commonplace | locus communis |
| Devil's advocate | advocatus diaboli |
| Wisdom tooth | dens sapientiae |
| Milky Way | via lactea |
| Rest in Peace | requiescat in pace |
| In a nutshell | in nuce |

**శ్పానిష్ నుంచి**

| ఆదానఅనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Blue-blood | sangre azul |
| Moment of truth | el momento de la verdad |

**మరి ఇతరభాషల నుంచి**

| ఆదానఅనువాదపదం | దాని మూలపదం |
|---|---|
| Gospel | evangelion (good news) (Greek) |
| Hotdish | varmrett/varmrätt (Scandinavian) |

ఇంగ్లీషే కాదు, అన్ని భాషల్లోనూ ఆదాన అనువాదాలు మామూలే. అవి లేని భాషే ప్రపంచంలో లేదు. అలాంటప్పుడు కేవలం తెలుగులోనే దాన్నెందుకు తప్పుగా చూడాలో అగమ్యగోచరం. మనం పదాలని అనుకుంటున్నవన్నీ నిజానికి పరిభావనలే. కొన్ని పరిభావనలు కొన్ని ప్రత్యేక సందర్భాల్లో, ప్రత్యేక పరిస్థితుల మధ్య, ప్రత్యేక వాతావరణాల్లో కవితాత్మకంగా అంకురిస్తాయి. జనం వ్యక్తీకరణ అవసరాల్ని పురస్కరించుకొని వాటిని తమ మాతృభాషకి చెందిన కొత్త పదాల్లోనూ, పదబంధాల్లోనూ వెలిబుచ్చుతారు. అవే సందర్భాలూ, పరిస్థితులూ, వాతావరణాలూ తారసిల్లనివారు, లేదా తార సిల్లినప్పటికీ వాటి గుఱించి కవితాత్మక ఊహలు తట్టనివారు ఆ కవితాత్మకత తమకి నచ్చినప్పుడు వాటిని తమ భాషలోకి అనువదించుకోవడం తప్పుకాదు. ఆలోచనల్ని వ్యక్తీకరించనంతవఱకే అవి వ్యక్తివి. ఒకసారి వ్యక్తీకరించడమంటూ జఱిగాక అవి సమాజానివీ, దేశానివీ, ప్రపంచానివీ, యావన్మానవజాతివి కూడా!

ఇది వ్యక్తులకే కాదు, భాషలక్కూడా వర్తిస్తుంది.

**ప్రతికూల వాతావరణం**

తెలుగువారి ఈ మాతృభాషావ్యతిరేక మనస్తత్త్వమూలాలు చాలా లోతైనవి. ఈ సందర్భంలో వాటిని టూకీగానైనా గుర్తు చేసుకోకుండా ఉండలేం. స్వాతంత్ర్యం వచ్చి ఇన్ని దశాబ్దాలైనా మనం భాషాపరంగా సంపూర్ణ బానిసత్వంలోనే కొనసాగుతున్నాం. నోటిమాటగా ప్రజాస్వామ్యం అంటూ ఊదరగొడుతున్నా, వాస్తవంగా ప్రజాభాషైన తెలుక్కి ఏ విధమైన రాజకీయ, అధికారిక హోదా లేకపోవడం వల్ల ఈ భాష పట్ల విస్తారంగా వ్యాపించిన చిన్నచూపూ, హీనభావన చివటికి ఈ భాషాప్రజలు తమ మాతృభాషాపదాల్ని తాము వాడుకోవడాన్ని కూడా ఓ అప్రాచ్యప్పనిగా, అవహేళనగా, ఎగతాళిగా ఒక రహస్య నిషిద్ధ కార్యకలాపంగా మార్చాయి. నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్చుకున్న ప్రతి తెలుగువాడూ తన జాతీయతా మూలాలు మర్చిపోయి "తానో పుట్టు అమెరికన్" అన్నట్లు ప్రవర్తిస్తూ తెలుగుని బహిరంగంగా కించపఱచడానికి వెనకాడ్డం లేదు. నిజంగా అమెరికన్లై పుట్టినవాళ్ళు కూడా ఇలా చేయరు. ఆంధ్రప్రభుత్వం తెలుగుని ఏ మాత్రమూ పట్టించుకోకపోవడంతో "మొగుడు ముండా అంటే ముష్టివాడు కూడా ముండా అన్నా" డన్నట్లు తయారయింది పరిస్థితి. అలాంటి వాళ్ళు అలా కించపఱుస్తుంటే "అది తప్పు. మన మాతృభాషని మనం అలా అనకూడ"దని ఎలుగెత్తి ఖండించే వాళ్ళు కూడా లేకుండాపోయిన దౌర్భాగ్య పరిస్థితుల మధ్య ఈ జాతి జీవిస్తోంది. దేశపౌరుల్ని విదేశాలకీ, విరాష్ట్రాలకీ సామూహికంగా ఎగుమతి చేయడానికి, ఆ విధంగా వారిని శాశ్వతంగా ఇక్కణ్ణుంచి లేవగొట్టి వలసపంపడానికి మాత్రమే ఉద్దేశించిన మన విద్యావ్యవస్థ మాతృభూమి, మాతృభాష, స్వజాతి అనే భావనల్ని మనవారిలో లోతుగా నాటడంలో విఫలమవుతోంది. జాతిపరమైన స్వాభిమానమూ, ఆత్మ గౌరవమూ లేకుండా ప్రవర్తించడమే ఆధునికతగా, విశాలహృదయంగా మన మధ్య ప్రచారంలోకి వచ్చేసింది.

దీనికి తోడు పెక్కు అంతర్జాతీయ ప్రసార సంస్థలూ, జాలగూళ్ళూ (websites) తెలుగుని తమ భాషల జాబితాలో చేర్చవు. కానీ ఆ జాబితాలో తమిళం, హిందీ, బెంగాలీ మాత్రం ఉంటాయి. కొన్నిసార్లు ఉర్దూ, గుజరాతీ, పంజాబీ కూడా ఉంటాయి. దీనిక్కారణం, తమిళమూ, హిందీ, బెంగాలీ ఏదో ఒక స్వతంత్ర దేశానికి జాతీయభాషలూ, అధికార భాషలై ఉండడం. తమిళం శ్రీలంక, సింగపూర్, మలేషియా అనే స్వతంత్ర దేశాల్లో (సహ) అధికారభాషగా ఉంది. హిందీ ఇండి యాకి అధికార భాషగా ఉంది. బెంగాలీ బాంగ్లాదేశ్‌కి అధికారభాషగా ఉంది. కానీ టోకున పన్నెండుకోట్లమంది తెలుగు భాషులూ, 2000 సంవత్సరాల చరిత్రా, అనేక దేశాలకంటే సువిశాలతరమైన ఒక పెద్దరాష్ట్రమూ ఉన్నప్పటికీ, తెలుగు ఏ దేశానికి జాతీయభాష గానీ, అధికారభాష గానీ కాకపోవడంతో ప్రపంచభాషల జాబితాలోకి ఎక్కలేని, ప్రపంచానికి పరిచితం కాలేని విచిత్ర నిస్సహాయ పరిస్థితిలో పడిపోయింది.

"పిచ్చి ముదిరింది, ఱోకలి తలకు చుట్ట"మన్నట్లు ఈ పరిస్థితికి భాషాశాస్త్రవేత్తలమని చెప్పుకునేవారు కొందఱు తోడయ్యారు. భాషని సరిగా నేర్పడం, కాపాడడం, దాన్ని భవిష్యత్తరాలకి భద్రంగా అందించడం–ఇలాంటివాటిమీద సుతరామూ నమ్మకం లేనివారు వీరు. భాషాపరంగా పక్కా శూన్యవాదులూ, భాషానాస్తికులు. భాషావేదాంతులు. వీరు తమ ఆయుర్దాయంలో అనేక సంవత్సరాలు వెచ్చించి చివటికి నేర్చుకున్నది, "భాష శాశ్వతం కాదు. భాష నశించిపోతూంటే మనం గుడ్లు మిటకరిస్తూ చూస్తూ కూర్చోవాలి. ఏ భాషైనా ఒకటే. ఏ పదమైనా ఒకటే" అని! నిజానికి ఇలా ప్రసంగించే వారు భాషా శత్రువులే తప్ప శ్రేయో.... భిలాషులు కారు. కానీ దురదృష్టవశాత్తూ, తెలుగుమీద మాట్లాడడానికి ఈ రోజున ఇలాంటివారే గొప్ప ప్రామాణిక విద్వాంసులై కూర్చున్నారు. వీరి వైరాగ్యపూరితమైన దుర్బోధల ఫలితంగా నిజమైన భాషాభిమానులూ, భాష మనుగడ కోసం ఏదో ఒకటి చేయాలనే తపన ఉన్న కార్యశూరులు కూడా తప్పుదోవ పడుతున్నారు, నిరుత్సాహం చెందుతున్నారు. మనం ఒక జాతిలో జన్మించాక దాని భాషా, మత, సంస్కృతుల పట్ల తటస్థంగా ఉండే హక్కుని కోల్పోతాం. ఎందుకంటే ఆ సంస్కృతికి మనం తప్ప వేఱే దిక్కులేదు.

**మానసిక అవరోధాల్ని అధిగమించాలి**

నా దృష్టిలో ఇది తెలుగు–ఇంగ్లీష్ గొడవ కాదు. ఇది ఒక మానవ కల్పిత మానసిక అవరోధానికి (mental barrier కి) సంబంధించిన విషయం. నిజానికి తెలుగుపదాలూ మన సృష్టి కాదు. ఇంగ్లీషు పదాలూ మన సృష్టి కాదు. ఈ రెండూ కూడా ఎవఱో, ఎప్పుడో, ఎక్కడో కల్పించగా మనం నేర్చుకుని వాడుతున్నవే. మనకి ఈ విషయంలో ఏ విధమైన నిర్ణయాధికారమూ (judgment) లేదు. కానీ మనం అలా తీర్పు తీర్చబూనుకుంటున్నాం. ఇంగ్లీషుని అందుకోవడానికి సిద్ధంగా మనం మన మనస్సుల్ని కార్యక్రమించాం. తెలుగు విషయంలో అలాంటి కార్యక్రమణం (programming) జఱగలేదు.

అర్థం కావడమనేది ఒక ఉత్తరోత్తర ప్రక్రియ (incremental process). మనకి పదేళ్ళప్పుడు అర్థం కానివి ఇఱువ య్యేళ్ళప్పుడు అర్థమవుతాయి. ఇఱవయ్యేళ్ళప్పుడు అర్థం కానివి నలభయ్యేళ్ళప్పుడు అర్థమవుతాయి. "జీవితం ఒక నిరంతర అభ్యసనా ప్రక్రియ" అని ఇందుకనే చెప్పుకున్నాం కదా! అలా కాదు, అన్నీ విన్నవెంటనే అర్థమైపోవాలని పట్టుపట్టితే అది అపరిణతి అవుతుంది. భాష యొక్క ప్రయోజనం అర్థం కావడమొక్కటే కాదు. ఇంకా చాలా పనులు (functions) ఉన్నాయి దానికి! భాష ఒక జాతి యొక్క దృక్పథాన్ని ఆవిష్కరిస్తుంది. అది ఒక జాతిని సృష్టిస్తుంది కూడా. గతానికీ, వర్తమానికి వారధిగా నిలుస్తుంది. అలాగే వర్తమానానికీ, భవిష్యత్తుకీ మధ్య కూడా వారధిగా నిలుస్తుంది. అది విజ్ఞానాన్ని అందిస్తుంది. వినోదింపజేస్తుంది. అది సంగీతాది కళలకి ఆలంబన. ఆధ్యాత్మికతకి తొలిమెట్టు. అది ఒక సమాజాన్ని కలుపుతుంది. తెలిసిన పరిభావనల నుంచి తెలియని పరిభావనలకి అది మనల్ని తీసుకెళుతుంది.

వచ్చే సంచికలో... **తెలుగులో అనేక భాషాపదాలున్నప్పుడు ఇంగ్లీషు పదాలు ఎందుకు ఉండకూడదు ?**

'సొంత భాషలో చదువువల్ల పిల్లల్లో వ్యక్తిగా, సామాజికంగా, సాంస్కృతికంగా గుర్తింపు కలిగి ఉండే విశ్వాసాన్ని ఎదగనిస్తుంది'

కనుమరుగౌతున్న అమ్మ, అమ్మనుడి జ్ఞాపకాలు

**29 వ పుట తరువాయి.......**

చంద్రశాలల్లో ఎదిగిన గిరిజన రచయితలు తమ మూలాలు తెలియక కొట్టుకుంటున్నారు. వాళ్ళ దృష్టిని ఈ ఆఫ్రికన్ రచయితలవైపు మళ్ళించేవారు లేరు.

**కాలం మారుతుంది. ఇప్పుడు సేంద్రియ వ్యవసాయం, సొంత విత్తనాలు అంటున్నారు. స్వగృహ పిండివంటలు, కర్రీపాయింట్‌లు, జొన్న-రాగి రొట్టెలు పెరిగాయి. ఇక రచనలలో రచయితల పెత్తనం పోవాలి. వీళ్ళందరూ కలిసి, తనకు దూరం చేసిన అడవి, భూమి, నీరు, కూలీ లెక్కలు, వ్యవహారజ్ఞానం తెలుసుకోవాలి. లిఖిత సాహిత్యం-జ్ఞానంతో మేళవించిన మౌఖిక సాహిత్యానికి అంటే అమ్మనుడికి ఎప్పటికీ ప్రత్యామ్నాయం కాదు. కొరివిదయ్యంలా దారి తప్పిస్తూ ఉంటుంది. అచ్చులో బిగిసిపోయే ఆ రచనలలో పనికొచ్చేది ఏమైనా ఉంటే జనం నోట్లో నలిగి సెలయేరులా ప్రవహించాలి.**


## గ్రేటర్ శాక్రమెంటో తెలుగు సంఘం

**TELUGU ASSOCIATION OF GREATER SACRAMENTO**

**కథ, కవితల పోటీ**

ప్రవాస రచయితలకు ఇదే మా ఆహ్వానం

**బహుమతులు**

ప్రథమ - $166, ద్వితీయ - $58, తృతీయ - $28
మరియు ప్రోత్సాహక బహుమతులు

**నిబంధనలు**

ఒక్కో విభాగానికి ఒక్క రచన మాత్రమే పంపాలి. తెలుగులో వ్రాసిన రచనలు మాత్రమే పరిశీలించబడుతాయి.
అమెరికా, కెనడా, యూరోప్, ఆస్ట్రేలియా, ఆఫ్రికా, సింగపూర్, మలేసియా తదితర విదేశాలలో నివసించే వారు ఈ పోటీలో పాల్గొనడానికి అర్హులు.

మరిన్ని వివరాలకు దర్శించండి http://tinyurl.com/tagscontest
మీరచనలు మాకు పంపవలసిన ఈ మెయిలు telugusac@yahoo.com
మీ రచనలు మాకు అందవలసిన ఆఖరి తేదీ:
**నవంబర్ 30, 2020**

మరిన్ని వివరాలకు సంప్రదించండి:
నాగ్ 859-536-5308, సత్యవీర్ 216-262-4905
మనోహర్ 916-524-9052, వెంకట్ 408-887-0284

**www.sactelugu.org**
**//sactelugu.org/tags-patrika/**
**https://facebook.com/sacTelugu**


కవిత

## మన బాసే మన గురించి సెప్తది

### అమ్మ మాటల్లో...

నువ్వు నా కడుపున పడినకాడ్నించే నీతో మాట్లాడుతున్నరా...
నా బాసను యాసను ఇంటూ కడుపుల గంతులేసినవురా...
నువ్వు కడుపుల ఉన్నప్పుడే ఇంట్లో ఉన్న కష్టాలను,
కన్నీటి కతలను ఇంటువున్నవురా...
పురిటి నొప్పులతో నేను 'అమ్మా' అని అరిసినప్పుడు
అదే 'అమ్మా' అనే తియ్యని పిలుపు నీ నోటి నుండి
వినాలనుండేదిరా ...

నేను పనికివోతే నిన్ను సీరకొంగులో సుట్టుకొని
నెత్తిమీద మసులుతున్న ఎండవున్నా...
నెత్తిమీన బరుగులు మోస్తుంటే నా సెమటసుక్కలు
నా గడ్డం మీన్నుంచి తేనెకారే నీ మూతి మీద పడెరా...
నాతో కూడా అలసిపోయిన నువ్వు ఉల్లిక్కి పడి
ఉచ్చుకతో చూసే నీ కళ్ళకు నా కష్టాలే కనబడేవిరా...

ఒలోలు నాయానా... అంటూ నేను పాడే నా లాలిపాటకు
ఏడ్సే నీవు ఆయిగా నిద్రవోయేటోనివిరా...
నిద్రవోతున్న నిన్ను సూస్తుంటే,
సదువుకొని ఎట్లైతవో అని కలలు కంటున్నరా...
నీ గురించీ నీ సదువు గురించి మదిల వేల ఆశలున్నె రా...

కారంపొడి మెతుకుల మన బతుకులకు ఇంగిలీసు ఎట్లారా...
నా బాసలో పెంచిన నిన్ను ఏరె బాసలోకి ఎట్ల పంపాలెరా...
నీ లేత పెదాలతో అమ్మా అని పిలిస్తే నా పెయ్ మీన వొచ్చే
జలగరింత మమ్మీ అంటే వొస్తదార...
నీవు ఏరే బాసలో నాతో మాట్టాడితే నాకెట్ల అర్తమైతదిరా?

కాటిపాప వొచ్చి పట్కపోతడు అంటూ సేతి ముద్దలు
తినిపిస్తూ, నన్నీ నిన్నీ బాసలతో ఏరుసెసే
గీ రాజకీయ కాటిపాపలు సుట్టూ ఉన్నరని బయమైతుందిరా...

మన బాసలోనే సదువుకొని మన కష్టాలను తీర్చరా...
గా బాసనే మాట్లాడి నిన్ను వెంచినా...
గా బాసే బువ్వావెట్టింది, గా బాసని యాదిలవెట్టుకో...
గా బాసలోనే సోచాయించు మన గురించి సెప్తది.
నేను నీకాడ ఉన్నా... లేకపోయినా..
నేను అమ్మ బాసలా నీతోనే ఉంటా...


-జె.డి. ప్రభాకర్
85002 27185


'పిల్లల్లో సొంత భాష ఏర్పడే బలాన్ని బట్టి లోతైన ఆలోచనాశక్తి, ఊహాశక్తి, సృజనాత్మకత, సాహిత్య ఎదుగుదల బలంగా ఏర్పడుతుంది'.
'తల్లి భాష ఎంత బలంగా ఉంటే అంత చేవతో విద్యలో రాణిస్తారు'.

ధారావాహిక

ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి
98481 23655

# పడమటి గాలితో నివురు తొలగిన తెలుగు భాషాసాహిత్య సంపద 6

**మానవుడికి భాష ఎంత అవసరమో అక్షరాన్ని తరతరాలకు భద్రం చేయవలసిన అవసరం కూడా అంతే ఉంది. భాష ఏర్పడిన వేల సంవత్సరాలకు అక్షరం లిఖిత రూపంలో వచ్చిందన్నదీ అక్షరాక్షర సత్యం. తెలుగు భాష పుట్టు పూర్వోత్తరాల చరిత్ర ఆసక్తి కలిగించే ప్రాచీన చారిత్రక గాథ. తొలి తెలుగు శాసనం (575) ఎర్రగుడిపాడు శాసనమాకాదా అన్నది కొంత వివాదాస్పదమే. అమరావతిలో దొరికిన భ్రష్టశిలాఫలకం "నాగబు" అనే మాట తొలి లిఖిత తెలుగు పదమని వేటూరి ప్రభాకరశాస్త్రి (భారతీ జూన్ 1928) చెప్పేవరకూ మనకు తెలియదు. ఈ మాటనే ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్యంలో ధ్రువీకరించి అదే మాట తన పుస్తకం అగ్రభాగన ముద్రించిన విషయంలోక విదితంమే. శాసనభాషా క్రమపరిణామ వికాసం ఆసక్తి కలిగించే అద్భుత సాహిత్య సంపద. భాష కావ్య రూపం దాల్చక ముందే శాసనాల్లో పద్య సంపద ఉందన్నా విషయం మనకు తెలిసిందే. అది నాణానికి ఒక వైపు మాత్రమే. ద్వితీయ పార్శ్వంలో ముద్రణా వికాస విస్తరణ ప్రారంభమయిన తర్వాత సాహిత్యం, సమాజం బహు విధాలుగా వృద్ధి చెంది వికసించింది. ఈ నేపథ్యంలో భారతదేశానికి పాశ్చాత్యులు వాణిజ్యం పేర వచ్చిన కాలం విచిత్రమైన, వైవిధ్యమైన వ్యాపారం. ఇది బహుముఖాలుగా విస్తరిల్లింది.**

**దుబాసిలనబడే ద్విభాషీలు:** వాస్కోడిగామ 1498 మే 20న కోజికోడులో దిగిన తర్వాత బుడత కీచు (పోర్చుగీసు) వారి వ్యాపారం బాగా వృద్ధి చెందడం, ఆపై ఇతర దేశాలు భారత దేశంవైపు ఆకర్షించడం జరిగింది. దాంతో 1600లో ఇంగ్లండ్ తూర్పిండియా కంపెనీ భారతదేశంలో వర్తకం చేయడానికి గుత్తాధిపత్యం పొందారు. ఆపై 1602లో డచ్ వారు యునైటెడ్ ఈస్టిండియా కంపెనీ, 1616లో డెన్మార్కువారు, 1664లో ఫ్రెంచ్ వారు, 1665 ప్రాంతంలో బెల్జియం వారి ఆస్టంట్ కంపెనీ, 1712లో స్వీడన్ దేశీయులు తూర్పిండియా కంపెనీ విడతలు విడతలుగా వ్యాపారం, ఆపై వాళ్ళ వాణిజ్య సంఘాలు నెలకొల్పారు. ఈ నేపథ్యంలో 1622 నాటికి ప్రళయ కావేరిలోని డచ్ వారు బానిస వ్యాపారం కూడా చేశారు. నాలుగైదు వందలమంది బటేవియాకు తీసుకుపోతున్నట్లు తామస్ మిల్ అనే ఇంగ్లీషు వర్తకుడు బందరులోని తన అధికారులకు తెలియజేశాడు. ఇలా పాశ్చాత్య దేశాలు మనదేశంలో వాణిజ్య పంటలయిన సుగంధ ద్రవ్యాలు, మణులు, మాణిక్యాలతో పాటు బానిసలుగా మనుషుల వ్యాపారం సాగింది. ఐతే 1682లో బానిసల వ్యాపారం నిషేదిస్తూ కుంఫిణీ దొరతనం వారు ఇంగ్లీషు, తెలుగు, పోర్చుగీసు భాషల్లో ఆజ్ఞాపత్రాన్ని వెలువరించారు. ఈ పరిస్థితిలో తెల్లవాళ్లకి మనకు ద్విభాషీలు (దుబాసీ) కావలసి వచ్చింది. తొలినాళ్ళలో పోర్చుగీసు భాష అధికారికంగా రాజ్యం చేసింది. దినసరి లెక్కలు, వాది ప్రతివాదుల అభియోగాలు, ధర్మాసనం వారి తీర్పులు, ఆస్తి పాస్తుల క్రయవిక్రయాలు దాన ధర్మాలు మొదలయినవన్నీ బుడత కీచు భాషలోనే జరిగినట్టు (1670–1681) నాటి లేఖల వల్ల తెలుసుకోవచ్చు. ఈ కాలంనాటి దేశీయ గీయ ద్విభాషీయులు పెత్తనం అంతింతకాదు. దాదాపు వాళ్లే రాజ్యం చేసేటంతదాకా ఎదిగి అటు పాశ్చాతుల్ని ఇటు దేశీయుల్ని మోసగించే స్థితి కలిగింది. కొన్ని సందర్భాలలో దొరల ఆగ్రహానికి గురై శిక్షలు కూడా అనుభవించారు. తొలినాటి ద్విభాషీయుల మోసం, లంచగొండితనం గమనించిన తెల్లదొరలు స్వంతగ్రంథాలు తయారుచేసుకోవలసిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలో అత్యంత నమ్మకస్తులుగా ఏర్పడిన కాంద్రేగుల జోగిపంతులు 1763 ప్రాంతం, గోడె జగ్గారావు (1761) ఆనంద రంగపిళ్ళై (1747) లక్ష్మన్న (1750) మొదలయిన వాళ్ళు నమ్మకంగా పనిచేసి కొందరు జమిందారులు కూడా అయ్యారు.

**తొలి తెలుగు పుస్తక ప్రచురణకర్త షూల్జ్:**

పాశ్చాత్యులు భారత దేశానికి విడతలు విడతలుగా వివిధ దేశాల నుంచి వచ్చారు. ఇక్కడే స్థిరపడి వేర్వేరు పేర్లతో వ్యాపార కలాపాలు ప్రారంభించారు. నేటి తమిళనాడులోని తంజావూరు




సమీపంలో తరంగంబాడిని (Tranqubar) డెన్మార్కు వారు 1616 నాటికే ఆక్రమించారు. అందువల్ల డెన్మార్కు రాజు ఆదేశానుసారం భారత దేశానికి వచ్చిన తొలి ప్రొటస్టెంట్ లూథరన్ మిషనరీ బర్తలోమయి జిగెనాబాగ్ Barthalomoaus Ziegenbalg. ఈయన తన సహచరుడైన హెన్రీపుట్ షా Heinrich Pleutschauతో కలిసి 1705 నవంబర్ 29న డెన్మార్కు దేశపు రాజధాని నగరమైన కొపెర్నహేం (Copernhagen)లో బయలుదేరి 1706 జులై 9 నాటికి తరంగంబాడి చేరుకున్నారు. వీరి రాకతో భారత దేశంలో ప్రొటస్టెంట్ క్రైస్తవ మత శాఖ ప్రారంభమయింది. తమిళ తెలుగు హిందుస్తానీ ముద్రణా


వికాసం కూడా జిగెబాగ్ అనంతరమే జరిగింది. ఈ వివరాలన్నీ సెప్టెంబర్ సంచికలో చూడవచ్చు.


జిగెన్‌బాగ్ అనంతరం వచ్చిన రెండో జట్టులో ప్రజలభాషకు పట్టం కట్టిన బెంజమిన్ షూల్జ్ ముఖ్యుడు. షూల్జ్ భారతీయ భాషలయిన తెలుగు, తమిళం, హిందుస్థాని, ఉరుదుతోపాటు ఇంగ్లీషు, జర్మన్, పోర్చుగీసు, ఫ్రెంచ్, గ్రీక్, హిబ్రూ, సిరియన్, అరబిక్ భాషలు నేర్చిన బహుభాషా పండితుడు. బెంజమిన్ షూల్జ్ 1689 జనవరి 7వతేదిన జర్మనీ దేశంలోని సోన్బెర్గ్ Sonneenburg గ్రామంలో జన్మించాడు. లాండ్స్ బర్గ్ పాఠశాలలో ప్రాథమిక విద్య పూర్తి చేశాడు. అనంతరం ఫ్రాంక్ ఫర్ట్, హలె (జర్మని) విశ్వ విద్యాలయంలో ఉన్నత విద్యపూర్తి చేశాడు. హలెలో అప్పటికీ ప్రధానాచార్యులుగా ఉన్న ఆగస్ట్ హెర్మన్ ఫ్రాంక్ (August Hermann Francke 22-3-1633-8-6-1727) హెన్రిక్ మైకెల్ నేతృత్వంలో మతతత్వం, మానవ జీవ శాస్త్రంతో పాటు లాటిన్, గ్రీక్, హిబ్రూ, సిరియన్, అరబిక్ భాషలు నేర్చుకున్నాడు. బహుభాషాధ్యయనం మానవుణ్ణి తేజోవంతుణ్ణి చేస్తుందన్న గురువుల మాటలు షూల్జ్ వంట బట్టించుకున్నాడు. ఆతనికున్న సూక్ష్మ పరిజ్ఞానాన్ని భాషాధ్యయన ఆసక్తిని గమనించిన గురువులు అనతికాలంలోనే భారత దేశానికి మత గురువుగా, భాషావేత్తగా, రచయితగా కవిగా గుర్తించి పంపారు. భారత దేశానికి వచ్చిన అతికొద్ది కాలంలోనే తమిళం తెలుగు నేర్చుకున్నాడు. అప్పటికే జిగెన్ బాగ్ తమిళ బైబిలు అనువాదం ప్రారంభించాడు. భారత దేశ కాలమాన మత పరిస్థితులను పూర్తిగా ఆకళింపు చేసుకున్న జిగెన్ బాగ్ తమిళ ప్రాంతపు దేవాలయాలు, వివిధ మతాలపై ఒక సాధికారిక గ్రంథం 219 పుటల్లో పూర్తి చేశాడు. తమిళంలో నీతివెణ్బా, కొంద్రైవేందన్, ఉలగనీతి అనే కావ్యాలు రచించాడు. జిగె బాగ్‌కి తోడు జాన్ ఎర్నెస్ట్ (గుండ్లర్ (1677-1720) అనే మరో జర్మన్ పండితుడు కలిసి 1713 నాటికి ఒక తమిళ గ్రంథం సెప్టెంబర్ నెలలో ప్రచురించారు. ఈ నేపథ్యంలో షూల్జ్ రాక తరంగంబాడిలో జర్మన్ పండితులకు మరింతబలం చేకూరినట్టయింది. షూల్జ్ వచ్చిన అనతికాలంలోనే అంటే 1719లో జిగె బాగ్ మరణించాడు. జిగె బాగ్ మరణించే నాటికి 37 సంవత్సరాలు. ఆ బాధనుంచి తేరుకునేలోపే చురుకుగా ముద్రణా బాధ్యతలు కొనసాగిస్తున్న గ్రుండ్లర్ 1720 మార్చి 19వ తేదిన మరణించాడు. తరంగంబాడి బాధ్యతలన్నీ షూల్జ్ పైనే పడ్డాయి. షూల్జ్ మీద పడిన పెనుభారం, సహచరుల మరణం ప్రాంతీయ బాధ్యతలన్న ఒకవైపు కుంగదీసిన మరో వైపు కర్తవ్య నిర్వహణ బాధ్యతను, ఇంకోవైపు దేశీయ పాఠశాలల నిర్మాణం, వారికి కావలసిన పుస్తకాల తయారి క్షణంతీరిక లేకుండా చేసింది. ఈ పరిస్థితులలో పోర్చుగీసు, డేనిష్, తమిళ భాషల్లో ఇరవై పుస్తకాలను ఆరేళ్ళల్లో ప్రచురించాడు. 1721 నాటికి 48 కీర్తనలు సంకలనం చేసి ముద్రించాడు. 1723 నాటికి 160 తమిళ కీర్తనలను అచ్చు వేశాడు. ఆపై దేశీయ సంగీత బాణీల్లో 112 కీర్తనలున్న పుస్తకాన్ని అచ్చు వేశాడు. అంతకు ముందే జిగెనా బాగ్ అసంపూర్తిగా మిగిల్చిన తమిళ బైబిలు అనువాదం 1725నవంబర్ 25 నాటికి పూర్తి చేశాడు.

మరో కోణంలో 1725 నాటికి డేనిష్ వారికి అధీనంలో తమిళ గ్రామాల్లో పాఠశాలలు ప్రారంభించారు. గ్రామ వాసులందరూ కులమత తారతమ్యం లేకుండా మాతృభాషలో విద్యాబోధన చేయాలనే నియమం పెట్టారు. దీనికిగాను తమిళ పండితులకు మంచి జీతం యిచ్చి పాఠశాలలు నడిపారు. 1725 నాటి లెక్కల ప్రకారం ఉచిత పాఠశాలలు 21 ఉన్నాయి. ఈ పాఠశాలల్లో పిల్లలకు పాఠ్యపుస్తకాలు అచ్చు వేయవలసిన అవసరం ఏర్పడింది. దానికి కావలసిన పాఠ్యపుస్తక ప్రణాళిక షూల్జ్ తోపాటు దేశీయ పండితుల సహకారంతో పుస్తకాలు తయారైనాయి. విద్యార్థులు రాయడం, చదవడం, లెక్కలు కట్టడం లాంటివి విధిగా నేర్చుకోవాలి. తమిళంతో పాటు ఇంగ్లీషు, పోర్చుగీసు భాషలు అధ్యయనం తప్పక చేయాలనే నియమం ఉంది.


మద్రాసులో 1726 నాటికి రెండున్నర లక్షలమంది దేశీయ జనాభా ఉంది. వారిలో తెలుగువాళ్లు కూడా అత్యధికంగానే ఉన్నారు. దానికో కారణం కూడా ఉంది. 1639 ప్రాంతంలో చెన్న పట్టణం పరిసర ప్రాంతాలు తెలుగు రాజుల ఏలుబడిలో ఉన్నందువల్ల తెలుగువారి ఉనికి, తెలుగువారి ప్రాభవం కొంత మెరుగ్గానే ఉంది. ఐతే తెలుగువారిని మాత్రం జెంటూలనీ, మలబారీలనీ, (తర్వాత మదరాసీలు) పిలిచేవారు. కోస్తా, తూర్పుకోస్తా, ఉత్తర కోస్తా ప్రాంతాలు ఇంగ్లీషు వారి అధీనంలో ఉండేవి. ఆనాటికే ఇంగ్లీషు వారి గిడ్డంగులున్నాయి. షూల్జ్ తెలుగువారి మధ్య ఉచిత పాఠశాలలు ప్రారంభించాడు. దీనికి డేనిష్ రాజుల సహకారం కూడా లభించింది. వెంటనే రెండు తెలుగు పాఠశాలల్ని, మలబారీ తమిళులకి ఒక పాఠశాల 1726లోనూ పోర్చుగీసు పాఠశాల 1732లోనూ బ్లాక్ టౌన్‌లో ప్రారంభించాడు. బ్లాక్ టౌన్ లో ప్రారంభించిన తెలుగు పాఠశాలతోపాటు పోర్చుగీసు పాఠశాలల్లో తెలుగు ప్రత్యేక అధ్యయనంగా బోధించేవారు. తెలుగు పాఠశాల బోధనలో విద్యార్థులతోపాటు షూల్జ్ కూడా తెలుగు నేర్చుకుని తెలుగులోనే మాట్లాడేవాడు. మరో విశేషం ఏమంటే ఒక ఏడాదిలోనే తెలుగు అనర్గళంగా మాట్లాడి తెలుగులో తెలుగువాళ్ళ మధ్య పాటలు, ప్రసంగాలు చేశాడు.

1726 సెప్టెంబర్ 14వ తేదీన మలబార్ స్కూల్‌లో 12 మంది విద్యార్థులు చేరారు. వారికి విద్య ఉచితం. తెలుగు పాఠశాలలో కూడా అనేక మంది విద్యార్థులు చేరారు. కాని పాఠశాల నిర్వహణకు బ్రిటీష్ గవర్నర్ సహకారంతో నెలవారి గ్రాంట్ వచ్చే ఏర్పాటు జరిగింది. భారతదేశంలోనే గ్రాంట్-ఇన్ఎయిడ్ పాఠశాలకు ఇక్కడే అంకురార్పణ జరిగింది. అది తెలుగు పాఠశాలలో కావడం గమనించదగిన విషయం. పోర్చ్‌గీసు పాఠశాలలో 1932 నాటికి ఏడుగురు విద్యార్థులు చేరితే అందులో ఆరుగురికి ఉపకారం వేతనం యిచ్చారు. అదే ఏడాది మలబారు స్కూలులో (పాక్షికంగా తెలుగు తమిళ విద్యార్థులు కలిసిన పాఠశాల) 17 మంది విద్యార్థుల్లో 13 మంది బాలురు నలుగురు బాలికలు. వాళ్లలో తొమ్మిది మంది మిషన్ కాంపౌండ్ హాస్టల్‌లో ఉన్నారు. షూల్జ్ ప్రారంభించిన ఉచిత పాఠశాల విద్యాబోధన (తెలుగు, తమిళం, పోర్చుగీసు భాషల్లో) వల్ల పేద వర్గాల విద్యార్థుల జీవితాలకు ఒక వెలుగు కిరణం ఉదయించినట్టయింది. షూల్జ్ ప్రారంభించిన పాఠశాలల



THE LARGE AND RENOWNED TOWN OF THE ENGLISH NATION IN THE EAST INDIES UPON THE COAST OF COROMANDEL, MADRAS OR FORT ST. GEORGE, REPRESENTING THE GENIUS, THE MANNERS, THE CARRIAGE, THE BEHAVIOUR AND THE VERY CHARACTER OF THE NATIVES; LIKEWISE THEIR TRADE AND HOUSE-KEEPING, THE PRODUCT OF THE COUNTRY AND USUALNESS OF THE GARDENS, BY WAY OF THIRTY FAMILIAR DIALOGUES WRITTEN ORIGINALLY IN THE WARUGA OR GENTOU LANGUAGE.




COLLOQVIVM RELIGIOSISSIMVM, QVOD DOCTOR TELVGICVS CVM QVINQVE BRAMINIBVS HABET DE CHRISTO, SALVATORE MVNDI, ET DE FIDE IN EVM SALFIVICA, MEDIANTE COGNITIONE VERITATIS DOCTRINAE CHRISTIANISMI GRATIS ATQVE LVBENTISSIME ANNVNTIANDI OMNIBVS, AVCTORE BENIAMINO SCHVLTZIO, MISSIONARIO EVANGELICO. HALAE MAGDEBVRGICAE MDCCXLVII.


పెద్దస్వామి


MORES VITAMQVE CHRISTIANO DIGNAM DELINEANTES REGVLAE CENTVM, IVXTA QVAS GENVINVS CHRISTI DISCIPVLVS SVAS COGITATIONES, VERBA ET OPERA OMNIA DIRIGERE DEBET QVOTIDIE EX LINGVA TAMVLICA IN LINGVAM TELVGICAM TRANSFVSVS. INTERPRETE BENIAMINO SCHVLZIO MISSIONARIO EVANGELICO. HALAE MAGDEBVRGICAE MDCCXLVII.


మోక్షానికి

ప్రారంభోత్సవంలో ఆగస్ట్ హెర్మన్ ఫ్రాంక్ ని గుర్తు చేసేవాడు. ఆయన మానస పుత్రిక అయిన ఉచిత విద్యాబోదన, మాతృభాషా బోధన, పేదలకు హాస్టల్ వసతి లాంటివి ప్రపంచానికి కొత్త నేత్రాలని స్మరించేవాడు. షూల్జ్ తరంగంబాడి నుంచి మద్రాసుకు వచ్చినందువల్ల తెలుగు బాగా నేర్చుకున్నానని చెప్పేవాడు. ఈ కాలంలోనే 1728 నాటికి మద్రాసులోనే 'గ్రమటిక తెలుగిక' పూర్తి చేశాడు. ఇదే తొలి తెలుగు ముద్రిత వ్యాకరణం. (వివరాలు అక్టోబర్ సంచికలో చూడవచ్చు) షూల్జ్ తెలుగు భాషతోపాటు తమిళ, హిందుస్తానీ, దక్కన్ ఉరుదు భాషల్లో బైబిలు తర్జుమా చేశాడు. భారత దేశంలో 23 సంవత్సరాలు పుస్తక ముద్రణ, అనువాదాలు, పాఠశాలలు, హాస్టల్ వసతి మొదలయినవన్నీ నడిపి అనారోగ్య కారణాల వల్ల 1743లో స్వదేశానికి తిరిగి వెళ్ళాడు. హాలే నగరంలో శేష జీవితం గడిపాడు. అక్కడ కూడా 1746-47 మధ్య కాలంలో నాలుగు శీర్షికల్లో ఆరు తెలుగుపుస్తకాలు ముద్రించాడు. ఇవి ప్రఖ్యాత జర్మన్ లూథరన్ తత్వవేత్త, పండితుడు అయిన జోహెన్ ఆర్నెడ్ (1555-1621) రచించిన నాలుగు గ్రంథాలకు అనువాదాలు.

1. Via Sive ordo Salvtis : మోక్షానికి కొంచ్చు పొయ్యేదొవ - 1746 (ఈశీర్షికలో రెండు వేర్వేరు పుస్తకాలున్నాయి)

2. Catechismus Telugious minor సత్యమైన వెదంలో ఉండే జ్ఞానవుపదేశాల యొక్క సంక్షేపం.

3. Mores Vitamave Christiano dignam delinantes - బుద్ధి కలిగిన తెలుగు వాండ్ల లోపలొక డొకడికి పుణ్యపు దొవ చూపించే నూరు జ్ఞాన వచనాల యొక్క చిన్న పుస్తకం (ఈ శీర్షికలో రెండు వేర్వేరు పుస్తకాలున్నాయి.)

4. Colloquim Religiosissimusm : వక గురువు అఇదు బ్రాహ్మల యొక్క నడమన కూచండి విండ్లతోను వొక్కొడి ఆకాసమున్ను భూమిన్ని ప్రప్పించిన పెద్దస్వామి మీద ప్రసంగించిన తక మిదె (ఈ పుస్తకం షూల్జ్ స్వీయ రచన) ప్రతి పుస్తకంలోనూ లోపలి మొదటి పుట లాటిన్ భాషలోనూ, ఆ తరువాతి పుట తెలుగు భాషలోనూ ముద్రించాడు. ఈ పుస్తకాల ప్రతులు బ్రిటీష్ మ్యూజియం, లండన్ లోను, కొపెన్ హగన్ లోని రాయల్ గ్రంధాలయంలోనూ ఉన్నాయి. భారత దేశంలోని, సిరంపూర్ తియోలాజికల్ సెమినరీ కేరీ గ్రంథాలయంలో రెండో పుస్తకం ఉంది. ఈ పుస్తకాన్ని తొలి తెలుగు పుస్తకమని భ్రమించి రాజమండ్రి వారు ప్రచురించారు. ఇది 1747లో హాలేలో అచ్చయింది. ఈ పుస్తకం ప్రతి పొడవు 16 సెం.మీ. వెడల్పు 10 సెం.మీ మొత్తం పుటలు 73. ప్రతి పుటలోనూ 20 పంక్తులున్నాయి. ప్రతి పంక్తికి 12 నుంచి 14 అక్షరాలున్నాయి. శీర్షికలో పెద్ద అక్షరాలు 0.7 సెంమీ. పుటల సంఖ్య తెలుగు అంకెలున్నాయి. 45 పుటల వరకు ఒక పుస్తకం. తరువాత సత్యమైన వెదంలో వుండే జ్ఞానవుపదేశాల యొక్క సంక్షేపం" మొదలవుతుంది. ఇందులో మొత్తం 24 పుటలున్నాయి. లాటిన్ భాషలో ముద్రించిన పుటలో స్పష్టంగా 1747 అనే ఉంది. అందువల్ల ఇది షూల్జి ప్రచురించిన రెండో పుస్తకం. తొలి తెలుగు ముద్రిత గ్రంధం మాత్రం "మోక్షానికి కొంచ్చుపొయ్యేదొవ" ఇది అనూదిత గ్రంథం 1746లో ముద్రణ జరిగింది. అదీ జర్మనీ దేశంలోని హాలె నగరంలో తొలి తెలుగు పుస్తకం భారత దేశంలో అచ్చుకాలేదన్నది స్పష్టం.

1747లో Conspectus Litteratures Telugioal Velgo Warciaine అనే 12 పుటల గ్రంథం చిన్న పుస్తకం ప్రచురించాడు. ఇందులో తెలుగు వర్ణ సమామ్నాయం, గుణింతాలు సంయుక్త రూపాలు తెలుగులోనూ, లాటిన్ భాషలోనూ రాశాడు. తెలుగు భాషా స్వరూపం సమగ్రంగా చూపాలనే ప్రయత్నమిది.

1750లో ముప్పై సంభాషణలున్న మరో పుస్తకం హాలి నుంచే ప్రచురించాడు. ఇది రోమన్ లిపిలో ఉన్న తెలుగు పుస్తకం దైనందిన వ్యవహారాలకు సంబంధించిన సంభాషణలు ఇందులో ఉన్నాయి. యజమానులు, సేవకులు, వంటవాళ్లు, చాకళ్ళు, దుకాణదారులు ఇతర పనివాళ్ళతో సంభాషించే పద్ధతులున్నాయి. మనకు పుస్తకాల విక్రేతల వద్ద 30 రోజుల్లో తెలుగుభాష, 30 రోజుల్లో హిందీ భాష అనే పుస్తకాలుంటాయి. వాటికి మూలం షూల్జి ప్రచురించిన సంభాషణల పుస్తకం తొలి ఆకరువు.

1728-32 మధ్యకాలంలో షూల్జ్ తెలుగు బైబిలు అనువాదం చేశాడు. ఇది పూర్తిగా చేతిరాత ప్రతి. ఇందులో 432 పుటలున్నాయి. దీని లాటిన్ టైటిల్ "VOCABULARIUM - TELUGO - TAMULO - BIBLICUM - NOVLTESTAM ENTI" అని పేర్కొన్నారు. కొత్త నిబంధనలో 260 చాప్టర్లు, పాత నిబంధన 659 చాప్టర్లున్నాయి. ప్రతిపుటలో తెలుగు పదాల ఉచ్చారణ ఆంగ్లంలోనూ, అర్థాలు ఇంగ్లీషు - లాటిన్ భాషలో ఉన్నాయి. తెలుగు బైబిల్ - కం - నిఘంటువుగా దీన్ని పేర్కొవచ్చు. 10,500 పదాలకు అర్థాలున్నాయి. 1842లో గుంటూరుకు వచ్చిన లూథరన్ శాఖకు చెందిన జాన్ క్రిస్టియన్ ఫ్రెడ్రిక్ హయ్యర్ ఈ పుస్తకం తీసికొని వచ్చినట్టు ఆయా లేఖలు స్పష్టం చేస్తున్నాయి.

తెలుగు భాషను ప్రేమించి, తెలుగు భాషను తొలినాళ్లలో ముద్రించిన బెంజిమిన్ షూల్జ్ మహాశయుడి వివరాలు డాక్టర్ జోలెపాలెం మంగమ్మగారు "Book Printing in India" అనే గ్రంథంలో వివరించడం మనభాగ్యం.

ధారావాహిక

ఈమని శివనాగిరెడ్డి
98485 98446

## అడుగుజాడల్లో ఆనవాళ్లు-3

# నా జెట్టిగామాలపాడు- తంగెడ యాత్ర

**కోడి** కంటే వాడిగా, ఒక ఘడియముందే లేచాను. ఆదివారం అందరికంటే నాకు మరింత ఆనందాన్నిచ్చేరోజు. రోజువారీ కార్యకలాపాలకు భిన్నంగా, ఇంట్లో కూడా చెప్పకుండా పజరం నుంచి చిలకలాగ నేను చరిత్ర-శాసనాలు అన్న రెండు రెక్కలు తొడుక్కొని ఎక్కడో దూరాన ఉన్న ఊళ్లపై, ప్రాచీనశాసన రాళ్లపై వాలుతుంటాను. ఈసారి బెజవాడ నుంచి శ్రీకృష్ణదేవరాయలు వశపరచుకొన్న దాచేపల్లి దగ్గర, కృష్ణాతీర చారిత్రక స్థలం తంగెడకు బయలుదేరా. ఉదయం ఆరింటికి దాచేపల్లి (అసలు పేరు దాసపల్లి) చేరుకొని, బ్రిటీషు కాలంనాటి రహదారిబంగ్లా ముందు ఆగి, భవనపు అందాల్ని ఆరగిస్తూ ఒక అరకప్పు కాఫీ తాగుతున్నా. పక్కనుంచి శివనాగిరెడ్డిగారు నమస్కారం అంటూ ఓ పలకరింపు. ఆయన పశువైద్యులు డా.స్వర్ణవాచస్పతి. వాళ్ల నాన్న ప్రముఖ వాస్తు-శిల్పి స్వర్ణ సుబ్రహ్మణ్య కవిగారు. భారతీయ మహాశిల్పం పేరిట, వాస్తు శాస్త్రాలన్నింటినీ తెలుగులో 16 గ్రంథాలు వెలువరించిన శిల్పశాస్త్ర ఘనాపాఠి. వాచస్పతిగారు కూడా, రావణ బ్రహ్మ, వాస్తు-శిల్ప పదనిఘంటువు, ఇంకా అనేక ప్రామాణిక గ్రంథాల రచయిత. ఇద్దరం కలసి చరిత్ర శకలాల వేటకి వెళ్లాం. స్థానిక నాగేశ్వరాలయంలో క్రీ.శ. 1218 నాటి కాకతీయ గణపతి దేవుని మహాప్రధాని భీమనాయకుని దాన శాసనం, పాత పెద్దకోట శివాలయంలోని క్రీ.శ. 14వ శతాబ్ది దేవయరెడ్డి శాసనం, ఆంజనేయాలయం ముందటి క్రీ.శ.1789నాటి వెంకన్న పంతులు నాగులేటికి మెట్లు కట్టించిన శాసనాలను, కొత్తదనం పేరిట పురాతనాన్ని పోగొట్టుకున్న గుళ్లనూచూశాం. నాగేశ్వరాలయంలోని దిక్కుమొక్కులేని నాగదేవత, వీరశిల, కుమారస్వామి శిల్పాలు జాలిగా మా వంక చూడటం తట్టుకోలేకపోయాం. కూరుకుపోయి కొన్ని, పగిలిపోయి మరి కొన్ని, వంగిపోయి ఇంకొన్ని, ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ మౌనంగా బాధ్యతనుగుర్తు చేస్తుంటే గుండె బరువెక్కింది. గట్టిగా నిట్టూర్చేలోపు, వాచస్పతిగారు వీడుకోలు చెప్పి పక్కకు తప్పుకొన్నారు.

అసలు నేను చూడాలనుకొంది తంగెడ. పక్కనే పల్నాడు చరిత్రతో ముడిపడి ఉన్న జెట్టిగామాలపాడుకు నాదారి మళ్లింది. గ్రామానికి 1 కి.మీ. తూర్పుగా, కాలిబాట. అక్కడొక పాడుబడిన కోట. అక్కడక్కడా కప్పుల్లేని ఇళ్లు. తలుపుల్లేని గుళ్లు. విరిగిన శిల్పాలు, పగిలిన శాసనాలు, అరిగిన రోళ్లు, అలుపెరుగని తిరగళ్లు.వన్నెకోల్పోయినా, పల్నాటి పౌరుషాన్ని ప్రకటిస్తూనే ఉన్నాయి. ఒంటెలా ఓగంటపాటు ఒంటరిగా తిరిగి ఒకచెట్టు కింద కూర్చున్న నాకు, క్రీ.శ. 1182లో నాయకురాలు నాగమ్మ తండ్రి చౌదరిరామిరెడ్డిని ఉరితీసింది ఈ చెట్టుకిందేనేమోననిపించింది. దాంతోపాటు పల్నాటి వీరభారతఘట్టాలు, వీరులెక్కిన గుర్రాల పదఘట్టనలు, కరవాల కరచాలనాలు, నేలకొరుగుతున్న వీర సైనికులూ, భీభత్సంగా పరుగులు తీస్తున్న ఏనుగుల ఘీంకారాలు, కుత్తుకలు కత్తిరిస్తున్న కత్తుల వికటాట్ట హాసాలు కళ్లముందు కదలాడాయి. ఒళ్లంతా కంపించింది. నాగులేటి నాపరాళ్ల సందుల్లోంచి మెలికలు తిరుగుతూ, దానిదారిన అదిపోతున్న ఒక మెలికల పాము నన్ను మళ్లీ ఈలోకంలోకి తీసుకొచ్చింది.

చౌదరి రామిరెడ్డి చనిపోయింది ఇక్కడే. 'చౌదరి' అన్న పదం ఒకప్రాంతంలో పండిన పంటలో నాలుగోవంతును పన్ను రూపంలో (చౌత్ + అరి = చౌదరి) ప్రభుత్వానికి జమచేసే అధికారిని సూచిస్తుంది. రానురాను అది, రెడ్డి మాదిరిగా కులవాచకమైంది. గామాలపాడు అసలు పేరు జెట్టిగామాలపాడు. కుస్తీ పోటీల్లో కండబలాన్ని, గుండెబలాన్ని ప్రదర్శించే ధృఢకాయులైన యోధుల్ని జెట్టీలంటారు. రానురాను జెట్టిగామాలపాడు, జిట్టగా మాలపాడై చివరకు గామాలపాడైంది. పేరుకుపోయిన రాళ్ల గుట్టల్లోని శిల్పాలు, శాసనాల పలకరింపులు కాళ్లను కదలకుండా కట్టిపడేశాయి. పదిలపరచే ఎదలకోసం ఎదురుచూస్తున్నాయి.

గామాలపాడు శంభునిగుడిలోని క్రీ.శ. 1223 నాటి కుమ్మరికుంట బేతరాజు దాన శాసనం, నంది స్థంభం పైనున్న క్రీ.శ. 1290 నాటి మల్లికార్జున నాయకునికి పుణ్యంగా, దానంచేసిన దాడిపోచుంగారి శాసనం, చెన్నకేశవాలయం వెనుకున్న క్రీ.శ. 1677లో బొల్లా నారశింహుడు గరుడ స్థంభాన్నెత్తించిన శాసనం, నాయకురాలు నాగమ్మ గుడిద్వార శాఖ పైనున్న క్రీ.శ. 15 వ శతాబ్దిలో చెన్నమల్లికార్జునునికి ముఖమండపం కట్టినట్లు తెలిపే శాసనం, ఇరికల్లి దారిలోనున్న క్రీ.శ. 16వ శతాబ్ది గుండయరెడ్డి శాసనం, క్రీ.శ. 1312 నాటి గజసాహిణి గుయిరెడ్డి పన్ను మాన్యం శాసనాల అక్షరాలపై నా మునివేళ్లతో పలుమార్లు తడిమి, తడిమి చూశాను. తెలుగు తల్లి

ఒడిలో  గుడికట్టుకొన్న చరిత్రను ఒడిసి పట్టుకొన్నాను.

ఒకనాటి మేటి శాసన పరిశోధకులు శ్రీమల్లంపల్లి సోమశేఖరశర్మ గారిని తలచుకున్నాను. నాయకురాలిదిగా పిలువబడుతున్న అపురూపాలయం, చంనమల్లి కార్జునాలయమనీ, దాడిపోచుంగారి శాసనంలోని మల్లికార్జున నాయకుడు, ఎవరోకాదు, కాయస్థ అంబదేవుని కుట్రలు కుతంత్రాలకు బలై,



రుద్రమదేవితో పాటు యుద్ధభూమిలో మరణించిన ఆమె అంగరక్షకుడని తెలుసుకున్నాను. క్రీ.శ. 12వ శతాబ్దినాటి నాయకురాలు నాగమ్మ దేవాలయం కళ్యాణీ చాళుక్య వాస్తుశైలిలో అత్యంత శిల్పకళావిన్యాసంతో పల్నాటి నాపరాతితో నిర్మించబడింది. శిఖరం పడిపోయింది. కలశం కనుమరుగైంది. ప్రజలతో, ప్రభుత్వంతో పనిలేకుండా



చుట్టూ ఏపుగా పెరిగిన పిచ్చిమొక్కలు ప్రహరీ గోడలా ఆలయాన్ని కాపాడుతున్నా, పక్కనున్న పదోశతాబ్ది భైరవ విగ్రహం నిర్లక్ష్యానికి నిరసనగా ఢమరుకాన్ని మోగిస్తూనే ఉంది. ఆరుగంటలపాటు అణువణువూ అన్వేషించి అలసిపోయిన నన్ను, ఆకలి, ఈలోకంలోకి తెచ్చింది. దాచేపల్లి అడ్డరోడ్డులో సుబ్బమ్మ హోటల్లో భోంచేస్తూ, వరంగల్ మట్టెవాడలో టిట్టిభశెట్టి, మంచన శర్మలు ఇంపుగా కడుపునింపుకొన్న పూటకూళ్లమ్మను మళ్లీ మళ్లీ గుర్తుచేసుకున్నాను. కర్తవ్యం గుర్తుకొచ్చి, కారెక్కాను తెలియకుండానే, తంగెడ చేరుకొన్నాను.

2009వ సంవత్సరంలో శ్రీకృష్ణదేవరాయలి 500వ పట్టాభిషేకోత్సవాల సందర్భంగా, నేను, మిత్రులు కె.జితేంద్రబాబు, డి. సూర్యకుమార్ కలసి 'శ్రీకృష్ణదేవరాయల తెలుగు శాసనాలు' అన్న పుస్తకాన్ని తెచ్చాం. తూర్పు దిగ్విజయ యాత్ర సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు శ్రీశైలం, చిన్నఅహోబిలం, కాంచీపురం మొదలైన శాసనాల్లో తాను జయించిన కోటల్లో తంగెడ కోటను గురించి ప్రస్తావించిన సంగతి, క్రీ.శ. 1515 జులై 25, బుధవారం నాటి శ్రీకృష్ణదేవరాయలి శ్రీశైలం శాసనంలో 'శ్రీ వీరప్రతాప శ్రీకృష్ణదేవమహారాయలు విజయనగరాన నుండి పూర్వ దిగ్విజయ యాత్రకు విచ్చేసి, ఉదయగిరి దుర్గం సాధించి, తిరుమల కాతరాయ మహాపాత్రుని పట్టుకుని, అద్దంకీ, వినుకొండా, బెల్లంకొండ, నాగార్జునునికొండ, తంగెడ, కేతవరం, మొదలైన గిరి దుర్గా స్థల దుర్గాలు ఏకధాటిన గైకొని' అని పేర్కొన్న విషయం మదిలో మెదిలాయి.

కృష్ణరాయలు వశమైన తంగెడ కోట గోడను చూడగానే ఐదొందలేళ్ల నాటి సంఘటన కళ్లముందు కదలాడింది. నిజానికి శ్రీకృష్ణదేవరాయలు తంగెడకొచ్చి, కోటను స్వాధీనం చేసుకోలేదు. ఈ మూరు రాయగండడు, తూర్పు దిగ్విజయ యాత్రలో ఉదయగిరి నుంచి బెల్లంకొండ దాకా గల గిరి, స్థల దుర్గాల్ని జయించిన పరాక్రమవంతుడని విన్న తంగెడ దుర్గాధిపతి కృష్ణరాయనికి లొంగిపోయి, స్థలదుర్గాన్ని ఆయన వశం చేశాడు. కాలి నడకన కోట చివరిదాకా వెళ్లాను. కృష్ణానది కనిపించింది. తెలంగాణాకు కొత్తగా నిర్మించిన వంతెన కనిపించింది. మళ్లీ కృష్ణ ఒడ్డు నుంచి  వ్యాపించిన గుండ్రటి రాతి కోట, ఐదు అడుగుల వెడల్పు, 15 అడుగుల ఎత్తు, నాలుగు దిక్కులా ప్రవేశద్వారాలు, దక్షిణ ద్వారానికి ముందు నాలుగు కాళ్ల మండపం, సాక్షిదుర్గాలయం, చుట్టూ లోతైన కందకం. లోనికి ప్రవేశించగానే వేణుగోపాల, వీరేశ్వర, వీరభద్ర, గంటల రామలింగేశ్వరాలయాలూ, ఒక దిగుడు బావి, అనేక శాసనాలూ, తంగెడ చరిత్రకు అద్దంపడుతున్నాయి. చరిత్రపై అసక్తిగల ఒక కుర్రాడి మోటారు సైకిల్‌పై మళ్లీ కోటగోడ చుట్టూ, లోపలా, చుట్టొచ్చి దక్షిణద్వారం దగ్గర టీ తాగి శాసనాలమీదే ధ్యాస, కొత్త విషయం మీద ఆశతో అన్వేషణకు బయలుదేరాం.

గంటల రామలింగస్వామి ఆలయంలో క్రీ.శ 1308 నాటి కాకతీయ ప్రతాపరుద్రుని శాసనంలో తంగెడ గవర్నరు దేవరి నాయని సమక్షంలో అక్కడి 18 సమయాల వారు, ఉభయ నానాదేశ పెక్కండ్రనే వర్తకులు, తమ  అమ్మకాల్లో కొంత లాభాన్ని గంటల రామనాధ దేవరకు సమర్పించినట్లుంది. వేణుగోపాల దేవాలయం ముందున్న క్రీ.శ.1373 నాటి కొండవీటి ప్రభువు అనవేమారెడ్డి శాసనంలో అవుభళనాధుని దేవులెంక, గోపినాధ దేవుని చుట్టూ మండపం కట్టించి, 12మంది అళ్వార్లను ప్రతిష్ఠించి, కొంత భూమిని దానం చేసినట్లూ, కుమారగిరిరెడ్డిగారు రాజ్యం చేయుచుండగా(బహుశా యువరాజుగా) తంగెడ పాలకులైన చొక్కన సింగన, వాడపల్లి ఎక్కటీలు (సైనికులు), ఇంకా తంగెడ సైనికులు, ఆలయానికి చేసిన

దాన వివరాలున్నాయి.

తంగెడకు పడమరగా అడవిలోనున్న క్రీ.శ.1391 నాటి కుమారగిరిరెడ్డి శాసనంలో చొక్కన సింగన , స్థానిక నరశింహస్వామికి, ఆళ్వార్లకు గోంగులపాటి (గోగులపాడు) దాసపల్లి (దాచేపల్లి) అనంతగిరి (అనంతారం), పినగారిపాడు (గారపాడు), కల్లుపాడు (కర్లపాడు) బయ్యనపాడు, ఆకురాజుపల్లె, కొత్తపల్లి, కాచవరం, తక్కెళ్లపాడు, చింతపల్లిలో కొంత భూమిని, చింతపల్లి గోపులెంక తెలుంగరి, కొంత భూమిని, గోపాయ రెడ్డి తన జీత తుమ్మలచెరువులో మీద కొంత ఆదాయాన్ని సమర్పించినట్లు చెప్పబడింది. లెంక అనగా రాజుల విశ్వాససేవకుడు. గోపులెంక తెలుంగరి అని చెప్పబడింది. తెలుంగరి అనే శబ్దం అర్థంపై పరిశోధించాలి. గోపాయరెడ్డి, తంగెడ ఎక్కటీలు(సైనికులు) తమ జీతాల వల్ల కొంత భూమికొనిచ్చారు. జీతం అన్న పదం అనాడు వారి సేవలకుగాను ప్రభుత్వం సంవత్సరానికిచ్చే భూమి రూపంలోని పారితోషికంగా చెప్పుకోవచ్చు. అదే బ్రిటీషు కాలానికి నెలజీతమైంది.

వేణుగోపాలస్వామి ఎదురుగా పాతిన గరుడస్థంభం పైనున్న క్రీ.శ. 1394 నాటి కుమారగిరిరెడ్డి శాసనంలో వెల్లంపల్లి రాజబంట్లు, పడాలు (సైనికులు), వారి జీతాల్లో కొంత భాగాన్ని గోపీనాధునికి సమర్పించినట్లుగా చెప్పబడింది. క్రీ.శ.1509 నాటి ప్రతాపరుద్ర గజపతి శాసనం, తంగెడ గజపతుల పాలనలోకొచ్చినట్లు తెలియజేస్తుంది. క్రీ.శ. 1656 నాటి కాకునూరి అప్పకవి, తన 'అప్పకవీయం'లో తంగెడ, కృష్ణకు దక్షిణంగా కొండవీటికి పశ్చిమంగా, శ్రీశైలానికి ఈశాన్యంగా ఉందని రాశాడు. గజపతుల తరువాత ఈ సీమ విజయనగర రాజులు, కుతుబ్‌షాహీల పాలనలోకొచ్చింది.

తంగెడ దక్షిణ కోట గోడ ఆనాటి రాచరికపు వ్యవస్థ, ప్రధాన ద్వారం ప్రక్కన చిన్న ద్వారం, వచ్చీపోయేవారి నియంత్రణ పద్ధతికి ఆనవాళ్లు. ద్వారానికి దక్షిణంగా సగానికి పైగా పూడుకుపోయిన దుర్గాదేవి ఆలయముంది.గ్రామంలో ఎవరైనా తప్పుచేస్తే నిజం ఒప్పించే సాక్ష్యవేదికగా ఇప్పటికీ తన ప్రాముఖ్యతను నిలుపుకొంటుంది. ద్వారంలో ప్రవేశించేముందు, ఎడమ వైపు బురుజు పక్కనే ఒక శాసనం కూరుకుపోయి, దాని శ్వాసనాళాలు మూసుకుపోయాయి. వీరభద్ర, వీరేశ్వర, గంటల రామలింగ ఆలయాలు కొద్దిగా ఆధునీకరింప బడినాయి. కానీ వేణుగోపాల ఆలయం, ఇతర కట్టడాలు, శాసనాలు, ప్రాచీనతతో పురాతనాన్ని ఒలికిస్తున్నాయి. ఊళ్లో పశువుల ఆసుపత్రి దగ్గరున్న ద్వికూటాలయం ముందు వసారాలో



ఒకరు ట్రాక్టరును నిలుపుకొంటున్నారు. ఆలయం గోడల వెంబడి, స్థానికులు చెత్తను కుప్పలుగా పోస్తున్నారు. కోపం కట్టలు తెంచుకుంది. ప్రజాస్వామ్యం ఇచ్చిన అలుసుతో అందరికీ చెందిన ఆలయం కొందరి సొంత పనులకు పరిమితమైందేమో అనిపించింది. ఒక వైపు నీటి తొట్టి, మరో వైపు పశువుల ఆశుపత్రి, గోడలను దాటితే ఏపుగా పెరిగి సర్కార్ తుమ్మలు నిర్లక్ష్యానికి నిలువుటద్దాలయ్యాయి.


క్రీ.శ. 14వ శతాబ్ది ఆలయం బయట ఇలా ఉంది, లోపల ఎలాఉందోనని తొంగి చూశా. గుప్త నిధుల కోసం మండపం, గర్భాలయాలను తవ్వేసి చిందర వందర చేశారు. కప్పు బండలు తొలగిపోయాయి వానలు కురిసి, మట్టి పేరుకుపోయింది. ముట్టె విరిగిపోయినా, అపురూపంగా చెక్కిన నంది, ఈ ఆలయం ఒకప్పుడు త్రికాలార్చనలందుకొన్నదని చెబుతుంది. తంగెడ కృష్ణానది ఒడ్డునున్నా, తాగు నీటికి ఎప్పుడూ కటకటే. ఎప్పుడో మధ్య యుగాల్లో రాతినేలను తొలచి మలచిన మెట్లబావి ఆ ఊరికి ఆకాశ గంగ. బావిలోపల ఒక మట్టంలో ఒక ఆలయం,



ఇంకోమట్టంలో మరో ఆలయం ప్రక్కనే రావిచెట్టు, ఆచెట్టు ముందు ఇంకొక చిన్న ఆలయం. అన్నీ చూచిన తరువాత, కొట గోడల చుట్టూతిరుగుతున్న నాకు, ఆ గోడ లోపల గడ్డివాములు, పశువుల కొట్టాలు, గోడకు బయట చెత్తకుప్పలు, పిచ్చిమొక్కలు, యుద్ధంలో చేయితెగిన సైనికునిగా కన్పిస్తున్న పడిపోయిన పశ్చిమ సింహద్వారపు నిలువు స్థంభాలు, నాకు మళ్లీ మనశ్శాంతి లేకుండా చేశాయి. పశ్చిమ ద్వారం నుంచి బయటికొచ్చి మట్టపల్లి బ్రిడ్జి దాకా



వెళ్లాను. అక్కడ పులిచింతల రిజర్వాయరులో మునిగే ఒక 13వ శతాబ్ది దేవాలయాన్ని ఊడదీసి పదేళ్లక్రితం ఆ రాళ్ళను రోడ్డు ప్రక్కనే అనాధ శవాల్లా పడేశారు. చక్కటి చెన్నకేశవ విగ్రహం ముక్కలైంది. రోడ్డుకు ఎడమవైపున ఏనుగులు నీళ్లు త్రాగే 20 అడుగుల పొడవు 3 అడుగుల లోతు, అంతే వెడల్పుగల రాతి తొట్టి ఎవరికీ పట్టకుండా ఉంది. ఇంకా ముందుకెళ్లాను. వరుసగా దాదాపు వంద వరకూ రాతి పెట్టెల్లాంటి కట్టడాలు కన్పించాయి. పరిశీలించి చూస్తే



అవి క్రీ.పూ. 1000 నాటి ఇనుప యుగపు సమాధులు. కొత్త వంతెన కోసం 25 సమాధులు ఆనవాళ్లు కోల్పోయి చరిత్రకు



చరమగీతం పాడాయి. రోడ్డుక్కావల్సిన కంకర కోసం మిగిలిన సమాధిరాళ్లూ బలైపోయాయి. పెద్దల తప్పిదాలకు పిల్లల సమాధులు చిన్నబోయాయి. తెలిసినా, తెలియక పోయినా, చరిత్రకు అపచారం జరిగింది. వారసత్వం వరసతప్పింది. శాసనాలకు శ్వాస ఆగింది. శిల్పాలు నిర్వికల్పాలయ్యాయి. శిధిలాలు వ్యధాభరిత కధనాలు చెబుతున్నాయి. అమరుడైన కుమారగిరిరెడ్డి కళకళలాడిన తంగెడ వెలవెలబోవడం చూచి కుమిలిపోయాడు. చొక్కన సింగన ముక్కున వేలేసుకొన్నాడు. తంగెడ స్థల శిధిలాలను చూచిన శ్రీకృష్ణదేవరాయలు మనోవ్యధకు గురైనాడు. ఇంటికొచ్చి బువ్వతింటూ తంగెడను తలచుకొంటే, నాకు మింగుడు పడటం మానేసింది.

**కవిత**

## మీకేమైనా తెలుసా

నేను ఆకాశపు శూన్యాన్ని
అనుకుంటుంటే...
మదిలో అంటుకుపోయిన
చింతల చిగుళ్ళు
గుబులు మొయిళ్ళు ఫక్కున నవ్వాయి!!!

నేను ధరిత్రిననగానే...
చీటికి మాటికి మొలకెత్తే
అసహనపు ఆనవాళ్ళు
నిక్కిచూశాయి!!!

నేను మలయానిలాన్నందామంటే...
గుండెల్లో ఎగసే విద్వేషపు
అసూయల లావాలు భగ్గమన్నాయి!!
నిర్మల జలాన్ననుకుందామంటే...
అంతరంగంలో ఆగని సాగరఘోష
నిలువనీయటం లేదు!!!
పంచభూతాలు కలగలసినా..ముఖ్యంగా.
పార్ధివాన్నని... నాకింకా తెలీటంలేదు..!!

అనలమై ఎగసిపడుతూ...
ఝరినై తుళ్ళిపడుతూ...
మేఘాల ముసురుకు కన్నీరు పెడుతూ...
దరి లేని తలపులకారడవుల పడి, లేస్తూ..
లేఖిని నిండా చిత్రవర్ణాలు నింపి.
గరళాన్ని, ఆర్ణవాన్ని
అక్షరాల జల్లుగా చల్లుకుపోతున్న నేనేంటో
నాకు తెలియటం లేదు...???
మీకేమైనా తెలుసా...నేనెవరో..!!!???

–సుభాషిణి ప్రత్తిపాటి
8099305303

**కవిత**

## సాక్ష్యం ....!!

చదువుగురించి
మాట్లాడుకోవాలి,

చదువు..
ఏభాషలో సాగిందీ
చెప్పుకోవాలి.

చదువు ఎక్కడ
కొనసాగిందీ
చర్చించుకోవాలి !
దిగువ మధ్యతరగతి
నేపథ్యంగా
ప్రభుత్వ విద్యాసంస్థలే
నా ప్రగతికి
అండగా నిలిచాయి.

నన్నొక బాధ్యతగల
దంత వైద్యుడిని చేసాయి,

సామాజిక సమస్యలకు
స్పందించే
కవిని చేసాయి...
కథకుడిని చేసాయి..
వ్యాసకర్తను చేసాయి..
ఒక సాహిత్యకారుడిగా
తయారు చేసాయి ...!

చెప్పొచ్చేదేమిటంటే,
వృత్తి విద్య తప్ప
మిగతా చదువంతా
మాతృభాషా
మాధ్యమంలోనే ...!

నాకొక గొప్ప జీవితాన్ని
అందించింది
తెలుఁగు భాషే ...
తెలుగుతల్లికి వందనం ..!!

–డా.కె .ఎల్.వి.ప్రసాద్
9866252002

'రెండో భాష నేర్చుకోవటానికీ, ఉన్నత విద్యకు పోయే కొద్దీ మరో భాషలో చదువుకొనసాగించటానికి తల్లి భాష పునాదిగా ఉండి, వేదికలా పనిచేస్తుంది. కాబట్టి ఉన్నత విద్యలో రాణించటానికి ఉపయోగ పడుతుంది. సొంత భాషలో నేర్చుకున్న జ్ఞానం, నైపుణ్యం అంతా దానంతట అదే నేర్చుకొనే భాషలోకి మారుతుంది. కొత్తగా నేర్చుకోవల్సిన అక్కర ఉండదు'

నవల

డి.పి. అనూరాధ
90100 16555




*జరిగిన కథ*

***ప్రవల్లికను వెతుకుతూ సూర్యవర్మ శ్రీలంక వెళతాడు. అనూహ్య పరిస్థితుల్లో కండి కోట రాజ్యం గురించి తెలుసుకుంటాడు. శ్రీలంకను పరిపాలించిన ఆఖరు ప్రభువులు తెలుగు వారని తెలిసి ఆశ్చర్యపోతాడు. నేటికీ తెలుంగు మాట్లాడుతోన్న శ్రీలంక మూల వాసుల్ని కలుసుకుని విస్మయానికి గురై వాళ్ల ఊర్లలో పర్యటించడానికి బయల్దేరతాడు. అతడి కలల రాకుమారిని కలుసుకుంటాడా?***

**మ**సన్న అన్న కూతురి ద్వారా ప్రవల్లికను కలుసుకోవాలనే ఆరాటం. ఎప్పుడెప్పుడు ఊరు వెళతామా అని గడియారం చూస్తూ కూర్చున్నా. అసలు మసన్నది ఏ ఊరు. ఆ విషయమే అడగలేదన్న సంగతి గుర్తుకువచ్చింది.

'అన్నా, మనది ఏ ఊరు'

'కలవేవ, అనురాధపురా నుంచి ఓ యాభై కిలోమీటర్లు ఉంటాది. మనోళ్లందరమూ కోతుల్ని ఆడిస్తూనో, పాముల్ని ఆడిస్తూనో బతుకుతున్నాం. లంకోళ్లు మాకు 'అహికుంతికలు' అని పేరుపెట్టారు. ఈ దేశంలో మాది ప్రత్యేక జాతి. మేం సింహళోళ్లమే కాదు. తమిళులమూ కాదు. నిన్నా మొన్నటి వరకూ సంచార జీవితమే గడిపినాము. ఇప్పుడిప్పుడే ఇళ్లు కట్టుకుని ఓ చోట కుదురు కుంటున్నాం. పుత్తళం, దేవరగమ్మ, కుడాగమాలో మనోళ్లు ఎక్కువగా ఉండారు.

మసన్న మాటలు వింటుంటే నాకు మయన్మార్ల్ 'మన్ జాతీయులు గుర్తుకువచ్చారు. కానీ వాళ్ల మాతృభాష తెలుగుకాదు. అసలు తెలుగు నేల నుంచి వెళ్లిన సంగతినే వాళ్లు మరచిపోయారు. శ్రీలంకలోని ఈ 'మన జాతీయుల' మాతృభాష తెలుగే. వీళ్లు ఎవరు? క్రీస్తు పూర్వం విజయుడితో ఇక్కడికి వచ్చారా? లేక అశోకుడి కూతురు సంఘమిత్ర సపరివారంలో ఉన్నారా? లేక శ్రీలంక మూల జాతీయులా? వాళ్ల గురించి నేషనల్ లైబ్రరీకి వెళ్లి సమాచారం సేకరించాలి. వీళ్ల తెలుగు మన తెలుగు లాగానే ఉంది. అక్కడక్కడ తమిళ, సింహళ పదాలు ఉన్నా సులభంగానే అర్థం అవుతోంది. విజయనగర సామ్రాజ్య కాలంలో వలస వచ్చినవారా? మయన్మార్ 'మన్' కూ శ్రీలంకలోని 'మన'కూ ఏదైనా సంబంధం ఉందా? అన్నీ శేష ప్రశ్నలే.

'ఇదే కలవేవ' మసన్న మాటలకి నా ఆలోచనల్ని పక్కన పెట్టాను. ప్రవల్లిక గురించి సమాచారం తెలుస్తుంది అనే ఊహే నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. ఈసారెలాగైనా నా ప్రేమను గెలిపించుకోవాలి.

అటు పెద్ద ఊరు కాదు చిన్నది కాదు కలవేవ... ఓ మోస్తరు నగరం. మసన్న ఇల్లెక్కడా అన్న ఆత్రంలో ఉన్నా. నగరమంతా దాటేసి బయటికి వచ్చాం. కాస్త దూరం వెళ్లాక ఓ చిన్ని గ్రామం. మట్టి రోడ్లు. కొన్ని ఇటుకలతో నిర్మిస్తే మరి కొన్ని గుడిసెలు. మామిడి చెట్లు, వేప చెట్లు.. కొన్నిటికి చీర ఉయ్యాలలు వేలాడదీశారు.

'సూర్యా, మనం ఇంటికి వెళ్లగానే నువ్వు టాక్సీని ఇడిపించేయి. అంత దవ్వు నుంచి వచ్చావు. మాతో కొన్ని రోజులు ఉండు. దేశం విషయాలు చెప్పు. మన వాళ్లందరూ చాలా సంతోషవెలయితరు.' మసన్న మాటలు కాదనలేకపోయాను.

'ఇదంతా మన తావే.. వారం రోజుల కంటే ఎక్కువ ఎక్కడా ఉండకుండా మా తాతముత్తాతలు ఉండారు. బయటి ప్రపంచాన్ని పట్టించుకోకుండా మా లోకంలో మేం ఉన్నాం. కానీ నాగరికత వల్ల మాకు నిలువు నీడ లేకుండా పోయింది. నలభై ఏళ్ల నుంచి ప్రభుత్వం మాకు మల్లు ఇచ్చింది. ఇలా ఇల్లు కట్టుకుంటున్నాం. మాలో ఎవరమూ చదువుకోలేదు. ఈనాటికీ మా తాతముత్తాతల్లా కోతుల్ని, పాముల్ని ఆడిస్తూ పొట్టనింపుకుంటున్నాం.'

శ్రీలంకలో తెలుంగు జాతి కష్టాల్ని మసన్న మాటలు తెలియజేస్తున్నాయి. వీళ్లు జిప్సీల్లాంటి వాళ్లన్నమాట. వీళ్లకి మన



ప్రభుత్వాల తరఫున సహాయం అందించేలా చూడాలి.

'సూర్యా, ఇదే మన ఇల్లు..'

'మెతానిన్ నవతిన్న' క్యాబ్ డ్రైవర్‌తో సింహళంలో ఏదో చెప్పాడు మసన్న. కారు డిక్కీలోంచి సామానుదించాడు. కారు వాడికి అప్పటి వరకూ అయిన డబ్బు ఇచ్చేసి పంపించేశాను.

మా కారు ఆగిన శబ్దానికి ఇంటి లోపలి నుంచి ఓ నడివయసు స్త్రీ బయటకి వచ్చింది. మసన్న ఆమెతో 'మనోడే, దేశం నుంచి వచ్చినాడు' అని చెప్పాడు.

'సూర్యా, నా పెండ్లాం కళావతి..' అంటూ పరిచయం చేశాడు'

'నమస్తే, వదినా' అన్నా. ఆమె మొదట నన్ను చూసి కాస్త ఆశ్చర్యపోయినా ఆ తరవాత చిరునవ్వుతో ఆహ్వానించింది.

వసారాలో ఉన్న చెక్క బెంచీ మీద ఇద్దరం కూర్చున్నాం. వదిన మా ఇద్దరికీ స్టీలు గ్లాసుల్లో మంచి నీళ్లు తెచ్చి ఇచ్చింది.

చల్లగాలి వీస్తోంది. ఇక్కడ పరిసరాలు చాలా స్వచ్ఛంగా ఉన్నాయి. కాలుష్యం ఇంకా వీళ్ల వాడను తాకలేదు.

'ఇల్లు చూపిస్తా రా సూర్యా' అంటూ లోపలికి దారి తీశాడు. తన వెంటే నేనూ.

వసారాను ఆనుకుని హాలు. అది కాస్త పెద్దదే. ఓ పక్క ధాన్యం బస్తాలు.. ఓ ప్లాస్టిక్ టేబుల్, నాలుగు కుర్చీలు వేసి ఉన్నాయి.

ఆ హాలు నుంచి నేరుగా ఉన్న తలుపులోంచి లోపలికి వెళితే పడక గది. ఓ నాలుగు పరుపులు చుట్టి ఉన్నాయి. ఆ గదిలో ఉన్న కిటికీకి ఆనుకుని ఆరడుగుల చెక్క బల్ల వేశారు. బల్ల పక్కనే నా సామాను పెడుతూ..

'ఇదే నీ గది సూర్యా, ఎన్ని రోజులైనా నువ్వు హాయిగా ఉండొచ్చు. మా ఇల్లు చిన్నది కావచ్చు కానీ మనసు కాదు' నా కళ్లలోకి సూటిగా చూస్తూ చెప్పాడు.

ఒక్కసారిగా ఆయన దగ్గరికి వెళ్లి హత్తుకున్నాను. తను సంతోషంగా నన్ను చూశాడు.

హాలులోనే ఓ వైపు వంటగది. ఇద్దరమూ హాలు మధ్యలో ఉన్న ఇంకో తలుపులోంచి బయటకి వచ్చాం. బయట అంతా చిన్నపాటి తోట. ఆనపకాయలు, కాకరకాయల తీగలు అల్లుకున్నాయి. గులాబీలు, మందారాలు విరబూశాయి. నీమకోళ్లనూ పెంచుతున్నారు. వాటి కోసం ప్రత్యేకంగా ఓ షెడ్డులాంటిది చేశారు. ఓ కోడి పెట్ట తన పిల్లలతో తిరుగుతోంది. ఇంత దాకా ఎక్కడుందో కానీ వచ్చింది ఓ కుక్క. తోక ఊపుతూ మసన్న దగ్గరికి వెళ్లింది. 'జాకీ' అంటూ దాన్ని ముద్దు చేస్తున్నాడు. ఓ పక్క స్నానాల గది. అటు వైపే చూస్తూ..

' ఇది ఆడోళ్ల స్నానాల గది, కాస్త దవ్వులో కాలువ ఉంది. మగాళ్లందరమూ పొద్దునే అక్కడికి వెళ్లి స్నానాలు చేసి, బట్టలు ఉతుక్కుని వస్తాం. తాగు నీళ్లు, వాడకం నీళ్లు అన్నీ అక్కడి నుంచి తెచ్చుకోవలసిందే' వివరించాడు మసన్న.

మామిడి చెట్టు కింద ఓ బకెట్లో నీళ్లూ, మగ్గూ ఉన్నాయి. తను వెళ్లి కాళ్లూ చేతులూ కడుక్కుని లోపలికి వెళ్లాడు.

నేనూ కాళ్లూ చేతులు కడుక్కుని ఆ చల్లగాలికి అక్కడే ఉండిపోయాను. మామిడి చెట్టంతా చిగురేసింది. అక్కడక్కడా పిందెలు వేసింది. చెట్టుకానుకుని ఉండిపోయా. ప్రవల్లికకు నాకూ ఇంకా ఎంత దూరం అని ఆలోచిస్తుంటే గుర్తొచ్చింది మసన్న వాళ్ల అన్న కూతురు.

మసన్నే రెండు కప్పుల్లో టీ తీసుకుని వచ్చాడు. టీ తాగుతూ అడిగాను

'మీ అన్న వాళ్ల ఇల్లు ఎక్కడ?'

'ఈ పక్కదే మా అన్నోళ్లది. తన పేరు ఎర్రన్న. ప్రభుత్వం ఇచ్చిన భూమిలో వ్యవసాయం చేస్తూ స్థిరపడ్డాడు. ఏటా తనే కొన్ని ధాన్యం బస్తాలూ నాకూ ఇస్తాడు. రా వెళదాం అన్నోళ్లింటికి'

అలాగే తోటలోంచి వెళితే పక్క ఇల్లే ఎర్రన్నది. ప్రతి ఇంటి చుట్టూ కాంపౌండ్ లాంటి విభజన ఇంకా ఇక్కడ చేసుకోలేదు.

ఎర్రన్న ఇంటి చుట్టూ తోట... రకరకాల పూలు.. చెట్లు మామూలే.

వసారా నుంచే ' అన్నా' అని పిలుస్తూ మసన్న వెళుతున్నాడు. తన వెనకే నేనూ.

'రా, మసన్న' హాల్లోంచి మాటలు విన్పించి మేం లోపలికి వెళ్లాం.

సోఫాలో కూర్చుని టీవీ చూస్తున్న ఎర్రన్న నన్ను చూసి లేచాడు.

'అన్నా, ఇతడు సూర్య, ఏదో పని మీద దేశం నుంచి వచ్చాడు. మనింట్లో కొన్ని రోజులు ఉండమని తీసుకువచ్చా.'

ఆయన నన్ను చూస్తూ కాస్త ఆశ్చర్యపోతూ దగ్గరగా వచ్చి..

'దేశంలో మన తెలుంగు గుంపు పెద్దదేనా'

'చాలా పెద్దది తొమ్మిది కోట్ల మందిమి ఉంటాం'

'భలేగా ఉందే..' సంబరంగా నవ్వాడు ఎర్రన్న.

'అన్నా, లచ్చిమి లేదా?' మసన్న ఎవరి కోసమో వెతుకుతూ అడిగాడు.

'లేదు, పురానికి పోయింది.. రేపొస్తాది' అన్నాడు.

'మా అన్న కూతురు లచ్చిమి, తనే బుద్ధ పాదాల యాత్రలో ఇండియా పోయి వచ్చినాది' మసన్న చెబుతుంటే వింటున్నా కానీ మనసులో మాత్రం బాధ.

'సూర్యా, సాయంత్రం మనోళ్లందరినీ పిలిపిస్తా, నువ్వు మాకు దేశం విశేషాలు చెప్పాల' ఎర్రన్న కోరాడు. సేరేనని చెప్పా.

మళ్లీ కలుస్తాం అని చెప్పేసి మసన్న ఇంటికి వచ్చేశాం.

'నేను గదిలోకి వెళ్లి కూర్చుండిపోయాను. కిటికీ లోంచి బయటకి చూస్తూ... కాసేపటికి బయట అలజడి మొదలైంది. వెళ్లి చూస్తే... చంటి పిల్లలతో తల్లులు, పడుచువాళ్లు, ముసలి వాళ్లు.. ఆడామగా అంతా చేరి ఓ ముప్ఫై నలభై మంది. వాళ్లలో ఎర్రన్న





ఉన్నాడు. వాళ్లందరూ నన్ను ఎంతో అభిమానంతో చూస్తున్నారు.

వీళ్లెవరు, వీళ్లకూ నాకూ ఏమిటీ సంబంధం అన్పించింది. కానీ వీళ్లందరూ నా తెలుగు తోబుట్టువులు. మా అందరిలో ప్రవహిస్తోంది తెలుగు రక్తమే. అందుకే ఇంతమంది తమ ఆత్మీయుడిని చూడాలన్నంత ఆత్రంగా వచ్చారు.

'సూర్యా, దేశం గురించి, తెలుంగుజాతి గురించి నువ్వు చెబితే మేమదరమూ వినాలని మనసుపడుతున్నాం..' మసన్న కోరాడు.

'లంకకు కొద్ది దూరంలోనే భారతదేశం ఉంది. అక్కడ రెండు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలలో మొత్తంగా తెలుంగే మాట్లాడతారు. ఇతర రాష్ట్రాలలో కూడా తెలుంగు మాట్లాడేవాళ్లు చాలానే ఉన్నారు. మనది మొత్తం తొమ్మిది కోట్ల గుంపు. లంకలో మీవి ఎన్ని కుటుంబాలో తెలియదు, ఎంత మంది ఉండారో తెలియదు. కానీ ఇతర దేశాలలో చూస్తే మన తెలుంగు జాతిది చాలా పెద్ద గుంపు.. కాస్త సరళంగా వాళ్లకి అర్థమయ్యేలా చెప్పడానికి ప్రయత్నించా.

'మన గుంపులో రాజపక్ష లాంటి వాళ్లు ఉన్నారా? ఎవరో ప్రశ్న వేశారు

ఎందుకు లేరు. మన తెలుంగు వారు భారతదేశ అధ్యక్షుడిగా, ప్రధానమంత్రిగా చేసిన వాళ్లు ఉన్నారు.

'మన తలైవా ఎన్టీఆర్ అనీ అక్కడెక్కడో ఉండాడని ఇక్కడికి వచ్చి మా జీవితాలని మారుస్తాడని మా తాత చెప్పేవాడు. ఆ ఎన్టీఆర్ ను చూడకుండానే మా తాత పోయాడు. ఆ ఎన్టీఆర్ ఉండాడా? మరో ప్రశ్న.

ఆ యువకుడు ముప్పై ఏళ్ల వాడు. 'నీ పేరేమిటి'

'సుబ్బడు'

'సుబ్బడూ, ఆ మహానటుడు, మహా తలైవా మరణించి చాలా ఏళ్లవుతోంది. ఇప్పుడున్న తలైవాలతో మీ గురించి చెబుతా.

'దేశంలో మనోళ్లు ఈనాటికీ ఏల్ నాళ్ల పెళ్లిళ్లు చేసుకుంటున్నారా, ఓ మధ్య వయసు స్త్రీ ప్రశ్నించింది.

'అమ్మా, మీ పేరేమిటి?

'ముత్తుమారి'

'ఇక్కడ మీ పెళ్లిళ్లు అలా జరిగేవా అమ్మా'

'ముందర అలా జరిగేవి. పెళ్లికొడుకు పెళ్లికూతురింటికి వచ్చేవాడు. గుడారాలు వేసేవాళ్లం. తాళికట్టడం, నల్ల పూసలు వేసుకోవడం అంతా ఉండేది. అందరూ చేరి తినేది, తాగేది. కసాటాలు రాసేవారు. ఇప్పుడు అలాంటిది లేదు. సింగలంలోనే కసాటాలు రాస్తున్నారు. బుద్ధుడిని కొలుస్తున్నాం కదా పెళ్లి కూడా ఒక్క పూటలో అయిపోతుంది'. కాస్త బాధ పడుతున్నట్టుగా అన్పించింది.

'మరి ఈ వీధి మొదట్లో గణేష్ మందిరం కన్పించిందే' వీళ్ల మతం గురించి తెలుసుకోవాలనే ప్రశ్నించాను.

ఎర్రన్న ముందుకు వచ్చాడు. 'సూర్యా, అదంతా ఓ పెద్ద కత అవుతాది. మా తాత ముత్తాతలు, వాళ్ల తాతలు అంతా సంచారులే. వారం రోజులు కూడా ఒక్క చోట ఉండేవాళ్లు కాదు. క్రమంగా నాగరికత పెరిగింది. నగరాలు, ఊర్లు పుట్టుకొచ్చాయి. మాకు ఉండడానికి ప్రాంతాలు తగ్గిపోయాయి. గత నలభై ఏళ్ల నుంచే ఇలా అందరమూ ఓ చోట చేరి ఇళ్లు కట్టుకుని నివసిస్తున్నాం. మా వాళ్లు మరణించినప్పుడు ఏ స్మశానానికి తీసుకువెళ్లాలో తెలిసేది కాదు. ఎక్కడా మమ్మల్ని అనుమతించేవాళ్లు కాదు. అందుకే చాలా మటుకు బౌద్ధానికో, క్రైస్తవానికో మారుతున్నాం. కుడాగమా, దీవరగమ్మలలో మేమంతా బుద్ధుడిని పూజిస్తున్నాం. పుత్తలం లాంటి చోట్ల ఏసుప్రభువును పూజించే వాళ్లు ఎక్కువ.' అంటే మరణానంతర పరిస్థితికి భయపడి మతం మారుతున్నారు. ఈ భూమ్మీద ఇలాంటి సమస్య మరెవ్వరికైనా ఉంటుందా అన్పించింది. చాలా బాధేసింది. అవేవీ కన్పించకుండా ..

'దేశంలో ఉన్న మనోళ్లకు మీ గురించి ఏమన్నా చెప్పాలా?

'దేశంలో ఉన్న మనోళ్లను ముందు చూడాలని ఉంది, నాకు ఇండియా రావాలని ఉందన్నా' మొదట సుబ్బడు స్పందించాడు.

'మాకు కుర్రు లేదు, బిల్లలు సింగలమే నేరుస్తున్నారు. మన తెలుంగు కుర్రు నేర్పిస్తే బాగుంటాది' మరో అభ్యర్థన.

నిజమే. తెలుగులో మాట్లాడుతున్నారు. కానీ ఆ అక్షరాలు రాయలేరు. కాబట్టి వాళ్ల చరిత్రను రాసిపెట్టుకోలేకపోయారు. చంటి పిల్లాడితో వచ్చింది ఓ పాతికేళ్ల యువతి. ఆ బాబును చూస్తూ ఏం పేరని అడిగాను.

'వేలుకమల్, సింగలం పేరు పెట్టా. మావి తెలుంగు పేర్లని సింగలం వాళ్లు గేలి చేస్తారు. అందుకే బడి మానేశా. ఇప్పుడు కూడా వాళ్ల ఇళ్లల్లోకి రానివ్వరు. మమ్మల్ని దూరంగా పెడతారు. నా బిడ్డ ఆ కష్టాలు పడకూడదు. అందుకే సింగలం పేరు పెట్టా. సింగలమే

నేర్పిస్తా.' కాస్త ఆవేశంగా మాట్లాడింది. కానీ ఆమె ప్రతి మాటా ఆలోచింపజేసేదే.

'మీ మాటలన్నీ గుర్తుపెట్టుకుంటాను. దేశం వెళ్లగానే మనోళ్లందరికీ చెప్పి మీకు మంచి చేయడానికి ప్రయత్నిస్తా' ముక్తాయింపుగా చెప్పా.

ఒక్కొక్కరూ తలలూపుతూ వెళ్లిపోతున్నారు. చీకటి పడుతోంది. మసన్న భోంచేయడానికి రమ్మన్నాడు. ఏదో అలా తినేసి భారమైన ఆలోచనలతో నిద్రకు ఉపక్రమించా. పేదరికపు అంచుల్లో ఉన్న ఈ తెలుంగుజాతి వారికి ఎలాగైనా సహాయం చేయాలని కంకణం కట్టుకున్నా.

తెలతెలవారుతుండగా మసన్న వచ్చి నిద్రలేపాడు. కాలువ కాడికి వెళ్లి స్నానం చేయాలని ముందు రోజు చెప్పిన సంగతి గుర్తొచ్చింది. ఇంకా అయిదు గంటలు కూడా కాలేదు. వేపపుల్లతో పళ్లు తోముకుంటా తువ్వాలను భుజానికేసుకుని బయల్దేరాం.

ఆ ఇండ్లు.. వీధులు దాటుకుని రాగానే అటూ ఇటూ పొలాలు.. మధ్యలో ఎనిమిది అడుగుల వెడల్పున్న మట్టిరోడ్డు.. చల్లటి పైరగాలి.. ఆకాశంలో బంగారు వర్ణ కిరణాలు పరుచుకుంటున్నాయి. మనసంతా హాయిగా ఉంది...

మా ఎదురుగా నీళ్ల బిందె నడుముపై పెట్టుకుని ఓ యువతి వస్తోంది. ఆమెను చూడగానే మసన్న 'మా లచ్చిమి' అన్నాడు.

నా గుండె కొట్టుకోవడం ఆగిపోయి.. ప్రపంచమంతా స్తంభించింది. తను మరెవరో కాదు, నా ప్రవల్లికే. అంటే ఈ జన్మలో శ్రీలంకలో లచ్చిమిలా పుట్టిందన్నమాట. ఆమెనే చూస్తుండిపోయాను. తను మా దగ్గరికి రాగానే మసన్న..

'అమ్మా లచ్చిమి, పురం నుంచి ఎప్పుడు వస్తివి?

'రేయి పొద్దుపోయినాకు వచ్చిన చిన్నాన్న'

ఆ తియ్యటి స్వరం నా మనసుకు ఉయ్యాల ఊపినట్టుగా అన్పించింది. నాడు రాకుమారిలా చూసిన యువతిని నేడు సాధారణంగా చూడడం కాస్త ఇబ్బంది కలిగిస్తోంది. ఆమె భుజాన తడి బట్టలు ఉన్నాయి. అంటే ఇంత పొద్దున్నే నిద్రలేవడమే కాదు, బట్టలు ఉతుక్కుని మంచినీటిని ఇంటికి తీసుకెళుతోంది. కష్టజీవిగా అన్పించింది.

తనకు నన్ను పరిచయం చేస్తూ..'ఇతడు సూర్య, దేశం నుంచి వచ్చాడు. మనింట్లోనే ఉండాడు. మళ్లీ కలుస్తాంలే' అన్నాడు మసన్న.

లచ్చిమి నన్ను చూస్తూ పలకరింపుగా నవ్వి ... ముందుకు సాగింది.

ప్రపంచంలోని పూలజాతులన్నీ ఓ వైపు వేసినా ఎంతకీ తూకనిది ఆమె నవ్వు..

ఆలోచనలతో అలాగే మసన్నను అనుసరించా.

కాలువ వచ్చింది. కొంత మంది పురుషులు ఈతకొడుతున్నారు. కాస్త దూరంలో స్త్రీలు ఉన్నారు గట్టుమీద.

నేనూ, మసన్నా నీళ్లలోకి దిగాం. అంత లోతుగా లేదు. చాలా చల్లగా ఉన్నాయి నీళ్లు.

'సూర్యా, ఇదంతా కలవేవ నీళ్లే. కలవేవ అనేది ఇక్కడ పెద్ద మంచి నీటి సరస్సు. రాజుల కాలంలో నిర్మించారు. ఎన్నో కాలువల ద్వారా ఆ నీటిని వ్యవసాయానికి మళ్లిస్తున్నారు. అలాంటి ఓ కాలువే ఇది. ఎండల కాలమైనా ఆ సరస్సు ఎండిపోదు. ఈ కాలువ ఎప్పుడూ ఇలాగే ఉంటుంది.' మసన్న వివరిస్తున్నాడు.

ఆ విషయాలన్నీ గొప్పగా ఉన్నా నా ధ్యాసంతా ప్రవల్లిక మీదే. ఇంటికి ఎప్పుడు వెళ్లాలి, ఆమెను ఎప్పుడు కలవాలి అనే ఆలోచిస్తున్నా.

ఇంటికి వచ్చాక కూడా అదే ధ్యాస. నా గదిలోకి వెళ్లిపోయా. బల్లమీద కూర్చుని కిటికీలోంచి చూస్తూ ఆలోచనలో మునిగిపోయా. అలా ఎంత సేపు ఉన్నానో..

'చిన్నమ్మా'.. బయటి నుంచి మృదువైన స్వరం విన్పించింది. ప్రవల్లికదే అని నా మనసు చెప్పింది. కానీ బయటకు రాలేకపోయాను.

'సూర్యా' అంటూ మసన్న పిలవడంతో హాల్లోకి వచ్చా. ఎదురుగా లచ్చిమే ఉంది.

'ఇండియా బుద్ధ పాదాల యాత్ర గురించి తెలుసుకోవాలని ఉంది అన్నావ్ కదా, లచ్చిమితో మాట్లాడు' అన్నాడు.

మేం ముగ్గురం హాల్లోనే కూర్చున్నాం. వదిన వంటింట్లో ఉంది.

కాస్త చొరవగా 'లచ్చిమి, నువ్వు ఇండియాలో ఎక్కడెక్కడికి వెళ్లావ్?'

నన్ను ఓ క్షణం తేరపార చూసింది. కాసేపు ఏదో ఆలోచించి...

'బుద్ధ భగవానుడికి సంబంధించి ముఖ్యమైన బుద్ధగయ, సారనాథ్, కుషీనగర్‌కు వెళ్లాం. నేపాల్‌లోని బుద్ధ జన్మస్థానం లుంబినిలో ప్రార్థనలు చేశాం. తిరిగి వస్తూ దక్షిణ భారతదేశంలోని నాగార్జునకొండకు వెళ్లాం. అక్కడ వేల ఏళ్ల క్రితం మా సింహాళీయులు నిర్మించిన విహారాన్ని దర్శించాం. మూడు రోజుల పాటు ప్రత్యేక ప్రార్థనలు జరిపాం. అక్కడ అందరూ తెలుంగు మాట్లాడుతున్నారు. వాళ్లంతా మా కుదురే అన్పించింది. మీరు తెలుంగు వారా?' సూటిగా ప్రశ్నించింది.

'అవును, నాగార్జునకొండ సమీపంలో మా ఊరు ఉంది'

'లచ్చిమీ, సూర్య మన చుట్టం. పురంలో మహాబోధి దగ్గర నాకు కన్పించాడు. మనూరికి తీసుకువచ్చా. తనకి మన తావులన్నీ నువ్వే దగ్గరుండి చూపించాల' మసన్న నా గురించి లచ్చిమికి చెబుతున్నాడు. తను ఆసక్తిగా నన్నూ, మసన్ననూ చూస్తోంది.

'సూర్యా, మా కలవేవలో కాలేజీ వరకు చదువుకుంది లచ్చిమి ఒక్కతే. అందుకే నీ పనులన్నీ తనకి పురమాయించాను' మసన్న వివరిస్తున్నాడు. సింహాళం, తమిళం, తెలుంగు, కాస్త ఆంగ్లమూ మాట్లాడగలదు.

'లచ్చిమీ...' వాళ్ల నాన్న పిలుపనుకుంటా.

'వస్తున్నా అయ్యా' అంటూ మళ్లీ వస్తా చిన్నాన్న అని చెప్పి వెళ్లిపోయింది.

'తల్లి లేని పిల్ల. అయ్య గారాబంగా పెంచినా అందరికీ సహాయం చేయడంలో ముందుంటుంది. మంచి పనిమంతురాలు' కళావతి వదిన లచ్చిమి గుణగణాలు వివరిస్తోంది.

నా మనసు గాల్లో తేలుతోంది. ప్రవల్లిక అదే నేటి లచ్చిమి నా కళ్లెదురుగానే ఉంది. నా పక్క ఇంట్లోనే నివసిస్తోంది. ఈ ఊహే నన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తనకి నేను గర్తులేను. థాయిలాండ్లో మా ప్రేమ కథంతా తనకి తెలియజేయాలి. కానీ ఎలా... తను నన్ను విడిగా కలుస్తుందా? అదంతా నిజమని నమ్ముతుందా?

కట్టు కథని కొట్టిపారేస్తే... లచ్చిమితో ఎలాగైనా సరే మనసు విప్పి మాట్లాడాలి...

ఎలా... ఎలా... ఎలా?

(తరువాయి వచ్చే సంచికలో...)

డా॥ మధురాంతకం నరేంద్ర
98662 43659

# నిరుడు వెలిగిన 'పత్రిక'

**'వాట్స్** ఆప్'లో యిటీవల వొక వ్యంగ్య చిత్రం చిందులు తొక్కింది. అందులో పెద్ద గుంపు వో వస్తువిశేషం చుట్టూ చేరి అదేమిటో తెలుసుకోలేక ఆశ్చర్యపడుతూవుంటారు. యింతకూ ఆ వస్తువిశేషం మరేమిటోగాదు. అది వొక పుస్తకం. టీవీలూ, సినిమాలూ, అంతర్జాలమనే మాయా జాలమూ విరుచుక పడడంవల్ల, మనుషులంతా క్రమంగా పుస్తకమనే స్నేహితుడ్ని మరిచిపోతున్నామని ఆ చిత్రకారుడి అభిప్రాయం. పుస్తకమే లేని ప్రపంచమొకటి రాబోతోందని అతని భయం. ఆ చిత్రకారుడు తప్పకుండా తెలుగువాడే అయివుంటాడు. పుస్తకమన్నదాన్ని మానవజాతి మరిచిపోవడమ న్నదెప్పుడైనా జరిగితే, ముందుగా అది తెలుగు రాష్ట్రాల్లోనే జరిగి తీరుతుంది. అసలే సాహిత్యపత్రిక లేని జాతిగా గొప్ప గుర్తింపు పొందిన తెలుగులో యిటీవల దాదాపు యెనిమిది నెలలుగా ముంచుకొచ్చిన 'కోవిడ్ కరోనా' అనే మహమ్మారి దయవల్ల మిగిలిన వొకటి రెండు పత్రికలు గూడా మూతబడిపోయాయి. యిప్పుడు మనం చేయగలిగింది "చేయెత్తి జై కొట్టు తెలుగోడా! గతమే కీర్తిగల వాడా!" అని పాడుకోవడం మాత్రమే!

ప్రచురణ యంత్రాన్ని కనిపెట్టిన తర్వాత పారిశ్రామిక విప్లవం మధ్య తరగతి సంఖ్యను పెంచడంతో బాటూ వాళ్లకు కొంత తీరికను కూడా కలగజేసిన తర్వాత, యూరపులో పత్రికల ప్రచురణకు బాగా వూపొచ్చింది. పుస్తక ప్రచురణా, వార్తాపత్రికల ప్రాచుర్యమూ మానవుల లౌకిక సాహిత్య సాంస్కృతిక జీవితానల్ని ప్రభావించేసాయి. దానితో లోకపు తీరే మారిపోయింది. పుస్తకాలూ, పత్రికలూ లేకపోయివుంటే ప్రపంచం యిప్పుడున్నట్లుగా వుండేదేకాదు.

మద్రాసుకు అచ్చుయంత్రం 1806 ప్రాంతానికే వచ్చింది. కానీ 1830 వరకూ తెలుగు పుస్తకాల ప్రచురణ ప్రారంభం కాలేదని బ్రౌన్ మహాశయుడొకచోట చెప్పారు. 1989లో తాను ప్రచురించిన తెలుగు పత్రికల సేవ అనే పుస్తకంలోనయితే తిరుమల రామచంద్రగారు, తెలుగులో వార్తాపత్రికా సంప్రదాయం 16వ శతాబ్ద చివరిలో వచ్చిన 'రాయవాచకం'తోనే ప్రారంభమైందంటారు. విశ్వనాథ నాయకుని స్థానాపతి శ్రీ కృష్ణదేవరాయలు దినచర్యను గురించి రాసిన యీ పుస్తకాన్ని పత్రికల ఆరంభమనుకోవడం కేవలం పాక్షికమైన సత్యమేనని గూడా రామచంద్రగారే చెప్పారు.

ఆధునిక సాహిత్య ప్రక్రియలైన కథ, నవల, వ్యాసం లలాగే పత్రికలు, పత్రికారచన అనేది గూడా పాశ్చాత్య ప్రభావంతో వచ్చినదేననుకోవడంలో తప్పులేదు. ప్రముఖ భాషావేత్త జి.ఎన్.రెడ్డి గారు తెలుగులో మొదటి పత్రికగా "కర్నాటక క్రానికల్"ని గుర్తిస్తారు. అది 1832 ప్రాంతంలో వచ్చినట్టుంది. అప్పటి నుంచీ లెక్కబెడితే కొన్ని వందల పత్రికలు తెలుగులో వచ్చి, కొంతకాలం జీవించి, తరువాత మాయమైపోయాయి.

1908 సెప్టెంబరు 8వ తేదీన బొంబాయిలో కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారిచే ఆంధ్రపత్రిక, వారపత్రిక ప్రారంభంగావడం తెలుగు పత్రికల చరిత్రలో బంగారు అక్షరాలతో రాసి గుర్తు పెట్టుకోవలసిన సందర్భం. 1910 నుంచే ఆంధ్రపత్రిక ఉగాది సంచికలను ప్రచురించడం. ఆ సంవత్సరా ప్రత్యేక సంచికలు మొత్తం తెలుగువారి సాహిత్య సాంస్కృతిక వైభవానికంతా ఆవిష్కరాలుగా తయారుగావడం ఆనాడు మధురానుభూతి. 1914లో ఆంధ్రపత్రిక మదరానుకు తరలిరావడంతో మరో కొత్త అధ్యాయం ప్రారంభమయింది. అప్పటి నుంచీ ఆంధ్రపత్రిక దిన పత్రిక గూడా ప్రాంభమయింది. ఆంధ్ర వారపత్రికతో బాటూ కాశీనాథుని నాగేశ్వరరావు గారు 1924లో "భారతి" అనే గొప్ప సాహిత్య సాంస్కృతిక మాసపత్రికను ప్రారంభించడం మరో మరుపురాని సంఘటన. కాశీనాథుని నాగేశ్వరరావుగారి తరువాత శివలెంక శంభుప్రసాద్ గారి సంపాదకత్వంలో ఆంధ్రపత్రిక, భారతి పత్రికలు ఆధునిక తెలుగు సాహిత్యంలో వొక గొప్ప స్వర్ణయుగానికి భూమికలుగా రూపొందాయి.

1970 ప్రాంతాల్లో తెలుగులో చాలా సాహిత్య సామాజిక పత్రికలుండేవి. ఆంధ్రపత్రిక వార పత్రికతో పాటు ఆంధ్రప్రభ వార పత్రిక కూడా సమాన ప్రాచుర్యంతో నడిచేది. ఆంధ్రభూమి, ఆంధ్రజ్యోతిలతో పాటు కొద్ది రోజుల పాటు మాత్రం ఉండిన పొలికేక, ఆదివారం మొదలైన మరికొన్ని వారపత్రికలు వచ్చేవి. యువ, జ్యోతి మాసపత్రికలతో బాటూ విజయ, నీలిమ, తరుణ, విజేత మొదలైన మాసపత్రికలు కొద్దికాలం పాటూ నడిచాయి.

అప్పుడు ఆంధ్రపత్రిక ఉగాది ప్రత్యేక సంచిక వచ్చేది. దీపావళికి యువ, జ్యోతి, ఆంధ్రజ్యోతి నుండి వచ్చే ప్రత్యేక సంచికలు గొప్ప సాహిత్య వార్షిక సంరంభాలుగా వుండేవి. ఆతరువాతి కాలంలో స్వాతి మాసపత్రిక వచ్చి, దానికి కొనసాగింపులా స్వాతి వారపత్రిక కూడా వచ్చి చాలా ప్రాచుర్యాన్ని పొందింది.

ఈనాడు పత్రిక వచ్చాక దానితో బాటూ చతుర, విపుల అనే మాసపత్రికలు పుట్టాయి. పిల్లల కోసం ప్రత్యేకంగా మొదలైన చందమామ మాసపత్రికది మరొక పెద్ద వైభవం. బాలమిత్ర, బొమ్మరిల్లులతోబాటూ మరికొన్ని బాలల మాసపత్రికలు చాలా వచ్చి కొద్ది సంవత్సరాలపాటూ మనగలిగాయి.

మొత్తం తెలుగు రాష్ట్రమంతా ప్రాచుర్యంలో ఉండే యీపత్రికలతో బాటు అనేక ప్రాంతీయ వార, మాసపత్రికలు కూడా వుండేవి. ఆ సంఖ్యను లెక్కబెట్టగలిగితే వేలను దాటొచ్చు. కేవలం వార్తలకు, రాజకీయాలకూ, సినిమాలకు, భక్తికీ కూడా ప్రత్యేకమైన చాలా వార మాసపత్రికలు కూడా పుట్టి కొంతకాలం బతికాయి. కేవలం సంచలనాన్ని ఆలంబనగా చేసుకొనే పత్రికలూ కొన్ని వుండేవి. ఆంధ్రప్రదేశ్ పేరుతో ప్రభుత్వ పత్రిక ఇటీవల వరకు వచ్చింది.

1991లో ఆంధ్రపత్రిక వారపత్రిక ఆగిపోవటంతో యీ పత్రికల చరమదశ ప్రారంభమైంది. భారతి మాసపత్రిక కూడా ఆప్రాంతంలోనే

ఆగిపోయింది. ఆంధ్రప్రభ వారపత్రికది కూడా ఆంధ్రపత్రికతో దీటైన చరిత్ర. విద్వాన్ విస్వం గారి కలం నుంచీ వాకాటి పాండురంగరావు గారి వరకూ గొప్ప సంపాదకుల నేతృత్వంలో ఆ పత్రిక తెలుగు కథకూ, నవలకూ గొప్ప ఆలంబనగా వుండేది. 1960-70 ప్రాంతాల్లో వారం వారం బాపు బొమ్మలతో సీరియల్లు గా రావడం తెలుగు నవలా చరిత్రలో మరుపురాని రోజులు. పురాణం సుబ్రమణ్యశర్మ గారి సంపాదకత్వంలో వచ్చిన ఆంధ్రజ్యోతి వార పత్రిక ఆనాటి సాహిత్య ప్రమాణాలకంతా దీటురాయిగా వుండేది. ఇక వ్యాపార నవలల ప్రచురణలో ఆంధ్రభూమి వార పత్రిక సంచలనాలను సృష్టించింది.

1995 వరకూ తెలుగు ప్రాంతాల్లోని ప్రతి నగరంలోనూ అద్దెకు పత్రికలనిచ్చే అంగళ్లు చాలా వుండేవి. వూర్లో చాలా చోట్ల పత్రికలనమ్మే అంగళ్లూ కనిపించేవి. 1980 ప్రాంతంలో దూరదర్శన్ కార్యక్రమాలకే పరిమితమైన టీవీ రాకతో కొత్త పరిణామాలు వచ్చాయి. సినిమా హాళ్ళతో పోటీ పడేలా టీవీ పార్లర్లు పుట్టాయి. వాటి ప్రభ వొకటి రెండు సంవత్సరాలు సాగింది. టీవీలోకి వ్యాపార ఛానళ్లు రావడంతో పాఠకుల్లో చాలా మంది అక్కడికి వలసపోవడం ప్రారంభమయ్యింది. వినోదానికి వ్యాపార నవలలూ, కథలు, చదివే పాఠకులు టీవీకి వెళ్లడం వల్ల పెద్ద ఇబ్బందేమీ లేదని కొందరు సరి పెట్టుకోజూశారు. వ్యాపార నవలలు రాసే రచయితలు సాహిత్యం నుంచీ వేరే విషయాలకు వెళ్లిపోవడం మంచిదేనని అనుకున్నారు. తమ ప్రాచుర్యాన్ని పెంచుకోవడానికి దినపత్రికల్లో గూడా సీరియల్ నవలల్ని ప్రచురించిన సందర్భాలు తగ్గిపోయినా పర్వాలేదనుకొన్నారు. అయితే క్రమక్రమంగా వార పత్రికలొక్కక్కటిగా అగిపోవడం ప్రారంభమయింది. అంతకు ముందే యువ, జ్యోతి అగిపోయాయి. పెద్దలు కూడా ఆవురావురమని యెదురు చూసూ్త ఉండిన "చందమామే" ఆశాభంగాన్ని మిగిలించింది. కొతకాలం పాటూ తెలుగు కథకు ప్రోత్సాహాన్నిచ్చిన ఇంటియాటుడే వారపత్రిక ముందు సాహిత్యాన్ని వదిలి పెట్టి తరువాత తెలుగునే మరిచిపోయింది.

2020 ఫిబ్రవరిలో కోవిడ్ అనే విపత్తు తెలుగు ప్రాంతాలను తాకేటప్పటికి తెలుగు పత్రికలు కొన్ని బలవంతంగానయినా మిగిలేవుండేవి. యీ చీకటి కాలంలో నవ్య అనే ఆంధ్రజ్యోతి వారపత్రిక మూతబడిపోయింది. చివరకు ఈనాడు యాజమాన్యం కూడా విపుల, చతుర అనే మాసపత్రికల్ని వెబ్ పత్రికలుగా కుదించేసింది. యిప్పుడు తెలుగు సాహిత్యానికి మిగిలిందల్లా పాలపిట్ట, చినుకు, విశాలాక్షి, అనే కొన్ని చాలా పరిమితమైన ప్రాచుర్యముండే పత్రికలు మాత్రమే. కొన్ని దినపత్రికల ఆదివారం అనుబంధాలు మూడునాలుగు పేజీల్ని కథకోసం కేటాయించి తమ వుదారతకు తామే మురిసిపోతున్నాయి. వొకప్పుడు పరిమితమైన విద్యావంతులకూ, విదేశీయులకు మాత్రమే అందుబాటులో వుండిన, వుండగలిగిన అంతర్జాల పత్రికలు యీ చీకటికాలంలో తెలుగు కథ, నవల, కవిత్వాలకు ఆలంబనగా మిగిలివున్నాయి.

మన యిరుగుపొరుగు భాషలయిన తమిళ, కన్నడ, మలయాళాలలో యేంజరుగుతూ వుందో తెలుసుకోవడం కోసం కొందరు మిత్రుల్ని అడిగి చూశాను. మలయాళంలో యిప్పుడుకూడా బాగా ప్రాచుర్యంలో వుండే వార, మాసపత్రికలు యిరవైవరకూ వున్నాయట. యీ కరోనా సమయంలో కూడా కొన్ని పత్రికలు 'వోనం' పండుగ ప్రత్యేక సంచికలు ప్రచురించాయట! తమిళంలో యిప్పుడు గూడా పదిపన్నెండయినా కథలూ, నవలలూ, కవిత్వమూ ప్రచురించే వార మాసపత్రికలున్నాయన్నారు. అయితే తెలుగులో వొకప్పుడు ప్రచురించినంత ఖరీదైన పత్రికల్లాగాకుండా అవి మామూలు కాగితం పైనే ప్రచురించబడుతున్నాయి. అందువల్ల వాటిఖరీదూ తక్కువే! చదివేవాళ్ళూ యెక్కువే! కన్నడంలోనూ దాదాపుగా అదే పరిస్థితివుంది. మన యీమూడు సోదరభాషలతో పోలిస్తే దాదాపుగా రెట్టింపు జనసంఖ్యవుండే మన తెలుగులో మాత్రమే పత్రికలు బతికి బట్టగట్టలేకపోయాయి. పత్రికలు మూతబడ్డాయని కేవలం రచయితలు మాత్రమే వాపోతున్నారు. అసలు పత్రిక అనే వొక సాంస్కృతిక భూమిక వుండేదని గుర్తయినా లేని జనం మాత్రమే తెలుగులో మిగిలిపోయారు.

యీ కరోనా సమయంలో మలయాళ ప్రభుత్వం పనిగట్టుకుని యింటింటికీ పుస్తకాల్ని చేర్చే యేర్పాటు చేసిందట! తెలుగు రాష్ట్రాల్లో గ్రంధాలయాలన్నీ యిప్పుడు దాదాపుగా చారిత్రక శిధిలాలుగా మారిపోతున్నాయి. తమిళమూ, కన్నడమూ, మలయాళాలలో వచ్చే పుస్తకాలను ప్రభుత్వమే వందలసంఖ్యలో కొని గ్రంధాలయాలకు చేరుస్తోంది. ఆంధ్రప్రదేశ్ లో ప్రభుత్వ ప్రచురణగా వసూ్తవుండిన "ఆంధ్రప్రదేశ్" అనే మాసపత్రికకూడా ఆగిపోయిందని అనుకునేవాళ్ళు సయితం యిప్పుడులేరు.

కథ, నవల అనే ఆధునిక సాహిత్య ప్రక్రియలు పత్రికలు పుట్టిన తరువాతే (లేక పత్రికలతో బాటూనే) పుట్టి యింత ప్రయాణము చేశాయి. టాల్స్టాయ్, డాస్టోలిస్కీ, చార్లెస్ డికెన్స్, చెకొవ్, మొపాసా, ఓహెన్రీ, స్టెయిన్‌బుక్, రవీంద్రనాధ్ టాకూర్, శరత్ చంద్ర ఛటర్జీ, ప్రేమ్‌చంద్-యీ ఆధునిక రచయితల జాబితా చాలా పెద్దది. పత్రికలు లేకుండా యీ రచయితలెవర్నీ వూహించలేరు. ఆధునిక ప్రపంచ సాహిత్యానికంతా పత్రికలే ఆలంబన. టీ.వీ సినిమా వంటి ఆధునిక మాధ్యమాలెన్ని వచ్చినా తెలుగు ప్రాంతాల్లో తప్ప మిగిలిన అన్ని చోట్లా పత్రికలు అవసరమైనంత స్థాయిలో వెలుగుతూనే వున్నాయి.

1980 ప్రాంతంలో రచయితలకు ప్రచురించుకోవడానికి పత్రికలు వుండడమే కాదు, రాసినందుకు పారితోషికాలు కూడా వుండేవి. క్రమంగా పారితోషికాలు ఆగిపోయాయి. పాఠకులు తగ్గారు. అయినా దాదాపొక యాభైమంది వరకూ రచయితలు వందల సంఖ్యలో కవులూ రాయడమన్నదొక బాధ్యతగా రాసుకుంటూ పోతున్నారు. వున్న, మిగిలిన కొద్దిమంది పాఠకులకూ, రచనలకూ మధ్య వారధిగా వుండాల్సిన పత్రికలే కూలిపోతే రచనల అస్తిత్వానికి ప్రశ్నలే మిగిలుతాయి. గత పది సంవత్సరాలుగా ఐటీ రంగంలో స్థిరపడిన విద్యావంతులూ, విదేశాల్లో స్థిరపడిన తెలుగువాళ్ళు బాగా చదవడమేకాకుండా, విడిగా రాయటంలో గూడా సాధన చేస్తున్నారు. అయితే అంతర్జాలానికి మాత్రమే పరిమితమైన ఆ సాహితీ సృజన అందరికీ అందుబాటులో వుండేలా కొన్నయినా పత్రికలుండాలి గదా!

యిదొక అరణ్యరోదనం!

యెవరు పట్టించుకుంటారు?

యాత్రాసాహిత్యం

# 'ఆమె లేఖలు'

(గత సంచిక తరువాయి...)

**14వ లేఖ**

మూల రచన : జూలియా చార్లోటి
అనువాదం : కీ.శే. పెన్నేపల్లి గోపాలకృష్ణ,
డా. కాళిదాసు పురుషోత్తం
90006 42079

**తెల్లదొరల ప్రభుత్వం మీద ప్రజలు తిరగబడ్డారు.**

మద్రాసుకు ఆరువందల మైళ్లలో ఒక కొత్త గిరిజన జాతి ఈ తిరుగుబాటును లేవనెత్తింది. ఇంగ్లీషువారిలో కలవరం రేకెత్తించిన ఈ తిరుగుబాటును ప్రభుత్వం త్వరలోనే అణచివేయడంతో అంతా సద్దుమణిగింది.

డిసెంబరు 15వ తేదినాటి ఉత్తరం ముగింపులో ఆమె ఈ తిరుగుబాటును ప్రస్తావించింది. తిరుగుబాటును గురించి పత్రికల్లో చదివి, మీరు భయపడిపోయారా ? అని ఇంగ్లండు నుంచి వచ్చిన ఉత్తరంలో చదివి, దానికి సమాధానంగా ఆమె ఈ విషయం ప్రస్తావించింది. 'పెన్నివిజిల్' రాజాగారింటికి వెళ్లి తిరిగి వచ్చేసరికి, ఇంట్లో ఒక కొత్త అతిథి వచ్చి ఉన్నాడు. అనుకోని అతిథి, అయినా అతన్ని జదంపతులు బాగానే యిష్టపడ్డారు.

అతను తిరుగుబాటును అణచడంలో ప్రభుత్వానికి తోడ్పడ్డాడు. ఇంతవరకూ ఎవరికీ తెలియని ఒక కొత్త కొండజాతివాళ్లు ఈ తిరుగుబాటులో పాల్గొన్నారు. వాళ్లు చక్కగా, ధీరంగా, భయంకరంగా ఉంటారు. దేహదారుఢ్యంలోను, అలవాట్లలోనూ వాళ్లు యూదుజాతివాళ్లను పోలివుంటారట. వాళ్లు కంటికి కనబడని దేవుళ్లను, చెట్టుమీద వుండే ఒక భూతాన్ని ఆరాధిస్తారట! దాన్ని దయ్యంగా భావించి శాంతింప చెయ్యడానికి పూజలు కూడా చేస్తారట. ఇళ్లు చెక్కతో కట్టుకొంటారు. నేల, గోడలు, కప్పు అంతా దేవదారు కలపతో వేస్తారట – ఆ ఆగంతకుడు వివరించాడు.

ఈ జాబులో ద్రాక్షారామం 'పెన్నీ విజిల్' రాజాగారి ఆతిథ్యం విషయాలు ఆమె వివరంగా వర్ణించింది. ఆ ప్రయాణం అంతకష్టం అని తెలిసుంటే తల పెట్టి వుండేదాన్ని కాదు. దూరం పదిహేను మైళ్లని విని, సాయంకాలం ఐదున్నరకు బయల్దేరి రాత్రి పది గంటలకు చేరుకోవచ్చని భావించింది. తీరాచూస్తే 30 మైళ్లు రోడ్డు లేదు. దారిలో కుండపోతగా వాన. పల్లకీ మోసే బోయీలు పాడేపాట కూడా వినరానంత కుంభవృష్టి. పైగా కటిక చీకటి. రాత్రంతా మోకాలుబంటి నీళ్లతో పత్తి తోటలను దాటుకొంటూ, పన్నెండు గంటలు ప్రయాణం చేసి ద్రాక్షారామం చేరారు. బండికంటే పల్లకీ ప్రయాణమే సులభమని ఆమె భావించింది.

ద్రాక్షారామంలో బాటసారుల కోసం కట్టిన ఒక సత్రంలో జదంపతులకు బస ఏర్పాటయింది. పాత తివాచీలు పరిచి అలంకరించారు. బ్రేక్ ఫాస్ట్ తిన్న తర్వాత,

జదంపతులు రాజాగారి భవనానికి బయలుదేరారు. పెద్ద హంగామాతో స్వాగతం పలికారు. ముందు మేళతాళాలతో ఒక బృందం. ఆ సంగీతం మన Rossinni ని అనుకరిస్తున్నట్లుంటుంది. తర్వాత ధ్వజాలు, ఖడ్గాలు, వెండి బెత్తాలు, పతాకాలు ధరించినవారి ప్రదర్శన. అటు తర్వాత అతిథులకు రకరకాల బిరుదులు ప్రకటించారు. ఆ బిరుదులేవీ ఆమెకు ఒక్క మాట కూడా అర్థం కాలేదు. తర్వాత నాట్యగత్తెలు ముందుకొచ్చి, మడిమలలోతు బురదలో వికారంగా చేతులు తిప్పుతూ నాట్యం మొదలు పెట్టారు. ఎ – మొదట్లో కాస్త సిగ్గుపడ్డాడేమోకాని, తర్వాత ఆ నృత్యం చూస్తూ ఆమెతో పాటు నవ్వడం మొదలు పెట్టాడు.

జదంపతులు రాజభవనం సింహద్వారం వద్దకు చేరగానే ఒక ఏనుగుచేత వారికి పూలమాలలు వేయించారు. రాజాగారి దర్బారు జనంతో కిటకిటలాడుతోంది. యాభై మందికి పైగా నాట్యగత్తెలను తెప్పించారు. అందరూ వంగివంగి సలాములు చేస్తుంటే జదంపతులు మెల్లగా రాజాగారి మందిరం ప్రవేశించారు. రాజాగారు వారిపై పావుగంట సేపు ఉపన్యాసం చేసి స్వాగతం పలికారు. అతిథుల కోసం ప్రత్యేకించిన గదుల్లోకి రాజాగారే స్వయంగా తీసుకొనిపోయి, వారితో కాసేపు ముచ్చటించి వెళ్లారు.

రాజాగారి భవనంలో చాలా గదులున్నాయి. అంతా బురదే! వాటిలో నడవడం కష్టం. ఐతే, చుట్టూ సన్నటి దారి వుంది. ఇది గట్టినేల కావడంతో, గోడలు పట్టుకొని జారిపోకుండా అడుగులో అడుగువేస్తూ నడిచారు. వాళ్లకోసం ఏర్పాటైన గదులు కూడా అలాంటివే. ఒక వైపు మకాంనే వాళ్లు హాల్ అంటారు. దాన్ని, దానికి అనుబంధంగా వున్న గదుల్ని ఆ దంపతు లుండడానికి ఏర్పాటు చేశారు. అందులోంచి దర్బారుకు దారి వుంది. తలుపులు, కిటికీలు లేవు. పెద్దగది చివర వో చిన్నగది, నౌకర్లకు కాస్త స్థలం. మిగతా మూడు వైపుల నుంచి కూడా దర్బారుకు దారులున్నాయి. వాటిలో ఒకటి రాజాగారి మందిరానికి వెళ్తుంది. మాగది, వసారా మధ్య వీధి వైపుకి ఒక చెక్కమంటపం వుంది. అందులో రాజాగారు ఒంటరిగా కూచొని చుట్టకాలుస్తారట! గదిలో టేబిల్, తివాచీ, నాలుగు కుర్చీలు, రెండు పేము సోఫాలు, కాళ్లకిందికొక స్టూలు వున్నాయి. గోడలకు స్థానిక చిత్రకారులు వేసిన దేవుళ్ల పటాలు వున్నాయి. చక్కని ఫ్రేములున్న, రెండు ఫ్రెంచి అద్దాలను అప్పుడే తెరిచి ప్యాకింగ్ కేసులతోనే గోడలకు వేలాడదీశారు. మరో రెండు షేవింగ్ అద్దాలు కూడా వున్నాయి. "పెన్నివిజిల్" గారికి బొమ్మలంటే చాలా యిష్టం, మాకు చూపించడానికి మరికొన్ని గుర్రాలు, నక్కల వర్ణచిత్రాలు తెప్పించారు. అవి రాజాగారికి చాలా కాలం క్రితం ఎవరో ఇంగ్లీషువారు ఇచ్చినవి. అక్కడక్కడ రంగు వెలిసిపోయి వుంటే వాట్ని బాగు చేస్తానన్నాను.

అందుకు రాజాగారు చాలా సంతోషపడిపోయారు. ఓ నక్క బొమ్మలో రంగులు సరిచేస్తుంటే, ఆయన అక్కడే నిల్చొని 'ఆహా ఎంత గొప్ప నైపుణ్యం! కొత్త బొమ్మలా తయారు చేశారంటూ ఆశ్చర్యపోయారు. అదే అదను అనుకొని ఎ – స్త్రీలు బాగా చదువుకోడంవల్ల కలిగే లాభాల గురించి తను ఎప్పుడూ చేసే ఉపన్యాసం యిచ్చేశారు. ఆడపిల్లలకు చదువు చెప్పడం మంచిదేనని పెన్నీవిజిల్ కూడా ఒప్పుకొన్నారు కానీ, తన ప్రజలు వట్టి దుర్బలులని, వారికి యిష్టం లేదని, వారికి యిష్టం లేని పని తాను చేపట్టలేనని

అన్నారు. "ఆయనతో కాసేపు మాట్లాడిన తర్వాత, నిద్రపోవాలని చెప్పి ఆయన్ని సాగనంపేశారు. 'అవును, నిద్రపోవడం ఆరోగ్యానికి చాలా అవసరం' అంటూ ఆయన వెళ్లిపోయారు. అలా అనడం మర్యాద. నౌకర్లు కూడా భోజనానికి వెళ్లేముందు "అన్నం తినడం మనిషికి చాలా అవసరం, ఒంటికి మంచిది కూడా" అని చెప్పి సెలవు తీసుకుంటారు.

రాజాగారు భోజనం పంపారు. ఆమె తనకు కావలసిన ప్లేట్లు, ఫోర్కులు, కత్తులు, బ్రెడ్, బీరు తన వెంట తెచ్చుకొన్నది. అవన్నీ తెచ్చుకోవలసినదిగా రాజాగారే కోరారు. భోజనంతోపాటు ఆకులు వేసిన ఇత్తడి పళ్లాలు పంపారు. భోజనానికి పలావు, ఆవగాయలు, పదిపన్నెండు రకాల పచ్చళ్లు, రకరకాల కాయగూరలు, కేకులు వచ్చాయి. "ఈ రాజాగారి స్థాయికి చెందిన బ్రాహ్మణులు ఎప్పుడూ అరటాకుల్లోనే భోజనం చేస్తారు."

భోజనానంతరం ఊరు చూడ్డానికి అతిథుల్ని తీసుకెళ్లారు, మేళతాళాలతో. జడ్జదంపతులు పల్లకీలో, రాజాగారు సింహాసనం లాంటి కుర్చీలో కూర్చొని ఊరేగారు. ఊరు ఊరంతా ఆ ఉత్సవం చూడడానికి తరలివచ్చింది. పల్లకీ తలుపు కాస్త మూసివుండేసరికి, రాజాగారు గబగబా వచ్చి ఆ తలుపు తెరిచి, ప్రజలకు దర్శనమివ్వవలసినదని ఎ–ని ప్రాధేయపడ్డారు.

ఊళ్లో అన్నీ మట్టి యిళ్లే. ఎవో కొన్ని మంచి యిళ్లు తప్ప, వేటికీ వెల్లకూడా వెయ్యలేదు. వీధుల్లో మడిమల్లోతు బురద. అంత మురికిలో కూడా అక్కడక్కడా ఆపాదమస్తకం ఆభరణాలు ధరించిన స్త్రీలు, కాశ్మీరు శాల్వలు కప్పుకొన్న పురుషులు ఆ మట్టి యిళ్లలోంచి తొంగి చూసే వాళ్లు. ఆడంబరం, పేదరికం పెనవేసుకోపోవడంలా వుండేట్లుంది వాళ్లను చూస్తే!

ఒక దేవాలయానికి తీసుకెళ్లారు. ఆమె ఇది వరకెన్నడూ దేవాలయం చూడలేదు, లోపల ఏముందో చూడాలని ఆసక్తి. "మొదట పెద్ద ఆవరణ, చుట్టూతా ఎత్తైన గోడ. దానికి అన్ని వైపులా పెద్ద పెద్ద ద్వారాలు. గోపురాల్లా ఆ ద్వారాలను చూసి అవే దేవాలయాలను కొనే దాన్ని. కానీ అవి ముఖమంటపాలట, ప్రధాన ద్వారం నుంచి లోపలికి వెళ్లగానే విశాలమైన స్థలం చూసి గుడిలోకి వచ్చేశామనుకున్నాను. అదంతా దాటుకొని పోతే లోపల చతురస్రాకారంలో ఒక కట్టడం వుంటుంది. దాని ప్రధాన ద్వారం ఎదుట మండపం – అందులోంచి వెళితే గుడి అదొక అద్భుతమైన స్వప్నమందిరంలా వుంది. బాగా కిందికి వున్న కప్పు, చీకటిలో కలిసిపోయే పెద్ద రాతి స్తంభాలు, గోడలో చక్కని గూళ్లు, అక్కడక్కడా పెద్ద తలపాగాలతో కనిపించే మనుషులు. ఏదో కలగంటున్నట్లు అనిపించే అలాంటి ప్రదేశాన్ని నేనెప్పుడూ చూడలేదు. మధ్యలో గర్భగుడి ముందుకు మమ్మల్ని తీసుకెళ్లారు. అక్కడి నుంచి కాస్త వంగి చూస్తే, లోపల అంతా కనపడేదేగానీ, అలా వొంగితే విగ్రహం ముందు వంగి మొకరిల్లినట్లు అనుకుంటారేమోనని మానేశాను."

ఊరు చూడ్డం పూర్తయి, ఇంటికి తిరిగి వచ్చేసరికి గుడ్డి దీపాలు వెలుగుతున్నాయి. నాట్యగత్తెల నాట్యం, బాణాసంచా పేల్చడం సాగుతోంది. జనం తండోపతండాలుగా వున్నారు. ఆ వేడి, వెలుతురు, ఆ అరుపులు, ఆర్భాటాలకు తట్టుకోలేక, కాసేపటికి దంపతులు తమ గదులకు వెళ్లారు. గదుల్లో అంతా పాశ్చాత్య పద్ధతుల్లో ఏర్పాట్లు చేశారు. మాటీ (Matee) కొవ్వొత్తులు వెలిగించి, టేబిల్ మీద టీ, పుస్తకాలు, డ్రాయింగ్ సరంజామా అంతా చక్కగా అమర్చాడు. ఒక్క నిమిషంలో దృశ్యం పూర్తిగా యిలా మారిపోవడం ఆశ్చర్యం కలిగించింది. ఐతే, మర్నాడు అంతా ఎప్పటి మాదిరి. అంతా స్థానిక పద్ధతికి వచ్చేసింది. "ఏనుగు మీద తిప్పండని పంతుల్ని (రాజాగారి అసలు పేరు) అడిగాను. వెంటనే ఏనుగును తెప్పించారు. కానీ దానిపైకి ఎక్కడం కష్టమైంది. పనికిమాలిన నిచ్చెన వేశారు. హౌదా కూడా సరిగా లేదు. ఎవరో ఇంగ్లీషువాడు తయారు చేసి యిచ్చాడట. నాసిరకం అంబారీ, దానిమీద ఎక్కి కూర్చోవాలంటే భయం వేసింది. చివరకు ముందు ఏనుగు, దాని వెనక పల్లకీలో కూర్చొని ఆమె రాజాగారి తోట చూడ్డానికి బయలుదేరింది. "దాన్ని రాజాగారు తోట అంటారు. తమలపాకుల తోట, కొబ్బరిచెట్లు, అంతా బురదబురద, మరేమీ లేదు" అంటుంది.

వనవిహారం పూర్తి చేసుకొని యింటికి రాగానే రాజాగారు తన భార్యను ఆమెకు పరిచయం చేశారు. తనకు ఆమెను చూడాలని ఉన్నా, ఆయన ఏమనుకొంటారోనని అడగలేక పోయింది. ఈ విధంగా ఆ కోరిక తీరింది. ఎ–గదిలో లేనపుడు రాజాగారు ఆవిడను వెంటపెట్టుకొని వచ్చి పరిచయం చేశారు. అందమైన యువతి. చక్కని ముఖ వర్చస్సు. బంగారు జరీ అంచు పచ్చని చీరకట్టి ఒంటినిండా నగలు, నడుముకు బంగారు నాణేలు పొదిగిన వడ్డాణం పెట్టుకుంది. వెంట వచ్చిన దాసీజనం ద్వారం వద్దనే నిలిచిపోయారు. రాజాగారి గుమాస్తా మాత్రం ఆవిడ వెనక నిల్చొని, ఎలా నడుచుకోవాలో చెప్తున్నాడు. జడ్జిగారి జవాన్లలో ఒకడు దుబాసీగా వ్యవహరించాడు. "ఆవిడ వచ్చీరాగానే సిగ్గుతో వంకర్లు తిరిగిపోయి, ఏం చేయాలో తెలియక, నిల్చుండిపోయింది. అప్పుడు గుమాస్తా సలాములు చేసి, కుర్చీలో కూర్చొనవలసిందిగా చెప్పాడు. ఆ తర్వాత నేనూ అలాగే చేశాను. ఒకరి భాష ఒకరికి తెలియదు. రాజాగారి భార్యకైతే ఇంగ్లీషు బొత్తిగారాదు. నాకు జెంటూ (తెలుగు) ఎంతవరకు తెలుసునంటే, మా జవాను మా సంభాషణలను తన యిష్టం వచ్చినట్లు మార్చి, ఒకరినొకరు తెగ పొగిడినట్లు తర్జుమా చేస్తుంటే కనుక్కోగలిగినంత మాత్రం తెలుసు. ఆవిడ బట్టల మీద చాలా ఆసక్తి కనబరచింది. నా టోపీ (Bonnat) చూసి ముచ్చటపడి మునివేళ్లతో తాకింది. ఆవిడకు కొన్ని చిత్రాలు చూపించాను. వాట్ని తల్లకిందులుగా పట్టుకొని చాలా బాగున్నాయని మెచ్చుకొంది. ఎ – గదిలోకి వచ్చేదాకా ఆవిడ చాలా సరదాగా గడిపింది. అనుకోకుండా ఎ – గదిలోకి రాగానే, ఒక్క ఉదుటున లేచి గబుక్కున వెనుదిరిగి గబగబా వెళ్లిపోయింది. అయితే ఎ – ఆవిడను ఇబ్బంది పెట్టడం యిష్టంలేక, నేరుగా లోపలికి వెళ్లిపోవడంతో ఆవిడ మెల్లగా తిరిగొచ్చి, దర్జాగా కూర్చుంటూ ఆయనకు క్షమాపణ తెలియజేయమన్నది – "మీరు మా తల్లిదండ్రులతో సమానం" అంటూ కూర్చుంది. అంత కంగారు పడిన ఆవిడ తనవెంట మగనౌకర్లు వుంటే పట్టించుకోలేదని ఆమె ఆశ్చర్యపోయింది.

ఇక్కడ వీళ్లరూ కబుర్లు చెప్పుకొంటుంటే, అవతల గదిలో ఎ – రాజాగారికి 'మేలుచేసే' విషయాలు బోధించే ప్రయత్నంలో వున్నారు. రాజాగారు అందరు బ్రాహ్మణుల్లా కాకుండా ఎ – చెప్పింది శ్రద్ధగా విన్నారని, కొన్ని పుస్తకాలు యిస్తే, తీసుకొన్నారని, ఆమె అంటుంది.

**డిసెంబరు నెల సంచిక నుండి:**....చదవండి.

## మా వూరు (నవల) ...అగరం వసంత్

కొద్ది నెలలకు ముందే 'సొతంత్రకాల సదువులు' పేరుతో ఒక రచన 'అమ్మనుడి'లో వచ్చింది. మరలా ఇప్పుడు 'మావురు' పేరుతో అగరం వసంత్, హోసూరు తెలుగు బతుకును మన ముందు నిలబెట్టబోతున్నారు. ఆటా మాటా పాటా, కూతా, చేతిరాతా, బిడీ గుడీ సాగుబడీ (సంస్కృతి), అన్నీ అంతా తెలుగుమయంగా ఉండిన హోసూరు తాపులో తెలుగుదివ్వె కొడిగట్టి మినుకుమినుకుమని రెప్పారుస్తూ ఉంది. ఈ మెలననంతా మనముందుకు తెస్తున్నాడు వసంత్. ఆ ఎలమినీ ............ చదివి పట్టించుకొందాం రండి.

దాంతో మర్నాడు మరికొన్ని పుస్తకాలు పంపామని, మద్రాసు నుంచి తెలుగు బైబిల్ కోసం కూడా రాశామని ఆమె ఉత్తరంలో వివరిస్తూ, "నీకు వీలైనప్పుడు అక్షరాలు రాసివుండే రెండు పెన్నీల "చేతిరుమాళ్లు" (moral pocket handkerchiefs) పంపు. ముఖ్యంగా రాణిగారి బొమ్మలున్నవి పంపు. అవి ఇక్కడివారికి బాగా నచ్చుతాయి" అని రాస్తుంది. రాజాగారి అభిరుచికి తగిన చిత్రాలను ఆమె బహూకరిస్తే, ఆయన చాలా సంతోషించినట్లు ఆ ఉత్తరంలో రాస్తుంది.

మొత్తంమీద యాత్ర బాగా జరిగిందని, తాము క్షేమంగా యిల్లు చేరుకున్నా దీని వల్ల తమకు మంచే జరిగిందని ఆమె సంతోషించింది.

## పాఠకులకు విన్నపం

"Letters from Madras" రచయిత్రి జూలియా చార్లోటి, తనపేరు లోకానికి తెలియకుండా అజ్ఞాతంగా ఉండి,"By a Lady" అనే మారుపేరుతో ప్రచురించింది. 1836-38 మధ్యకాలంలో ఆమెభర్త జేమ్సు థామస్ రాజమండ్రిలో జడ్జిగా పనిచేశాడు. జూలియాకు ప్రతివిషయం తెలుసుకోవాలనే అభిలాష. తను కన్నవీ, విన్నవీ అన్నీ లేఖలరూపంలో ఇంగ్లండులోని తనవారికి తెలియజేసింది. ఆమె ఈ లేఖలను ఎవరికి రాసింది తెలియదు. ఉత్తరాలలో ప్రస్తావనకువచ్చే వ్యక్తుల పేర్లన్నీ ఆమె మరుగుపరచింది.

ఈలేఖల్లో ఆనాటి ఆంధ్రదేశ ప్రజలజీవితం, ఆచారవ్యవహారాలు, విద్యావిధానం, కోర్టులు, న్యాయవాదులు, కోర్టులో సివిల్ క్రిమినల్ దావాలు, ప్రయాణాలు, కంపెనీ ఉద్యోగుల విలాసవంతమైన జీవితం ఇట్లా అనేక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. ఆమె తిరిగిన ప్రదేశాలను, చూసిన వ్యక్తులను కళ్ళకు కట్టినట్లు వర్ణించింది. వలస పాలకుల చూపుతో, స్త్రీదృక్పథంనుంచి అన్నిటినీ గమనించింది.

జడ్జి దంపతులను కలుసుకోడానికి విద్యావంతులైన వ్యక్తులు వచ్చినపుడు వారిని ఆమె హిందూమత విషయాలను అడిగి సందేహాలు తీర్చుకొనేది. వారికి క్రైస్తవమత గ్రంథాలు ఇచ్చి చదవమని ప్రోత్సహించేది. ఆ దంపతులకు మిషనరీ కార్యక్రమాలమీద మక్కువ ఎక్కువ.

మంచి సంగీతం వింటున్న సమయంలో మధ్యలో ఉన్నట్లుండి పాట ఆగిపోయినట్లు జూలియా చంటిబిడ్డకు ఆరోగ్యం బాగలేక పోవడంతో వైద్యుల సలహామేరకు, 1839లో ఇద్దరుబిడ్డలతో ఆమె ఇంగ్లండు వెళ్ళిపోతుంది. ఆమెభర్త థామస్ 1840లో అనారోగ్యంతో చనిపోయిన తర్వాత మూడేళ్ళకు ఆమె మెయిట్లాండ్అనే మతప్రచారకుణ్ణి పెళ్ళి చేసుకొని తనపేరును జూలియా మెయిట్లాండ్ గా మార్చుకుంది.

నామిత్రులు, సీనియర్ పత్రికా రచయిత స్వర్గీయ పెన్నేపల్లి గోపాలకృష్ణ మూడు దశాబ్దాలక్రితం ఈలేఖలను తన సొంతమాటల్లో వివరిస్తూ ముఖ్యమైన విషయాలు "ఆమెలేఖలు" పేరుతో అనువదించారు. ఆతర్వాత దాన్ని అనేక పర్యాయాలు తిరగరాసి, మెరుగులుదిద్ది అచ్చుకు సిద్ధంచేస్తున్న సమయంలో అనారోగ్యంతో చనిపోయారు. గోపాలకృష్ణ1986 ప్రాంతాల్లో తను తెలుగు చేసిన 24 ఉత్తరాల రఫ్ డ్రాఫ్ట్ ఫొటొ కాపి నన్ను చదివి అభిప్రాయం తెలియజేయమని పంపించారు. ఈ ప్రతిలో కొన్ని అంశాలు తగ్గించి అమ్మనుడిలో ప్రచురించడానికి పంపించాను. అమ్మనుడి సంపాదకులు ఇప్పటికి14 లేఖలు ధారావాహికగా ప్రచురించారు.

చాలామంది పాఠకులు ఫోన్ చేసి పుస్తకం వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ అసక్తిని గమనించిన తరువాత 'ఆమె లేఖలు'ను పుస్తక రూపంలో తీసుకుని రావాలని తలపెట్టాను. ఆ విషయాన్ని 'అమ్మనుడి' పత్రిక ద్వారా పాఠకులకు విన్నవించుకొంటున్నా. త్వరలో పుస్తకం వెలుగు చూడగలదని ఆశిస్తాను. అమ్మనుడి అందించిన సహకారానికి సర్వదా కృతజ్ఞుణ్ణి.

–డా॥ కాళిదాసు పురుషోత్తం, నెల్లూరు

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136), RNI-APTEL/2015/62362

## తెలుగు భాషోద్యమ సమాఖ్య

(రి.నెం. 1288/2003)

# తెలుగు చరవాణి యాపుల పోటీ, తెలుగు వ్యాసరచనల పోటీ

గడువు తేదీ: జనవరి 1, 2021 మధ్యాహ్నం 12 గంటలు

పోటి కట్టుబాట్లు, అంశాలు మరియు మరిన్ని వివరాలు:

https:/ telugubhashodyamasamakhya.blogspot.com

సంప్రదింపులు: tebhasaspoti@gmail.com

## మొత్తం రు.4 లక్షల బహుమతులు!

### చరవాణి యాపు పోటీ:

యాపు సమర్పణ

forms.gle/koWxehnW6unooDsW8

**మొదటి బహుమతి రూ 1 లక్ష, 1 జట్టుకు**

**రెండవ బహుమతి రూ. 50,000/-, రెండు జట్లకు**

**మూడవ బహుమతి రూ. 33,333/- మూడు జట్లకు**

### వ్యాసరచన పోటీ :

వ్యాస సమర్పణ

forms.gle/zWRdGfk7sCaQTC4n8

**వంద ఉత్తమ వ్యాసాలకు ఒక్కొక్క వ్యాసానికి వెయ్యి రూపాయల నగదు బహుమతి.**

తెలుగులో – తెలుగు నుడి (భాష) గురించి, తెలుగు చరిత్ర గురించి, తెలుగు సంస్కృతి గురించిన నాణ్యమైన సమాచారం అందరికీ అందుబాటులో లేదు. వలగూడు (అంతర్జాలం) వేదికగా అందుబాటులో ఉన్న తెలుగు వికీపీడియాను ఒక ప్రాతిపదికగా తీసుకుంటే పై అంశాల గురించి నాణ్యమైన ఒక వెయ్యి వ్యాసాలు కూడా ఉండవు. మన తెలుగు వారి జనాభా తెలుగు రాష్ట్రాల్లో, తెలుగు రాష్ట్రాల బయటా కలిపి 18 కోట్లు ఉంటే, కనీసం 18 మంది కూడా ఈ విషయమై చూపు సారించి తెలుగు వికీపీడియా లాంటి వనరుల్లో చురుగ్గా పనిచేయటం లేదు. ఏడాదికి కొన్ని పరిశోధనా పత్రాలు వెలువడుతున్నా, అవి ఏదో ఒక గ్రంథాలయ సొరుగులోకో, వెయ్యికి దాటని ప్రచురణలుగానో మిగిలిపోతున్నాయి. ఈ వెలితిని నింపుతూ, కొంతలో కొంత తెలుగు నుడి, తెలుగు చరిత్ర, తెలుగు సంస్కృతి అంశాల్లో సమాచారం వలగూడులో చేర్చే దిశగా తెలుగు భాషోద్యమ సమాఖ్య వ్యాసరచన పోటీని నడుపుతున్నది. నేడు వలగూడు అనేది సమాచారాన్ని పుట్టించటానికీ వాడుకకూ భద్రపరచటానికీ ఉన్న అతి పెద్ద వనరుగా మన ముందుంది. వలగూడులో చేర్చని వ్యాసం ఎక్కువ మంది చదువరులకు చేరదు కూడా. అందరికీ అందుబాటులో ఉండే విధంగా అంశాలను చెప్పాలంటే వలగూడే అందరికీ అందుబాటులోనికి తెచ్చే సాధనం.

అమ్మనుడి తెలుగుజాతి పత్రిక
AMMANUDI (Telugu Monthly)
November 2020 Vol :6, Issue 6
Date of publication : 1st of every month
Date of posting : 3rd & 6th of every month
RNI-APTEL / 2015/62362
Postal Reg NO. TEN/13/2018-20

Bommidala
International



దీపావళి
శుభాకాంక్షలు

# బొమ్మిడాల ఇంటర్నేషనల్ ప్రై.లిమిటెడ్

భారత ప్రభుత్వ గుర్తింపు పొందిన ఎగుమతి సంస్థ

బి.టి.సి.హౌస్, ఐదవ వీధి
చంద్రమౌళినగర్, గుంటూరు-522 007

Tel :91-863-2357615, 2357616
Fax : 91-863-2351343
E mail : murtybsk@bommidalainternational.com
bskmurty@yahoo.co.in
Website : www.bommidalainternational.com

If not delivered, please return to : 'The Publisher, AMMANUDI Monthly,
8-386, Jivaka Bhavanam,ANGALAKUDURU (po),TENALI-522 211,Guntur (dt) A.P. Cell:9440 448244